ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 02.11.2026 | సంపుటి:13 సంచిక:103 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



దేశాన్ని రక్షించాలంటే జ్ఞానేశ్‌ను తొలగించాల్సిందే..

సీఈసీని అడ్డుపెట్టి భాజపా ఓట్ల చోరీ చేస్తోంది : రాహుల్

ఆయనతో కలిసి మోదీ,షా దేశానికి ఆత్మలాంటి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేశారు



ఇది ఏ ఒక్క నేత, పార్టీ గళం కాదు. దేశ యువత, మహిళలు, రైతులు, కార్మికుల స్వరం. మతం కన్నా ప్రతి భారతీయుడి గళమే నాకు ముఖ్యం. రాజ్యాంగాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను అమోదించం. ఎన్నో ఏళ్లుగా దేశంలో ఓటు చోరీ జరుగుతోంది. దీని ద్వారానే ఎంపీ, రాష్ట్ర ఎన్నికల్లో గెలుస్తున్నారు. దేశ వ్యవస్థ మొత్తం కేవలం ఇద్దరు, ముగ్గురు చేతుల్లోనే ఉండటాన్ని కోరుకోవడం లేదు. దీన్ని ఆమోదించే ప్రసక్తే లేదు. దేశాన్ని గాడిలో పెట్టాలంటే మొదటగా జ్ఞానేశ్‌ను తప్పించడమే. ఆయన జైలుకు వెళ్లక తప్పదు - రాహుల్



గతంలో విపక్షాలను భయపెట్టేందుకు సీబీఐ, ఈడీ, ఐటీలను వాడుకున్న బీజేపీ, ఇప్పుడు వాటితో పనిజరగకపోవడంతో ఏకంగా ఎన్నికల సంఘాన్ని వాడుకుంటోంది సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను మోదీ, అమిత్ షాలు కాపాడుతున్నారు. ఆయన కోసం ఎంతోమందిని జైలులో పెడుతున్నారు. సీఈసీని అడ్డుపెట్టుకునే బీజేపీ పలు రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచింది. దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు మోదీని సాగనంపాలి..మోదీ హఠావో దేశ్ బచావో"
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

- దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పించుకోరు... ఆయనపై చర్యలు తీసుకోవాలి
- రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ
- జ్ఞానేశ్‌ను అడ్డుపెట్టి భాజపా ఓట్ల చోరీ
- గతంలో విపక్షాలను భయపెట్టేందుకు సీబీఐ, ఈడీ, ఐటీలను వాడుకున్నారు
- ఇప్పుడు కుదరకపోవడంతో ఏకంగా ఈసీనే వాడుకుంటున్నారు : ఖర్గే

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని మోదీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాత్రి నిద్రపోలేకపోతున్నారని.. వాళ్లు దేశానికి ఆత్మలాంటి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన ఆయన.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పించుకోలేరని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మిగతా 2లో..



ఓటు బచావో... దేశ్ బచావో పేరుతో ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభలో, అంతకుముందు సభ వరకు జరిగిన ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు





400 సీట్లు దాటి ఉంటే

రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర

20 కోట్ల ఓట్లు తొలగించేందుకు భాజపా పన్నాగం

- పేదలు, దళితులు, ఆదివాసీలు, మహిళలపై కక్ష పెంచుకున్న మోదీ
- ప్రధాని గద్దె దించేవరకు విశ్రమించం
- కాంగ్రెస్ శ్రేణులను ఢిల్లీకి రాకుండా అడ్డుకోలేకపోయారు
- ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఢిల్లీ(జనంసాక్షి): కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రాజ్యాంగాన్ని మార్చాలని,

మిగతా 2లో..

గతంలో శ్రీమంతులు, ఉన్నతవర్గాలకు ఓటు హక్కు ఉండాలని వాదించారు. అంబేద్కర్ దళితులు, గిరిజనులు, మహిళలు, యువతకు ఓటు హక్కు కల్పించారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే చర్యలు చేపట్టారు. జనాభా పెరిగిన మేరకు ఓటు హక్కు కల్పిస్తూ వచ్చారు. మూడోసారి 400 సీట్లు వస్తే రాజ్యాంగం రద్దు, రిజర్వేషన్లు తొలగించాలని కుట్ర చేశారు. ఓటు అనే ఆయుధాన్ని మోదీ తొలగిస్తారని బీజేపీని ప్రజలు ఓడించారు. ఆనాటి నుంచి దళితులు, గిరిజనులు, ఆదివాసీలపై మోదీ కక్ష పెంచుకున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా చేసి పునాది లాంటి ఓటును తొలగించే యత్నం. ఇప్పటివరకు 13.5 కోట్ల ఓట్లను తొలగించారు" - తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

మళ్లీ మేమేవస్తాం

రైతులను ఆదుకుంటాం

- ఎకరానికి రూ.60వేల రైతుబంధు వెంటనే చెల్లించాలి
- తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోదీ ఏం ఇచ్చారు.. ?
- బీజేపీకి ఎందుకు ఓటేయాలి..
- ఆదిలాబాద్ రైతుగర్జనలో కేటీఆర్

ఆదిలాబాద్(జనంసాక్షి):రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో పెట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కూడా కలిపి ఎకరానికి మొత్తం రూ.60 వేల చొప్పున చెల్లించాలని కోరారు. కేసీఆర్‌లో కే అంటే కాలువలు, సీ అంటే చెరువులు, ఆర్ అంటే రిజర్వాయర్లు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. అదే కాంగ్రెస్ అంటే కరువు, కాంగ్రెస్ అంటే వలసలు, కాంగ్రెస్ అంటే కన్నీళ్లు అని కేటీఆర్ విమర్శించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా డైట్ మైదానంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు.రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కూడా కలిపి ఎకరానికి మొత్తం రూ.60 వేల చొప్పున చెల్లించాలని కోరారు. రైతుల పట్ల ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే ఈ మొత్తాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు.కాళేశ్వరం నీటిని వినియోగించకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన

మిగతా 2లో..





హరీశ్‌పై మరో ఫోన్‌ట్యాపింగ్ కేసు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావుపై కేసు నమోదైంది. చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో గతంలో పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. 2023లో తన ఫోన్, భార్య ఫోన్ కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. పంజాగుట్ట పీఎస్

మిగతా 2లో..



భళా సింధు..

హైలో ఓపెన్ విజేతగా భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి



భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మరోసారి సత్తా చాటింది. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్-2026 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ కేజర్స్‌ఫెల్డ్‌పై ఘన విజయం సాధించింది. వరుస గేముల్లో 21-12, 21-14 స్కోరుతో ప్రత్యర్థిని ఓడించింది. ఈ విజయంతో సింధు ఖాతాలో ఈ ఏడాది రెండో టైటిల్ చేరింది. అంతకుముందు జులైలో జరిగిన జపాన్ ఓపెన్‌లోనూ ఆమె విజేతగా నిలవడం తెలిసిందే.



రాప్తాడు నిందితుడిపై

పోలీసుల కాల్పులు

తీవ్ర గాయాలు కావడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించి చికిత్స

రాప్తాడు(జనంసాక్షి): అనంతపురం జిల్లా రాప్తాడు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేసిన హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఆత్మకూరు అటవీప్రాంతంలో నిందితుడు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించిన క్రమంలో పారిపోయేందుకు

మిగతా 2లో..

ముసురుకుంటున్న 'మురసు'

నెల్లూరు-నరసాపురం మధ్య తుపాను తీరం దాటే అవకాశం

పండగకు ముందు.. గుది'బండ'

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.10 పెంపు

సిక్కుల ఊచకోత జరిగిన రోజే

ఢిల్లీ సభ

రాహుల్ ప్రధాని కావాలనుకుంటే.. జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉండిపోవాలి :అమిత్ షా

త్రివిధ దళాల మధ్య సమన్వయానికి అత్యంత ప్రాధాన్యం


ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

వివరాలు 2వ పేజీలో..

మా షరతులు నెరవేరితే రెండు రోజుల్లోనే

హర్మూజ్ ఓపెన్

- లేకుంటే ఎటువంటి చర్చలు జరగవు
- జలసంధి శాశ్వతంగా మూసివేసే ఉంటుంది
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి





టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్ విధించిన ఏడు షరతులను నెరవేర్చకపోతే ఎటువంటి చర్చలు జరగవని, హర్మూజ్ జలసంధి మూసివేసే ఉంటుందని ఇరాన్ ప్రకటించింది.అమెరికా తమ షరతులను అమలు చేస్తే రెండు రోజుల్లోగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలనే ప్రతిపాదనపై ఖతార్ మధ్యవర్తులతో చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పినట్లు అల్ జజీరా పేర్కొంది. ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని తిరిగి తెరవడానికి ప్రతిపాదించిన అమలు కాలాన్ని ఐదు రోజుల నుంచి రెండు రోజులకు తగ్గించడానికి ఖతార్‌తో చర్చలు ఫలిస్తున్నాయని అరాఘ్చి చెప్పారు.అల్ జజీరా నివేదిక ప్రకారం మొదట ఈ గడువును ఐదు రోజులుగా ప్రతిపాదించగా, చర్చల అనంతరం దానిని రెండు రోజులకు తగ్గించే ప్రతిపాదనకు ఇరాన్ అంగీకరించింది. తమ నిబంధనల ప్రకారం

మిగతా 2లో..

10 నిమిషాల్లో మీ అణుశక్తిని అంతం చేస్తాం

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్(జనంసాక్షి): ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తమపై ఏ విధంగా, ఏ స్థాయి దాడికి పాల్పడినా అందుకు దీటైన సమాధానం ఇవ్వాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తుబా ఖమేనీ తన సేనలకు పిలుపునిచ్చారు. ఆయన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇప్పటికే ఆ దేశ అణు సామర్థ్యాన్ని చాలా వరకు ధ్వంసం చేశాం. ఇంకా మరో రెండు టార్గెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మేం తలచుకుంటే 10 నిమిషాల్లో ఆ అణు శక్తిని పూర్తిగా అంతం చేయగలం. మా లక్ష్యాలలో పికాక్స్ పర్వతం కూడా ఉంది. అయితే టెహ్రాన్‌తో చర్చలు జరుగుతున్నాయి.

మిగతా 2లో..



అట్టుడికిన జర్మనీ

ఆందోళనలు హింసాత్మకం

నిరసనలు, దోపిడీలు..పోలీసులపైకి బాంబులు

బెర్లిన్(జనంసాక్షి): పెరుగుతున్న జీవన వ్యయాలు, విద్యాలయాల్లో సౌకర్యాల లేమి, తప్పనిసరిగా సైనిక సేవల్లో పాల్గొనాలనే నిబంధనలకు వ్యతిరేకంగా జర్మనీ లో నిరసనలు కొనసాగుతున్నాయి. 'జెన్ జీ రెగెల్ట్' అనే ప్రచార బృందం ఈ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ప్రజలకు ఆర్థిక భద్రత, మెరుగైన ప్రజా సేవలు అందించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిచ్ సహా 34 ప్రధాన నగరాల వీధుల్లోకి దాదాపు పదివేల మంది నిరసనకారులు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. వారిని అడ్డుకోవడానికి యత్నించిన భద్రతా బలగాలపై అల్లరిమూకలు పెట్రోల్ బాంబులు విసరడంతో పలువురు తీవ్రంగా

మిగతా 9లో..

సిక్కుల ఊచకోత జరిగిన రోజే ఢిల్లీ సభ

రాహుల్ ప్రధాని కావాలనుకుంటే.. జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉండిపోవాలి.. అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు



చండీగఢ్(జనంసాక్షి): ప్రధాని కావాలనుకుంటే జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉండిపోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సిక్కుల ఊచకోత జరిగిన రోజే రాంలీలా మైదానంలో సభ నిర్వహించడం.. బాధితుల పుండుమీద కారం చల్లినట్లేనని వ్యాఖ్యానించారు. చండీగఢ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ఈమేరకు ప్రసంగించారు. అబద్ధాలు చెప్పడం, అరాచకాన్ని వ్యాప్తి చేయడం, పార్లమెంటును పనిచేయనివ్వకపోవడం.. ఇదే ప్రతిపక్షాల నిజ స్వరూపమని మండిపడ్డారు.“1984 నవంబరు 1న వేలాది మంది సిక్కులను ఊచకోత కోశారు. ఒక రాజకీయ పార్టీ రెచ్చగొట్టిన ఈ తరహా అల్లర్లను భారత్ ఎన్నడూ చూడలేదు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం.. 1984నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లలో పాల్గొన్న వారందరి కేసులను తిరిగి తెరిచింది. అల్లర్లలో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇచ్చింది. అదే సమయంలో నాటి హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలను జైలులో పెట్టింది” అని అమిత్ షా తెలిపారు. విపక్షాల ‘చలో ఢిల్లీ’ సభను మూర్ఖపు నాటకంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. “ఢిల్లీలో అరాచకాన్ని సృష్టించి.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టడం, పండగ సీజన్‌లో దుకాణదారులు, వ్యాపారులకు నష్టం కలిగించడం, దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం వంటివి ఈ ర్యాలీ లక్ష్యాలు” అని విమర్శించారు. భారత్ ఒక బలమైన ప్రజాస్వామ్య దేశమని, ఇది అల్లర్ల రాజకీయాలతో కాకుండా.. రాజ్యాంగం, ప్రజల తీర్పుతో నడుస్తుందని మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు.



దేశాన్ని రక్షించాలంటే జ్ఞానేశ్‌ను తొలిగించాల్సిందే..



చేశారు.“ఇది ఏ ఒక్క నేత, పార్టీ గళం కాదు. దేశ యువత, మహిళలు, రైతులు, కార్మికుల స్వరం. మతం కన్నా ప్రతి భారతీయుడి గళమే నాకు ముఖ్యం. రాజ్యాంగాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను అమోదించం. ఎన్నో ఏళ్లుగా దేశంలో ఓటు చోరీ జరుగుతోంది. దీని ద్వారానే 2024 లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్ర ఎన్నికల్లో గెలుస్తున్నారు. దేశ వ్యవస్థ మొత్తం కేవలం ఇద్దరు, ముగ్గురు చేతుల్లోనే ఉండటాన్ని కోరుకోవడం లేదు. దీన్ని ఆమోదించే ప్రసక్తే లేదు. దేశాన్ని గాడిలో పెట్టాలంటే మొట్టమొదటగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించడమే. ఆయన జైలుకు వెళ్లక తప్పదు” అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మోదీ ఎక్కడికీ వెళ్లడం లేదని హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందిస్తూ.. తప్పించుకోవాలని ప్రయత్నించినా అది సాధ్యం కాదన్నారు. పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు ఆదాయం లేదని.. కేవలం కొందరు వ్యాపారవేత్తలు లాభపడితే చాలు అన్నట్లుగా మోదీ పాలన ఉందన్నారు. టెలికాం, పోర్టులు, బ్యాంకులు అన్నింటినీ ఓ వ్యక్తి చేతిలోనే పెట్టారని ఆరోపించారు. ప్రధాని మోదీ, అమిత్ షా కలిసి దేశాన్ని అమ్మేస్తున్నారని మం

సీఈసీని ప్రధాని మోదీ కాపాడుతున్నారు: ఖర్గే

కేంద్రంతో పాటు అనేక రాష్ట్రాల్లో ప్రజాతీర్పును చోరీ చేసి భాజపా అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈడీ వంటి సంస్థలతో విపక్షాలను భయపెట్టేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, అయినప్పటికీ తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. దిల్లీ రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన.. పౌరులను విభజించి, వారి ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు పోరాడతామన్నారు. ఆయన్ను కాపాడేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఈ దేశ యువత, మహిళలు వారిని వదిలిపెట్టరని అన్నారు.ఉత్తర్‌ప్రదేశ్ ద్వారా అధికారంలోకి వచ్చిన వారిని గద్దె దించుతామని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. యూపీవాలాలు వారికి తగిన వీడ్కోలు పలుకుతారన్నారు. రామ్‌లీలా మైదానం నూతన చరిత్ర లిఖించనుందని, మార్పు ఎప్పుడైనా రావచ్చని అన్నారు. తమపై జరిగిన ప్రతి లాఠీ దెబ్బకు తదుపరి తరం ప్రతీకారం తీర్చుకుంటుందని, కాషాయ పార్టీ తనను తాను కాపాడుకోలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో యూపీ నుంచే కాకుండా కేంద్రంలోనూ భాజపా ఓటమి చవిచూడక తప్పదన్నారు.

బెంగాల్ బాధిత రాష్ట్రం : దీదీ

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు బెంగాల్ బాధిత రాష్ట్రమని తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ పేర్కొన్నారు. మోసాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టమని, పోరాటం చేస్తామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి తెస్తామని అన్నారు. రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన ఆమె.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. బాధ్యతల నుంచి సీఈసీ ఎప్పుడు వైదొలుగుతున్నారని, దానికోసం ఎదురుచూస్తున్నామని అన్నారు.

విపక్ష నేతల ‘మహా మార్చ్’.. ఒకే వాహనంలో సభాస్థలికి

దిల్లీలోని రాంలీలా మైదానం వేదికగా ప్రతిపక్ష ఇండియా కూటమి మరికొద్దిసేపట్లో భారీ సభ నిర్వహించనుంది. ఈ క్రమంలోనే సీపీ మింటో రోడ్ జంక్షన్ నుంచి రాంలీలా మైదానం వరకు “ఓట్ బచావో.. దేశ్ బచావో మహా మార్చ్” పేరిట ప్రతిపక్ష నేతలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతలు తమ ఐక్యత చాటుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆ పార్టీ నేత అభిషేక్ బెనర్జీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, సీపీఐ నేత డి.రాజా, ఎన్సీపీ (ఎస్పీ) నాయకురాలు సుప్రియా సూలే తదితరులు ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించారు. అంతకు ముందు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని రాహుల్ గాంధీ ‘ఎక్స్’ వేదికగా పిలుపునిచ్చారు. “దిల్లీ.. గెట్ రెడీ. ఓటును కాపాడండి. దేశాన్ని కాపాడండి. మనమంతా కలిసి రాంలీలా మైదాన్ దిశగా మార్చ్ నిర్వహిద్దాం” అని పేర్కొన్నారు. సభలో పాల్గొనేందుకు ఇప్పటికే రాంలీలా మైదాన్‌కు పెద్దఎత్తున కార్యకర్తలు చేరుకున్నారు.

దుకాణాలను భాజపా మూసివేయించింది..: రాహుల్

కన్నాట్ ప్లేస్‌లోని దుకాణాలను భాజపా శ్రేణులు బలవంతంగా మూసివేయించినట్లు తనకు తెలిసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాంలీలా మైదానంలోని సభాస్థలికి ర్యాలీగా వెళ్తున్న సమయంలో ఆయన మాట్లాడుతూ.. “సభకు హాజరయ్యే వారు స్థానిక దుకాణాల్లో షాపింగ్ చేయాలని మేం ఇప్పటికే విజ్ఞప్తి చేశాం. కానీ.. ఇక్కడి ప్రతి దుకాణాన్ని భాజపా బలవంతంగా మూసివేయించినట్లు తెలిసింది. దీన్నిబట్టి.. వ్యాపారులకు ఎవరు నష్టం కలిగిస్తున్నారో అందరూ తెలుసుకోవాలి” అని వ్యాఖ్యానించారు.

400 సీట్లు దాటి ఉంటే రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర

రిజర్వేషన్లు రద్దు చేయాలని, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్లు తొలగించాలని భావించారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు దాటితే రాజ్యాంగం ద్వారా వచ్చిన ఓటు హక్కును తొలగిస్తారని ప్రజలు ఆ సంఖ్యను ఇవ్వకపోవడంతో పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై కక్ష పెంచుకున్న ప్రధానమంత్రి ఓటు హక్కు తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటు బచావో... దేశ్ బచావో పేరుతో ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. రాష్ట్రం నుంచి వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రికి ఘన



స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో కరచలనానికి పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ భారతదేశంలోని ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించారని, కానీ ఆ ఓటు హక్కును తొలగించేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, 20 కోట్ల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతం ఓట్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.ప్రయోగాత్మకంగా ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ ఇప్పటికే బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిందని, ఢిల్లీలోనూ మరోసారి అలానే అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతున్నారని సీఎం అన్నారు. ఈ కుట్రను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాహుల్ గాంధీ నిర్ణయించారని తెలిపారు. సభకు తెలంగాణ నుంచి 15 వేల మంది వచ్చేలా పీసీసీ ఆధ్వర్యంలో రైళ్లు ఏర్పాటు చేస్తే, ఆఖరి నిమిషం వరకు నమ్మించి చివర్లో రైళ్లు రద్దు చేసి కార్యకర్తలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైళ్లు ఇవ్వకపోయినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా ఢిల్లీ వచ్చారని, నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ కార్యకర్తల సంకల్పాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు. తెలంగాణ బలం ముందు, తెలంగాణ గళం ముందు మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ తలవంచక తప్పలేదని సీఎం అన్నారు. నాడు రావణుడిని ఓడించేందుకు రాముడికి వానర సేన తోడ్పడినట్లు, నేడు నరేంద్ర మోదీని ఓడించేందుకు కాంగ్రెస్ వానర సైన్యం పోరాడుతుందని, ఇందులో విజయం సాధించే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాంలీలా మైదానంలో కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకునే దీక్షతో నరేంద్ర మోదీ గద్దె కూలక తప్పదని, వాళ్లు గుజరాత్ వెళ్లక తప్పదని హెచ్చరించారు. రాంలీలా మైదాన్ లో ఇండియా కూటమి నేతలు ఇచ్చే సందేశాన్ని ప్రతి గ్రామానికి, ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సీఎం సూచించారు.

రైళ్లను ఆపినా వచ్చాం

దిల్లీలో ప్రధాని మోదీ కుర్చీ కాపాడేందుకు పేదల ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాంలీలా మైదానంలో నిరసన తెలిపేందుకు దేశ నలుమూలల నుంచి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గళం వినిపించేందుకు దిల్లీ రావడానికి రైళ్లు ఇవ్వకుండా కుట్ర చేశారని విమర్శించారు. రైళ్లను ఆపినా తెలంగాణ నుంచి దిల్లీకి వచ్చి కదంతొక్కిన వేలాది మందిని ఆపారా? ప్రశ్నించారు.

హరీశ్‌పై మరో ఫోన్‌ట్యాపింగ్ కేసు

నుంచి సిద్దిపేట వన్‌టౌన్‌కు బదిలీ అయిన ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. పంజాగుట్టలో నమోదైన ఎఫ్‌ఐఆర్‌కు అదనపు సెక్షన్లు జోడించారు.

త్రివిధ దళాల మధ్య సమన్వయానికి అంత్యంత ప్రాధాన్యం

ఐఏఎఫ్ నూతన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్



న్యూఢిల్లీ(జనంసాక్షి):వాయుసేనకు మంజూరైన ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్యను పునరుద్ధరించడం, ఆయుధ వ్యవస్థల పరంగా స్వావలంబనను సాధించడం, త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తన ప్రాధాన్య అంశాలని ఐఏఎఫ్ నూతన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ వెల్లడించారు. దేశ సేవ విషయంలో వాయుసేన ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సిద్ధంగా, దృఢ నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. 29వ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా శనివారం అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలోనే ఆదివారం ఆయన ప్రసంగిస్తూ.. ‘వాయు’ అనే పేరుతో తాను ప్రధానంగా దృష్టి సారించనున్న అంశాలను వివరించారు. అప్రమత్తత, కార్యాచరణ సంసిద్ధత (విజిలెన్స్ అండ్ ఆపరేషనల్ రెడీనెస్), స్వావలంబన (ఆత్మనిర్భరత), వ్యూహాత్మక నూతనత్వం (యుక్తి), త్రివిధ దళాల సమష్టి కృషి (యూనిటీ)గా వాటిలో ఉన్నట్లు వెల్లడించారు. భద్రత సవాల్‌గా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో.. ప్రతి స్క్వాడ్రన్, రాడార్, గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు ప్రతి ఒక్క సైనికుడు క్షణకాలంలో స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

రాప్తాడు నిందితుడిపై పోలీసుల కాల్పులు

ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆరురౌండ్లు కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. కాల్పుల్లో నిందితుడికి తీవ్ర గాయాలు కావడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాప్తాడులోని పాఠశాలలో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్.. అత్యంత అమానుష ఘాతుకానికి ఒడిగట్టాడు. పదోతరగతి చదువుతున్న బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేసి ఆమెను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టాడు. రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గోపిక రాప్తాడు జడ్పీ పాఠశాలలో చదువుతోంది. ఉదయం తరగతి గదిలో ఉండగా, వరుసకు బాబాయ్ అయ్యే హేమంత్ ఒక్కసారిగా ఎలక్ట్రిక్ రంపంతో లోపలికి ప్రవేశించి పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో 15 ఏళ్ల బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో లోతైన గాయాలయ్యాయి. తరగతిలో జరుగుతున్న ఈ దారుణాన్ని చూసి అంతా భయాందోళనకు గురయ్యారు. లక్ష్మి అనే విద్యార్థిని మాత్రం ధైర్యంగా ఉన్మాదిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమె రెండు కాళ్లకూ తీవ్ర గాయాలయ్యాయి. అంతా కేకలు వేయడంతో నిందితుడు రంపాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. రక్తపుమడుగులో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న గోపిక, గాయపడిన లక్ష్మిని స్థానికులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతోంది.



మళ్లీ మేమేవస్తాం

కరువని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.కౌలు రైతులకు కూడా రైతులతో సమానంగా రైతుబంధు సాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 21 లక్షల మంది కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కలిపి మొత్తం నాలుగు పంటలకు ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే భూమిలేని నిరుపేద రైతు కూలీలకు 36 నెలల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బకాయిలు రూ.36 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.కౌలు రైతు అంటే ఎవరో తెలుసా? భూమి లేని వ్యక్తి లేదా తక్కువ భూమి ఉండి పక్కవారి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకునే వ్యక్తి. అలాంటి కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని 21 లక్షల మంది కౌలు రైతులకు ప్రేమలేఖలు రాసి, తనకు ఓటు వేస్తే రైతుబంధు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి కౌలు రైతులు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ఇప్పుడు ఆ హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు.రైతులతో సమానంగా కౌలు రైతులకు కూడా రైతుబంధు చెల్లించాలని రాష్ట్రంలోని కౌలు రైతుల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎగ్గొట్టిన మూడు విడతలతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కలిపి నాలుగు పంటలకు ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. నెలకు రూ.1,000 చొప్పున ఇస్తామని చెప్పి 36 నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. నెలకు వెయ్యి రూపాయల చొప్పున 36 నెలలకు కలిపి ఒక్కో రైతు కూలీకి రూ.36 వేలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. “36 నెలలు అయిపోయాయి. మరి 36 నెలలకు గాను మీ అందరి చప్పట్ల మధ్యన నేను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా.. వెంటనే రూ.36 వేలు మా రైతు కూలీల ఖాతాల్లో డిపాజిట్ చేయాలి” అని కేటీఆర్ అన్నారు.

తెలంగాణకు ప్రధాని మోదీ ఏం ఇచ్చారు..

నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్న 13 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. ‘ఒక్క మెడికల్ కాలేజీ ఇచ్చినవా? ఒక నర్సింగ్ కాలేజీ ఇచ్చినవా? ఒక నవోదయ పాఠశాల ఇచ్చినవా? ఒక ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చినవా? ఒక జాతీయ ప్రాజెక్టు ఇచ్చినవా?’ అని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కటై ఆదిలాబాద్ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనంగా ఉంటోందని ఆరోపించారు. ఆదిలాబాద్ రైతు గర్జన సభలో మాట్లాడిన కేటీఆర్.. ‘బడే భాయ్.. చోటే భాయ్ ఇద్దరూ ఒక్కటయ్యారు. దొంగ చీకటి ఒకటైపోయింది. ఇద్దరూ మంచి అండర్‌స్టాండింగ్‌తో వ్యాపారాలు చేసుకుంటున్నారు’ అంటూ కాంగ్రెస్, బీజేపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఆదిలాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నప్పటికీ ఒక్కరోజైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గట్టిగా నిలదీశారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ‘బడే భాయ్.. చోటే భాయ్ దోనో ఏక్ హోగే. బడే మియా తో బడే మియా.. చోటే మియా సుభానల్లా అన్నట్టుగా ఇద్దరూ ఒక్కటైపోయారు. దొందూ దొందే.. ఇద్దరిలో ఎవరినీ నమ్మొద్దు’ అని వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆయన కుటుంబ సభ్యులు తాంసి, బేలా మండలాల్లో ఇండస్ట్రియల్ జోన్ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆ దోపిడీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దోపిడీ చేస్తుంటే బీజేపీ పెద్దలు కళ్లు మూసుకుని కూర్చుంటున్నారని మండిపడ్డారు.

మా షరతులు నెరవేరితే

రెండు రోజుల్లోనే హర్మూజ్ ఓపెన్

జలసంధిని తిరిగి తెరవడం ద్వారానే అమెరికాతో పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలపై చర్చలు జరపడానికి మార్గం సుగమం అవుతుందని అరాఘ్చీ పేర్కొన్నారు. ఇస్లామాబాద్ మెమోరాండం తర్వాత విధించిన ఆంక్షలను ఎత్తివేయడం, ఈ ప్రాంతంలో అమెరికా సైనిక బలగాలను తగ్గించడం, చమురు మినహాయింపులను పునరుద్ధరించడం, స్తంభింపజేసిన ఇరాన్ నిధులను విడుదల చేయడం వంటి డిమాండ్లు ఉన్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి తెలిపారు. ”ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం తర్వాత విధించిన ఆంక్షలను ఎత్తివేయడం, ఈ ప్రాంతంలో అమెరికా బలగాలను తగ్గించడం మా షరతుల్లో ఉన్నాయి. చమురు మినహాయింపులను పునరుద్ధరించాలని, ఖతార్ సహా మా స్తంభింపజేసిన నిధులన్నింటినీ విడుదల చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఒమన్‌తో ఇరాన్? చర్చించిన హర్మూజ్ జలసంధిలోని షిప్పింగ్ మార్గాలకు గుర్తింపు ఇవ్వాలి. అలాగే ఇతర మార్గాలను మూసివేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. మా షరతులను అంగీకరిస్తేనే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, అమెరికాతో అపరిష్కృత సమస్యలపై చర్చలను పునఃప్రారంభించడానికి మార్గం సుగమం చేస్తుంది” అని అరాఘ్చి అన్నారు.

షరతులను నెరవేర్చకపోతే ఎటువంటి చర్చలు జరగవు’

మరోవైపు ఇరాన్ విధించిన ఏడు షరతులను నెరవేర్చకపోతే ఎటువంటి చర్చలు జరగవని, హర్మూజ్ జలసంధి మూసివేసే



ఉంటుందని ఇరాన్ ప్రకటించింది. ఇస్లామాబాద్ చర్చల చట్రానికి ఈ షరతులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని ఇరాన్ అగ్ర భద్రతా అధికారి మొహ్సెన్ రెజాయీ పేర్కొన్నారు. ఒకవేళ ఇరాన్‌పై ఏదైనా దాడులు జరిగితే, సుప్రీం లీడర్ ఆదేశాల ప్రకారం అత్యంత నూతన ఆయుధాల సహాయంతో శత్రువులపై కోలుకోలేని విధంగా తీవ్రమైన ఎదురుదెబ్బలు తీస్తామని హెచ్చరించారు. అదే సమయంలో టెహ్రాన్ షరతులు నెరవేరితేనే దౌత్యం సాధ్యమవుతుందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.”మేము పదేపదే చెప్పాం. ఇరాన్ ప్రకటించిన ఏడు షరతులు తప్పక నెరవేర్చాలి. ఆ షరతులు నెరవేరితేనే దౌత్య మార్గం తెరుచుకుంటుంది. దేశానికి వ్యతిరేకంగా ఏదైనా చర్య తీసుకుంటే, సాయుధ దళాలకు సుప్రీం లీడర్ ఆదేశాల ప్రకారం మేము కొత్త ఆయుధాలను ఉపయోగించి దురాక్రమణదారుడు కోలుకోలేని విధంగా దాడి చేస్తాం.” అని అన్నారు. చర్చలకు సాధ్యమయ్యే ఫ్రేమ్‌వర్క్‌పై అమెరికా, ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన సంప్రదింపులు జరుగుతున్న నేపథ్యంలో రెజాయీ ఈ తాజా హెచ్చరిక జారీ చేశారు.

10 నిమిషాల్లో మీ అణుశక్తిని అంతం చేస్తాం

కానీ, ఆ దేశ నాయకులను నేను ఎప్పటికీ నమ్మలేను. మేం ఎప్పుడు దాడులు చేయబోతున్నాం అని ప్రతిఒక్కరూ తెలివి తక్కువగా అడుగుతున్నారు. నేడు దాడులు చేయాలని అనుకుంటే.. అందరికీ చెప్పి చేస్తానా?’ అని ట్రంప్ ప్రశ్నించారు.

పికాక్స్ పర్వతం..

ఇరాన్ లోని కుహ్–ఎ కోలాంగ్ గాజ్ లా పర్వతాన్ని స్థానికంగా పికాక్స్ పర్వతం అని పిలుస్తారు. ఇది జాగ్రాస్ పర్వత శ్రేణిలో.. నతాంజ్ అణు కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరాన్ తన అణు కార్యక్రమానికి అవసరమైన సెంట్రిఫ్యూజ్‌లను ఇక్కడికి తరలించి ఉండొచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు గతంలో అంచనా వేశాయి. ఈ కేంద్రంలో ఇప్పటికీ అణు కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అమెరికా నమ్ముతోంది. ఈ నేపథ్యంలోనే పికాక్స్ పర్వతాన్ని లక్ష్యం చేసుకుంటామని ట్రంప్ కొంత కాలంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ స్థావరంపై అగ్రరాజ్యం దాడులు చేస్తే.. పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతాయని ఇరాన్ హెచ్చరిస్తోంది. ఇదీ చదవండి: హద్దుల్లేని ప్రతిదాడి చేద్దాం

పండగకు ముందు.. గుది‘బండ’

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.10 పెంపు


న్యూఢిల్లీ(జనంసాక్షి):వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర స్వల్పంగా పెరిగింది. దీనిపై రూ.10 పెంచుతున్నట్లు చమురు సంస్థలు పేర్కొన్నాయి. దీంతో సిలిండర్ ధర రూ. 2,820కి చేరింది. ఈ పెంపు నేటినుంచి అమల్లోకి వచ్చింది. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. గత కొన్ని నెలలుగా వాణిజ్య సిలిండర్ ధరలు పెరుగుతూ వస్తున్నాయి. పండగ సీజన్‌లో మరోసారి ధర పెంచడంతో హోటల్ రంగం, రెస్టారంట్లు ఇతర వాణిజ్య సంస్థలకు ఇబ్బందిగా మారింది. దిల్లీలోనూ వాణిజ్య ఎల్‌పీజీ ధర రూ.2,820గా ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, సౌదీలో చమురు క్షేత్రాలపై దాడులు కొనసాగుతుండడం ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.



ముసురుకుంటున్న ‘మురసు’

నెల్లూరు-నరసాపురం మధ్య తుపాను తీరం దాటే అవకాశం

అమరావతి (జనంసాక్షి):బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 23 కి.మీ. వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 560s మీ, విశాఖపట్నానికి 660 కి.మీ, మచిలీపట్నానికి 640 కిమీ, నెల్లూరుకు 630కి.మీ, ఒంగోలుకు 680 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైంది. రేపు ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. సోమవారం అర్ధరాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజాము సమయంలో నెల్లూరు –నరసాపురం మధ్య తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తుపాను ప్రభావంతో మరో మూడురోజుల పాటు దక్షిణకోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.





ముదిరాజులను బీసీ-ఏలో చేర్చే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రజక విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మేధావులు, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధుల మీడియా సమావేశం

హైదరాబాద్ (జనంసాక్షి) : ముదిరాజులను బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులో చేర్చుతామంటూ ముఖ్యమంత్రి ప్రకటించడం, ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించడాన్ని రజక విద్యార్థుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రతిపాదనతో బీసీ-ఏ వర్గాలకు చెందిన విద్యార్థులు, యువత, వెనుకబడిన కులవృత్తుల కుటుంబాల్లో ఆందోళన నెలకొందని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రజక విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మేధావులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశమై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఇప్పటికే సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న బీసీ-ఏ వర్గాల హక్కులు, విద్యా, ఉద్యోగ అవకాశాలపై ఈ ప్రతిపాదన ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లోని అత్యంత వెనుకబడిన కులాల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయకులు స్పష్టం చేశారు. బీసీ-ఏలో ముదిరాజులను చేర్చే అంశంపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను ప్రభుత్వం తక్షణమే పునఃసమీక్షించాలని, ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ముఖ్య మంత్రి ప్రకటనను ఉపసంహరించుకునే వరకు వివిధ రూపాల్లో తమ పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. పీడిత కులవృత్తుల వర్గాల ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఈ అంశంపై మరోసారి పునరాలోచించాలని వారు కోరారు. ఈ సమావేశంలో రజక విద్యార్థుల సంఘం ఓయూ ప్రతినిధులు వెంకట్, రఘు, మణికంఠ, ఉద్యోగుల సంఘం ప్రతినిధి వనపర్తి కృష్ణ, నారాయణ పేట తిరుపతయ్య, గద్వాల నాగేష్, నాగర్‌కర్నూల్ రంగస్వామి, రాష్ట్ర కన్వీనర్ పుల్లయ్య, కులవృత్తుల సంఘం నాయకుడు ఆంజనేయులు, రాజకీయ నాయకుడు ఉప్పలయ్య, మాజీ ఎంపీటీసీ సింగారం సునీత తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంజీఎం మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
పనులు మరింత వేగవంతం కావాలి

- **మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్**



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 1 (జనం సాక్షి) :నూతనంగా నిర్మిస్తున్న వరంగల్ ఎంజీఎం మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.ఆదివారం వరంగల్ ఎంజీఎం మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులలో భాగంగా వెలుపల జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, వివిధ విభాగాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... హాస్పిటల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ఎస్ఈ సురేష్ బాబు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్‌కుమార్, ఆర్ అండ్ బీ ఈఈ దేవిక చౌహాన్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలన...



జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 1(జనంసాక్షి): వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వివిధ విభాగాల వారీగా కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత ఏజెన్సీ,మరియు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ రాజేందర్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్‌లో విస్తృతంగా వైద్య శిబిరాలు

- **మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**
- **ప్రతి సబ్-సెంటర్ పరిధిలో ప్రతిరోజూ ఒక గ్రామ పంచాయతీ, వార్డులో శిబిరం**
- **యాక్షన్ ప్లాన్‌లను వెంటనే సమర్పించాలని సూపర్‌వైజర్లకు ఆదేశం**



తాండూర్, నవంబర్ 01(జనం సాక్షి) : జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నవంబర్ నెలలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వైద్య శిబిరాలు (మెడికల్ క్యాంప్స్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం, జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సబ్-సెంటర్లలో ఈ వైద్య శిబిరాలను తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి సబ్-సెంటర్ పరిధిలో ప్రతిరోజూ ఒక గ్రామ పంచాయతీ లేదా గ్రామం లేదా మున్సిపల్ వార్డును ఎంపిక చేసుకుని ఈ క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. ఈ వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించి జిల్లాలోని అందరు సూపర్‌వైజర్లు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. నవంబర్ నెల మొత్తానికి సంబంధించిన పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) ముందుగానే సిద్ధం చేసి, తక్షణమే ఉన్నతాధికారులకు సమర్పించాలని స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులను పంపిణీ చేయనున్నట్లు, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు.



మద్యం విక్రయ నిషేధం

సిరికొండ నవంబర్ 01 (జనంసాక్షి) : సిరికొండ మండలం పాకిర్ నాయక్ తాండ మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించాలని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు అదివారం తీర్మాన కాపీలను స్థానిక పోలీసులకు గ్రామ సర్పంచ్ సరోజ బిక్కు గ్రామస్తులు కలిసి సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తుల కోరిక మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామంలో ఎలాంటి మద్యం అమ్మకాలు జరిపిన రూ.30 వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

గిన్నిస్ రికార్డు లక్ష్యంగా ఖానాపూర్ క్రీడాకారుల ప్రదర్శన

- **ఆరుగురు కరాటే క్రీడాకారులకు ఘన సన్మానం**



ఖానాపూర్ రూరల్ 1 నవంబర్ (జనం సాక్షి): గిన్నిస్ ప్రపంచ రికార్డు లక్ష్యంగా నిర్వహించిన కరాటే కార్యక్రమంలో ఖానాపూర్‌కు చెందిన ఆరుగురు క్రీడాకారులు పాల్గొని ఒకేసారి కరాటే చాప్స్ ప్రదర్శించడం అభినందనీయమని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శాలువాలతో సన్మానించి, చిరుకానుకలు అందజేశారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో మరిన్ని విజయాలు సాధించి గిన్నిస్ ప్రపంచ రికార్డులో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. అనంతరం కరాటే మాస్టర్ ఆరిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో జాన్సన్ నాయక్‌ను కూడా సన్మానించారు. కార్యక్రమంలో క్రీడాకారులు తుర్క అశ్రీత్ రెడ్డి, బత్తుల శశిర్, మైలారపు హనిత్య, మహమ్మద్ ఇక్లసుద్దీన్, అప్షిన్ మైషా తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఇందిరమ్మ టవర్స్ ఈ-లాటరీ..

- **హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం**



హైదరాబాద్ (జనంసాక్షి) : అల్పాదాయ వర్గాల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో లబ్ధిదారుల ఎంపిక కోసం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన లాటరీ ప్రక్రియను ఈ నెల 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం ప్రకటనలో తెలిపారు. అలాగే గతంలో 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా కేటాయించిన ఇండ్లలో వివిధ కారణాలతో కేటాయింపు రద్దు కావడంతో అందుబాటులోకి వచ్చిన ఇండ్లను కూడా లబ్ధిదారులకు కేటాయించనున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మాప్ అప్ లాటరీ ప్రక్రియను 4న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుందని తెలిపారు. ఈ రెంటిండినీ ఈ-లాటరీ ద్వారా నిర్వహిస్తున్నామని, ప్రజలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చని సూచించారు. ముషీరాబాద్, ఎల్‌బీ నగర్, చంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో ఫ్లాట్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన పూర్తయి లాటరీ ప్రక్రియ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాల్సి ఉన్నది. ఈ ప్రక్రియను 3న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లాటరీ ప్రక్రియను హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన యూట్యూబ్‌తోపాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైలట్ ప్రాజెక్టుగా తొలి విడతగా అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న ప్రతి నియోజకవర్గంలోనూ (కంటోన్మెంట్ మినహా) 480 ఇండ్ల నిర్మాణాలను చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 16 నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారి జాబితాతో ఆయా నియోజకవర్గాల్లోనే లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పలు ప్రాంతాల్లో టవర్స్ నిర్మాణపు పనులు కూడా ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి. అయితే.. క్షేత్ర స్థాయి పరిశీలనల్లో లాటరీలో ఎంపికైన వారిలో కొంత మంది ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుతం నివాసం ఉండకపోవడం, కొంత మంది తాము ప్రస్తుతం డబ్బులు చెల్లించలేమని పేర్కొనడం, ఇప్పటికే సొంత ఇల్లు ఉండటం మొదలైన కారణాలతో లాటరీలో ఇండ్లు వచ్చినప్పటికీ అనర్హులయ్యారు. ఇలా పలు కారణాలతో ఇండ్ల ఖాళీలు ఏర్పడి, కొత్తవారికి కోసం అందుబాటులోకి వచ్చాయి. ఈ ఇండ్లను ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి జాబితా నుంచే అర్హులైన వారికి కేటాయించడానికి ఆన్‌లైన్ ద్వారా 4వ తేదీన ఈ-లాటరీ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు వివరించారు. 16 నియోజకవర్గాల్లో కొంతమంది తాము ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలో కాకుండా, ఇతర నియోజకవర్గాల్లో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అటువంటి వారిపేర్లు గతంలో నిర్వహించిన లాటరీలో చేర్చలేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయితే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని, దరఖాస్తుదారులు సమర్పించిన చిరునామాల ఆధారంగా, గూగుల్ ద్వారా వారు ఏ నియోజకవర్గం పరిధిలోకి వస్తారన్న విషయాన్ని తెలుసుకున్నామని వీపీ గౌతం తెలిపారు. ఆ

ఫలించిన యువతి పోరాటం

- **ఎస్సై కౌన్సిలింగ్ తో ఒక్కటైన బార్యభర్తలు**



పాలకుర్తి, నవంబరు 01(జనంసాక్షి) కుల అడ్డు గోడలతో భార్యను కాపురానికి తీసుకువెళ్లకుండా ముఖం చాటేసిన యువకుడి తీరుపై యువతి న్యాయ పోరాటం చేసింది. పోలీసుల చొరవతో యువతి చేసిన న్యాయపోరాటం ఫలించింది. ఎస్సై ఊర సృజన్ కుమార్ చొరవతో ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి భర్త చెంతకు ఆదివారం చేరింది. వివరాల్లోకి వెళితే.... మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన గిద్దెల దివ్య పాలకుర్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేసే క్రమంలో అదే గ్రామానికి చెందిన గన్న అరవింద్ అనే యువకుడు ప్రేమ పేరుతో యువతికి దగ్గరయ్యాడు. వీరిద్దరివి వేర్వేరు కులాలు, ఇటీవల దివ్యను అరవింద్ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం దివ్య ఐదు నెలల గర్భవతి, తాజాగా దసరా పండుగకు ఇద్దరు కలిసి స్వగ్రామానికి వచ్చారు. తదనంతరం మనసు మార్చుకున్న యువకుడు అరవింద్ యువతిని గ్రామంలోనే వదిలి చెప్పా పెట్టకుండా హైదరాబాద్ కు వెళ్లిపోయాడు. అందోళన చెందిన యువతి దివ్య భర్తకు ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించలేదు. దీంతో యువతి భర్త ఇంటి ముందు శనివారం బైటాయించి న్యాయ పోరాటం చేసింది. దీనిపై స్పందించిన ఎస్సై సృజన్ కుమార్ స్థానిక పోలీస్టేషన్లో యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి భార్యతో చేతులు కలిపాడు. అర్థంలేని ఆలోచనలతో తన భార్యను దూరం చేసుకున్నానని. ఇక తన చేయి వదలనని అరవింద్ ఎస్సై సృజన్కుమార్ కు హామీ ఇచ్చాడు. దీంతో స్థానికులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సై ఊర సృజన్ కుమార్ ప్రత్యేక కౌన్సిలింగ్ చేయడంతో ప్రేమ జంట ఒకటయ్యారని, మండల ప్రజలు, ప్రేమ జంట కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, గ్రామస్తులు మండల ప్రజలు అభినందిస్తున్నారు.

ఎన్ఎచ్ఎంలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై
ఎంపీ అరుణ మండిపాటు

నారాయణపేట నవంబర్ 1(జనం.సాక్షి): నారాయణపేట జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఎన్ ఎచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరవధిక సమ్మె లో ఆదివారం పాల్గొని పాలమూరు ఎంపీ డీకే అరుణ మద్దతు ప్రకటించా రు.ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా 20 రోజులుగా కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవ ధిక సమ్మె కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మండిపడ్డారు.కాంగ్రెస్ మేనిఫెస్టో లో ఎన్ ఎచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ నిలబెట్టుకోలేదనీ విమర్శించారు.ఇప్పటికైన సీఎం సానుకూలంగా స్పందించి, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనీ డిమాండ్ చేశారు.7 రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను, రెగ్యులరైజ్ చేశారనీ తెలిపారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన అన్ని డిమాండ్లను ప్రభు త్వం అమలు చేయాలన్నారు.ఉద్యోగులు



ప్రజారోగ్యం కాపాడేందుకు అనేక సేవలు అందిస్తున్నా రనీ అన్నారు.ప్రసూతి మరణాల రేటు 25 శాతం నుంచి 19శాతానికి తగ్గించారనీ,నవజాత శిశువుల మరణాల రేటు 15 శాతం నుంచి 5 శాతానికి గణనీయంగా తగ్గించారనీ కొనియాడారు. ఉద్యోగులు కృషితో 70 శాతం కాన్పులు హాస్పిటల్ లో జరుగుతున్నాయన్నారు. టీబీ ముక్త్ భారత్ లో ప్రజలకు అవగాహన కల్పిం చి, టీబీ నివారణ కోసం పని చేస్తున్నారనీ, అయినా ఉద్యోగులకు ప్రసూతి సెలవుల ఇవ్వడం లేదన్నా రు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు సమయానికి ఇవ్వ డం లేదనీ విమర్శించారు. వారికి బిజెపి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



ఎండ్ల బండిపై ఉపాధ్యాయుడి వీడ్కోలు

సిరికొండ నవంబర్ 01 (జనంసాక్షి): సిరికొండ మండలం రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. ఇటీవల పదవి విరమణ పొందడంతో గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులంతా కలిసి తనపై ఉన్న అభిమానంతో ఎడ్లబండితో గ్రామంలోని విధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఇచ్చోడ మండలం చించోలి గ్రామానికి చెందిన నైతం ప్రభాకర్ ఎస్ జిటి టీచర్ గా మంచిగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందడంతో గ్రామస్తులు అభినందించారు.

మందమర్రి ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



రామకృష్ణాపూర్, నవంబర్ 01(జనంసాక్షి): సింగరేణి మందమర్రి ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మందమర్రి సీఈఆర్ క్లబ్, రామకృష్ణాపూర్ ఆర్కేస్ఓఏ క్లబ్, మందమర్రి ఇల్లందు క్లబ్‌లలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణతో పాటు ఏరియా ఉన్నతాధికారులు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఆదేశాల మేరకు నిజాయితీతో సమృద్ధి అనే నినాదంతో అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, కార్యాలయాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
2 నవంబర్ 2026

చిన్నారులపై హింస

మూలాల్లోకి వెళ్లాల్సిన సమయం

సంపాదకీయం

అనంతపురం జిల్లా రాప్తాడులోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల గోపికపై హేమంత్ అనే యువకుడు తరగతి గదిలోకి చొరబడి ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన ఘటన సమాజాన్ని కలచివేసింది. ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలతో ఆ బాలిక ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అడ్డుకోవడానికి ధైర్యంగా ప్రయత్నించిన లక్ష్మి అనే విద్యార్థిని రెండు కాళ్లకూ గాయాలయ్యాయి. పాఠశాల వంటి సురక్షితంగా ఉండాల్సిన చోట, తోటి విద్యార్థుల కళ్లెదుటే ఇంతటి అమానుషం జరగడం ఎవరినైనా తీవ్రంగా కలిచివేస్తుంది.

ఇలాంటి ఘటనలు జరిగినప్పుడల్లా ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతుంది. ఆ ఆగ్రహం ప్రభుత్వాల పట్ల, పోలీసు వ్యవస్థ పట్ల అసహనంగా మారుతుంది. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో దాక్కున్న నిందితుడు పారిపోయే ప్రయత్నం చేయగా ఆరు రౌండ్లు కాల్పులు జరిపామని పోలీసులు చెబుతున్నారు. క్షణికావేశంలో హింసకు పాల్పడిన యువకులను కాల్పుల్లో కడతేర్చడం, విచారణ సమయంలో తప్పించుకుని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పడం ఇటీవల పరిపాటిగా మారింది. ఇవి ప్రజల ఆగ్రహాన్ని తాత్కాలికంగా చల్లార్చవచ్చు. కానీ న్యాయ విచారణ, శిక్ష అనే చట్టబద్ధ ప్రక్రియను దాటవేస్తే నేరస్థుడికి శిక్ష పడినట్టు కాదు, నేరానికి కారణమైన పరిస్థితులూ మారవు.

నిజానికి ఇలాంటి ప్రవృత్తి ఒక్కరోజులో పుట్టేది కాదు. ప్రేమను నిరాకరిస్తే దాడి చేయడం, అమ్మాయిల వెంట పడటం, లొంగదీసుకోవడం వంటివాటిని సినిమాల్లో హీరోయిజంగా చూపిస్తున్నారు. ఒకప్పుడు విలన్లకు పరిమితమైన క్రూరత్వాన్ని ఇప్పుడు కథానాయకులకే ఆపాదిస్తున్నారు. తెరపై హింసను ఆరాధించేలా చూపే సన్నివేశాలు, సామాజిక మాధ్యమాల్లో నిరంతరం ప్రవహించే హింసాత్మక కంటెంట్ కలిసి, ముఖ్యంగా యువతలో "నాకు దక్కనిది ఎవరికీ దక్కకూడదు" అనే ధోరణిని పెంచుతున్నాయి. మహిళలను, ఆడపిల్లలను తమ ఆధిపత్యానికి లోబడిన వస్తువులుగా చూసే మనస్తత్వానికి ఇవి ఊతమిస్తున్నాయి.

ఈ హింసను నియంత్రించకుండా, నేరం చేసిన యువకులను భౌతికంగా అంతం చేసినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. సమాజంలోని అన్ని వర్గాలూ కారణాలను నిజాయితీగా అన్వేషించాలి. కుటుంబాల్లోనే పిల్లలకు, ముఖ్యంగా అబ్బాయిలకు, చిన్నపిల్లల పట్ల ఎలా వ్యవహరించాలో, మహిళల పట్ల ఎంత గౌరవం చూపాలో, తిరస్కరణను ఎలా హుందాగా స్వీకరించాలో నేర్పాలి. పాఠశాలల్లో కౌన్సెలింగ్, విలువల విద్య బలపడాలి. సినిమాలు, మీడియా సంస్థలు కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తించి, హింసను మహిమాన్వితం చేసే కథనాలకు దూరంగా ఉండాలి. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు కూడా అవసరం.

గోపిక, లక్ష్మిల లాంటి చిన్నారులు భయం లేకుండా చదువుకోగలిగే వాతావరణాన్ని కల్పించడమే మనందరి ముందున్న కర్తవ్యం. చట్టం తన పని చేయాలి, కుటుంబం, సమాజం, మీడియా తమ బాధ్యతను నిర్వర్తించాలి. అప్పుడే ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట పడి, భవిష్యత్తు తరాల్లో నిజమైన మార్పు ఆశించవచ్చు.

తెలంగాణ పర్యటనకు వస్తున్న అమిత్ షా..

ఓబీసీ ప్రత్యేక కాలమ్‌పై సమాధానం చెప్పాలి..!



భారతదేశంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాల గురించి పాలకులు ఎన్ని ప్రసంగాలు చేసినా, సమాజంలోని వెనుకబడిన వర్గాలకు జనాభా నిష్పత్తిలో న్యాయం జరగనంతవరకు వాటికి సంపూర్ణ అర్థం ఉండదు. దేశంలో బీసీల వాస్తవ జనాభా ఎంత? వివిధ కులాలవారీగా వారి సంఖ్య ఎంత? విద్య, ఉద్యోగాలు, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? ఈ ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు లభించాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి. అందుకే దశాబ్దాలుగా బీసీ సంఘాలు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు కులగణన కోసం పోరాడుతున్నారు. 2027లో నిర్వహించనున్న జనాభా గణనలో కుల వివరాలను సేకరించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించదగిన పరిణామమే. అయితే కులగణన చేపట్టనున్నట్లు ప్రకటించడం ఒక అంశమైతే, బీసీ-ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించి, కులాలవారీగా సమగ్ర గణాంకాలు సేకరించడం మరో కీలక అంశం. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి. కేవలం కుల వివరాల సేకరణతోనే బీసీలకు న్యాయం జరిగినట్లు కాదు. వారి సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు, స్పష్టమైన వర్గీకరణ, విశ్వసనీయమైన గణాంకాలు అందుబాటులోకి రావాలి.ఓబీసీ ప్రధానిగా చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి బీసీల జనాభాను లెక్కించడంలో అభ్యంతరమేమిటి? ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ కల్పించడానికి ఇబ్బందేమిటి? సామాజిక న్యాయం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలి. జనాభా వివరాలు తెలియకుండా విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో ఆయా వర్గాలకు అందాల్సిన అవకాశాలను ఎలా నిర్ణయిస్తారు? గణాంకాలు లేకుండా సమాన అవకాశాల విధానాలను ఎలా రూపొందిస్తారో కేంద్ర ప్రభుత్వం సమాధానము చెప్పాలి.
కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జనాభా గణన ప్రశ్నావళిలో కుల వివరాలకు సంబంధించిన అంశం ఉన్నప్పటికీ, బీసీ,ఓబీసీలను ప్రత్యేకంగా గుర్తించే విధానం, కులాలవారీగా వివరాల సేకరణ, కేంద్ర మరియు రాష్ట్రాల అధికారిక బీసీ జాబితాల అనుసంధానంపై స్పష్టత అవసరం. ఎస్సీ, ఎస్టీ, ఇతర కులాలుగా సాధారణంగా వివరాలు నమోదు చేయడం మాత్రమే సరిపోదు. బీసీలలోని విభిన్న కులాల వాస్తవ జనాభాను గుర్తించే విధానం ఉండాలి. లేకపోతే భవిష్యత్తులో రూపొందించే సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ప్రామాణిక సమాచారం లభించదు.ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయ సమస్యగా పరిగణించింది. 2026 సెప్టెంబర్ 11న తెలంగాణ శాసనసభలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. జనాభా గణనలో బీసీ-ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక బీసీ జాబితాల ఆధారంగా కులాలవారీగా సమగ్ర గణాంకాలు సేకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ తీర్మానానికి అధికార, ప్రతిపక్ష సభ్యుల మద్దతు లభించడం విశేషం. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన డిమాండ్ కాదని, బీసీల హక్కులకు సంబంధించిన ఉమ్మడి ఆకాంక్ష అని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.తెలంగాణలో ఇప్పటికే నిర్వహించిన సమగ్ర కులగణన అనుభవం కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉపయోగపడవచ్చు. రాష్ట్రంలో సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వివరాలను పరిశీలించి, జాతీయస్థాయిలో మరింత సమర్థవంతమైన విధానాన్ని రూపొందించాలి. తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానంపై కేంద్రం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాల్సిన బాధ్యత ఉంది.

కేంద్రంలో నెంబర్ 2గా ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న,హైదరాబాద్ పర్యటనకు వస్తున్నారంటే గంపెడు ఆశలతో బీసీ సమాజం ఎదిరిచూస్తున్నది. అట్టడుగువర్గాల మహా నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించే మహాపాదయాత్రలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణపై ప్రసంగించనున్నారు. అయితే ఊకదంపుడు ఉపన్యాసం కాకుండా ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు బీసీల ప్రధాన డిమాండ్‌పై ఆయన తన వైఖరిని స్పష్టం చేయాలి. తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా పంపిన విజ్ఞప్తికి కేంద్రం ఎందుకు సమాధానం ఇవ్వడం లేదు? జనాభా గణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ కల్పించడంపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఏమిటి? ఈ ప్రశ్నలకు అమిత్ షా సమాధానం చెప్పాలి.బాబూ జగ్జీవన్‌రామ్ సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానాయకుడు. ఆయన విగ్రహం సాక్షిగా నిర్వహించే కార్యక్రమంలో సామాజిక న్యాయానికి సంబంధించిన బీసీల డిమాండ్‌ను విస్మరించడం సమంజసం కాదు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, ఓట్లను లెక్కించడం మాత్రమే కాదు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, పాలనలో తగిన ప్రాతినిధ్యం కల్పించడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతలో భాగమే.భారత సామాజిక న్యాయ ఉద్యమ చరిత్రలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బీపీ మండల్ వంటి మహనీయుల కృషి చిరస్మరణీయం.

మండల్ కమిషన్ సిఫార్సుల అమలు దేశ సామాజిక, రాజకీయ వ్యవస్థలో కీలక మార్పులకు దారితీసింది. అయినప్పటికీ బీసీలకు జనాభా నిష్పత్తిలో విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు అందుతున్నాయా అనే ప్రశ్నకు సమగ్ర గణాంకాల ఆధారంగా సమాధానం రావాల్సి ఉంది. ఉన్నత విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రజాప్రతినిధుల వ్యవస్థలో బీసీల వాస్తవ ప్రాతినిధ్యం ఎంతన్నది తెలుసుకోవడానికి కూడా కులగణన అవసరం.అందుకే తెలంగాణలో బీజేపీ బ్రతికి బట్టకట్టాలంటే "బీసీలను లెక్కించండి.. సామాజిక న్యాయాన్ని నిలబెట్టండి అంటూ బీసీ సంఘాలు నిలదీస్తున్నాయి .
కులగణన అంటే కులాల మధ్య విభేదాలు సృష్టించడం కాదు. ఇప్పటికే సమాజంలో కొనసాగుతున్న అసమానతలను గుర్తించి, వాటిని తగ్గించేందుకు అవసరమైన విధానాలను రూపొందించడం. జనాభా తెలియకుండా వాటా ఎలా నిర్ణయిస్తారు? వెనుకబాటుతనం తెలియకుండా అభివృద్ధి ప్రణాళికలు ఎలా రూపొందిస్తారు? సామాజిక పరిస్థితులపై కచ్చితమైన సమాచారం లేకుండా సమానత్వాన్ని ఎలా సాధిస్తారు? ఇవి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన మౌలిక ప్రశ్నలు.అందువల్ల బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు ఐక్యంగా తమ డిమాండ్‌ను వినిపించాలి. ఈ పోరాటం ఏ ఒక్క రాజకీయ పార్టీకి వ్యతిరేకమైనది కాదు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలమైన ప్రచార వేదిక కూడా కాకూడదు. బీసీల అస్తిత్వం, ఆత్మగౌరవం, జనాభా ప్రాతిపదికన హక్కులు, రాజ్యాంగబద్ధమైన సమాన అవకాశాల సాధనే దీని ప్రధాన లక్ష్యం కావాలి.కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకరించిన నేపథ్యంలో బీసీ--ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ కల్పించడం, కులాలవారీగా గణాంకాలు సేకరించడం, ఆ వివరాలను పారదర్శకంగా ప్రకటించడం వంటి అంశాలపై స్పష్టమైన విధానాన్ని వెల్లడించాలి. తెలంగాణ శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవించి, బీసీ సంఘాల ఆందోళనలకు పరిష్కారం చూపాలి. బీసీల జనాభా లెక్కలు అడగడం నేరం కాదు. తమ హక్కుల కోసం ప్రశ్నించడం తప్పు కాదు. సమాన అవకాశాలను కోరడం రాజ్యాంగ విరుద్ధం కాదు. కాబట్టి అమిత్ షా తన తెలంగాణ పర్యటనలో ఓబీసీ ప్రత్యేక కాలమ్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. తెలంగాణ గడ్డ నుంచి వినిపిస్తున్న బీసీల ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఎందుకంటే బీసీలను లెక్కించడం కేవలం జనాభా గణనలో భాగం కాదు, అది సామాజిక న్యాయం వైపు వేసే అత్యంత కీలకమైన అడుగు. 95 సంవత్సరాల చరిత్ర ను తిరగరాయాలంటే బీసీల జనాభా లెక్కలు సామాజిక న్యాయానికి పునాది.. ప్రత్యేక గుర్తింపు కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదే.



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్
సెల్- 9866255355

ధరల మంట

టమాటా మాట
వినదు
ఉల్లి ఘాటు పోటు
వెల్లులి వెలివేస్తుంది
పప్పులు అప్పులు
చేస్తున్నాయి
బియ్యం ధరలు
దయ్యాలు అయ్యి
వెంబడిస్తున్నాయి
ఆకుకూరాలు
అల్లం
అలుగడ్డలు
అలక బుని
ఆదాయాలు
పాతలంలోకి
ఖర్చులు ఆకాశంలో
విహరించి
సామాన్యుడి జీవితం
చీధిలం అయ్యి
ధరల టెన్షన్ ల తో
వేతన జీవుడు
వెక్కరింత
సామాన్యుడు
చతికిల పడ్డాడు

ఉమాశేషారావు వైద్య
లెక్చరర్, కామారెడ్డి
9440408080



పత్రికా స్వేచ్ఛకు గోప్యతా చట్టం సంకెళ్లు!



ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత, పాలకుల నిర్ణయాలపై ప్రశ్నించే స్వేచ్ఛ, అవినీతిని వెలుగులోకి తెచ్చే స్వతంత్ర మీడియా ప్రజాస్వామ్యానికి ప్రాణాధారాలు. అందుకే పత్రికా రంగాన్ని ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా అభివర్ణిస్తారు. అయితే, వ్యక్తిగత సమాచార గోప్యత పేరుతో రూపొందిస్తున్న చట్టాలు ప్రజలకు సమాచారాన్ని చేరవేసే మీడియా స్వేచ్ఛను పరిమితం చేస్తే, అది ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగిస్తుంది. వ్యక్తిగత గోప్యతను పరిరక్షించడం ఎంత ముఖ్యమో, ప్రజాప్రయోజనాల కోసం వాస్తవాలను వెలికితీసే పత్రికా స్వేచ్ఛను కాపాడటం కూడా అంతే ముఖ్యం.
వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం (డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్) ప్రధాన ఉద్దేశం పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని అనధికార వినియోగం నుంచి రక్షించడం. డిజిటల్ యుగంలో వ్యక్తుల సమాచారం వ్యాపార సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, ఆన్‌లైన్ వేదికల చేతుల్లోకి వెళ్తున్న నేపథ్యంలో ఇలాంటి చట్టం అవసరమే. కానీ గోప్యత పరిరక్షణకు కల్పించే హక్కులు, అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజాధన దుర్వినియోగం వంటి అంశాలను ప్రశ్నించే హక్కులకు అడ్డంకిగా మారకూడదు. చట్టం ఉద్దేశం పౌరులను రక్షించడం కావాలి తప్ప, అధికారంలో ఉన్నవారిని విమర్శల నుంచి రక్షించడం కాకూడదు.
ఈ విషయంలో ప్రధాన ఆందోళన పరిశోధనాత్మక జర్నలిజంపై పడే ప్రభావం. ఒక ప్రభుత్వ అధికారి అక్రమ ఆస్తులు కూడబెట్టారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని జర్నలిస్టుకు సమాచారం అందిందనుకుందాం. ఆ సమాచారాన్ని ధ్రువీకరించడానికి అధికారిక రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ సంబంధిత వ్యక్తి ముందస్తు అనుమతి తీసుకోవాలనే నిబంధన ఉంటే, విచారణ ప్రారంభం కాకముందే దాని సమాచారం నిందితుడికి చేరే ప్రమాదం ఉంది. ఆధారాలు మాయమవడం, సాక్షులపై ఒత్తిడి పెరగడం, సమాచార వనరులు వెనక్కి తగ్గడం వంటి పరిణామాలు సంభవించవచ్చు. అప్పుడు జర్నలిజం ప్రజల తరఫున ప్రశ్నించే వ్యవస్థగా కాకుండా, అధికారుల అనుమతి కోసం ఎదురుచూసే వ్యవస్థగా మారుతుంది.
మరో ప్రమాదకరమైన అంశం వ్యక్తిగత సమాచారాన్ని సరిదిద్దడం లేదా తొలగించడం కోరే హక్కు. ఈ హక్కు సాధారణ పౌరులకు తప్పుడు సమాచారం, పరువు నష్టం, అనవసరమైన వ్యక్తిగత వివరాల ప్రచారం నుంచి రక్షణ కల్పించడానికి ఉపయోగపడుతుంది. కానీ దానిని దుర్వినియోగం చేసే అవకాశాన్ని విస్మరించలేం. ఒక అవినీతి కేసులో దోషిగా తేలిన రాజకీయ నాయకుడు తనపై గతంలో ప్రచురించిన వార్తలను తొలగించాలని కోరితే? ఒక ప్రజాప్రతినిధి అవినీతి ఆరోపణలకు సంబంధించిన పాత రికార్డులను చెరిపివేయాలని ప్రయత్నిస్తే? వ్యక్తిగత గోప్యత హక్కు చరిత్రను చెరిపివేసే ఆయుధంగా మారకూడదు. వార్తలో వాస్తవాలుంటే, అవి ప్రజాప్రయోజనానికి సంబంధించినవైతే, వాటిని తొలగించకుండా కాపాడే న్యాయపరమైన రక్షణ ఉండాలి.
సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) విషయంలోనూ ఇలాంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల బాధ్యతలు, ప్రజాధన వినియోగం వంటి అంశాలపై సమాచారం పొందడం పౌరుల ప్రజాస్వామిక హక్కు. వ్యక్తిగత సమాచారం పేరుతో విస్తృతమైన మినహాయింపులు కల్పిస్తే, ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజలకు ఉండాల్సిన పర్యవేక్షణ బలహీనపడుతుంది. పైగా, డేటా ఫిడ్యూషియరీలు, మధ్యవర్తి సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వం కోరిన సమాచారాన్ని అందించాలని ఆదేశించే అధికారం విస్తృతంగా ఉంటే, పౌరుల సమాచార గోప్యతతో పాటు ప్రభుత్వ జవాబుదారీతనంపైనా ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రభుత్వానికి సమాచారం పొందే అధికారం ఉన్నప్పుడు, అదే సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండేలా పారదర్శక వ్యవస్థ ఎందుకు ఉండకూడదు?
గతంలో ప్రతిపాదించిన 2018, 2019, 2021 నాటి వ్యక్తిగత సమాచార పరిరక్షణ ముసాయిదాల్లో ప్రజాప్రయోజనాల కోసం చేసే జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు ఉండటం గమనార్హం. అటువంటి రక్షణలు లేకపోతే మీడియా సంస్థలు చట్టపరమైన చిక్కుల భయంతో కీలకమైన పరిశోధనాత్మక కథనాలను ప్రచురించడానికి వెనుకాడవచ్చు. చిన్న పత్రికలు, స్వతంత్ర డిజిటల్ మీడియా సంస్థలు న్యాయపోరాటాల ఆర్థిక భారాన్ని భరించలేకపోవచ్చు. ఫలితంగా అధికార వ్యవస్థలోని లోపాలు వెలుగులోకి రావడం తగ్గిపోతుంది. ఇది ప్రజలకు అందుబాటులో ఉండే సమాచార వైవిధ్యాన్ని దెబ్బతీస్తుంది.
అయితే, పత్రికా స్వేచ్ఛ పేరుతో ఎవరి వ్యక్తిగత జీవితాన్నైనా ఇష్టానుసారంగా ప్రచురించడానికి అనుమతించలేం. తప్పుడు వార్తలు, వ్యక్తిగత కక్షలు, నిరాధార ఆరోపణలు, వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే ప్రచురణలకు చట్టపరమైన నియంత్రణ అవసరం. అందువల్ల గోప్యతా హక్కుకు, ప్రజలకు తెలుసుకునే హక్కుకు మధ్య స్పష్టమైన సమతుల్యత ఉండాలి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాధనంతో సంబంధం ఉన్న వ్యక్తుల వ్యవహారాల్లో ప్రజాప్రయోజనానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో స్వతంత్ర న్యాయపరిశీలన, పారదర్శకమైన అప్పీల్ వ్యవస్థ, జర్నలిస్టుల వృత్తిపరమైన రక్షణలకు చట్టంలో చోటు కల్పించాలి.
ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రభుత్వ వ్యతిరేక చర్య కాదు. పాలకుల జవాబుదారీతనాన్ని నిర్ధారించే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. మీడియా ప్రశ్నించలేని పరిస్థితి ఏర్పడితే, ప్రజలకు వాస్తవాలు తెలియవు; ప్రజలకు వాస్తవాలు తెలియకపోతే ప్రజాస్వామిక నిర్ణయాలు కూడా బలహీనపడతాయి. అందువల్ల వ్యక్తిగత గోప్యతను కాపాడుతూనే, ప్రజాప్రయోజనాల జర్నలిజానికి స్పష్టమైన మినహాయింపులు కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం మీడియా సంస్థలు, జర్నలిస్టుల సంఘాలు, పౌరహక్కుల సంస్థలు, న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించి అవసరమైన సవరణలు చేయాలి. గోప్యత పేరుతో సమాచార ద్వారాలు మూసివేయడం కాకుండా, గోప్యతకు భంగం కలగకుండా ప్రజలకు నిజాలు చేరేలా చట్టాన్ని రూపొందించాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి గోప్యత ఎంత అవసరమో, అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ కూడా అంతే అవసరం.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



నక్క జిత్తుల లెక్కతో పేదరికం హుష్ కాకి!

అంతర్జాతీయ నివేదికల వెనుక 'డేటా లాబీయింగ్': జీడీపీ గ్రాఫులు పెరుగుతున్నాయి... వలస కూలీల బతుకులు అరుగుతున్నాయి!



అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నివేదికలు దేశ ప్రగతిని ఆకాశానికి ఎత్తుతుంటే, మెట్రో నగరాల రైల్వే స్టేషన్లలో పొట్ట చేతపట్టుకుని దిగుతున్న వలస జీవుల కళ్లలోని ఆవేదన ఆ అంకెల డొల్లతనాన్ని బద్దలు కొడుతోంది! వరల్డ్ బ్యాంక్ తన తాజా 'పవర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్' నివేదికలో భారతదేశం 12 ఏళ్లలో దాదాపు 49.6 కోట్ల మందిని పేదరికం నుండి బయటపడేసిందని ఘనంగా చాటింది. కానీ, దలాల్ స్ట్రీట్ కార్పొరేట్ శక్తుల సంపద సగటు లెక్కింపుల్లో కలిసి మొత్తం జీడీపీని పైకి లేపుతున్న వేళ, క్షేత్రస్థాయిలో సామాన్యుడి వంటగది బడ్జెట్ మాత్రం తగ్గుతోంది. ఇది కేవలం సంపద కేంద్రీకరణను దాచేందుకు జరుగుతున్న అంతర్జాతీయ డేటా లాబీయింగ్ మరియు జీవన ప్రమాణాల కొలమానాల్లో చేసిన మార్పుల వెనుక దాగి ఉన్న ఒక వ్యవస్థీకృత లెక్కల గారడీ మాత్రమే! సగటు జిడిపి లెక్కల్లో అదానీ అంబానీ ల ఆదాయం వల్ల ప్రజల ఆదాయం తలా ఒక డాలర్ , పెరిగినట్లుగా ముల్లు చూపుతుంది. సామాన్యులకు అర్థం ఈ విషయం ప్రపంచ బ్యాంకు కు అర్థం కాదు. నక్క జిత్తుల లెక్కలతో 50 కోట్ల మందిని పేదరికం నుండి ఎలా బయట పడేశారా వివరాలు చూద్దాం.
2014 వర్సెస్ 2023 – జీవన ప్రమాణాల లెక్కింపుల్లో జరిగిన మార్పులు: ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు "కోట్లాది మంది పేదరికం దాటేశారు" అని చూపిస్తున్న అంకెల వెనుక క్షేత్రస్థాయి వాస్తవాలను దాచే పెద్ద స్టాటిస్టికల్ మాయాజాలం దాగి ఉంది. 2014 నాటి పాత పద్ధతులకు, 2023 నాటికి మార్చిన కొత్త విధానాలకు మధ్య ఉన్న అంతరాన్ని గమనిస్తే పాలకుల కుయుక్తులు బయటపడతాయి.

ఆహార వినియోగ సర్వే పద్ధతి మార్పిడి:
2014కు పూర్వం కేవలం 'యూఆర్‌పీ' పద్ధతి ద్వారా గత 30 రోజుల్లో ఒక కుటుంబం కొన్న వస్తువుల ఆధారంగా వినియోగాన్ని నేరుగా లెక్కించేవారు. కానీ 2023 నాటికి దీనిని 'ఎంఎంఆర్‌పీ' పద్ధతిగా మార్చి గత 7 రోజులు, 30 రోజులు మరియు ఏడాది కాలంలో చేసిన ఖర్చుల మిశ్రమ లెక్కలను సర్వేలో చేర్చారు. ఈ సర్వే ప్రశ్నల శైలి మార్చడం వల్లే ప్రజలు ఎక్కువ ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించి, కోట్లాది మందిని రాత్రికి రాత్రే పేదరికం నుండి బయటపడేసారు.


ఉచిత రేషన్‌ను ఆదాయంగా చూపించడం:
2014 నాటికి ఉచితంగా ఇచ్చే సరుకులను ప్రజల సొంత కొనుగోలు శక్తిగా లేదా ఆదాయంగా లెక్కించేవారు కాదు. కానీ 2023 నాటి లెక్కల్లో దేశంలోని 80 కోట్ల మందికి ఇచ్చే ఉచిత బియ్యం, గోధుమల మార్కెట్ విలువను సదరు కుటుంబ వినియోగ ఆదాయంలో కలిపి చూపించారు. ఒక పూట తిని బతికే వాడికి ప్రభుత్వం ఉచిత బియ్యం ఇస్తే ఆ బియ్యం విలువ అంత డబ్బు సంపాదించినట్లు రికార్డుల్లో రాసి, పేదలు పేదరికం దాటేసినట్లు లెక్క చూపిస్తున్నారు!

బహుముఖ పేదరిక సూచీలో మార్పులు:
2014లో కేవలం విద్య, వైద్యం, కనీస ఆదాయం వంటి ప్రాథమిక అవసరాల తీవ్రతను బట్టి పేదరికాన్ని కొలిచేవారు. కానీ 2023 నాటికి దీనిని 12 రకాల సూచీలుగా మార్చి, అందులో జన్ ధన్ బ్యాంక్ అకౌంట్, మొబైల్ ఫోన్, ఉచిత గ్యాస్ కనెక్షన్ వంటి వాటిని చేర్చారు. ఖాతాలో సున్నా బ్యాలెన్స్ ఉన్నా, సిలిండర్ రీఫిల్ చేసుకోలేక పక్కనపెట్టినా... వారికి బ్యాంక్ అకౌంట్, గ్యాస్ ఉన్నాయి కాబట్టి వారు పేదలు కారని మార్పులు వేసి పేదరికం నుండి తొలగించారు.

డేటా ఆధారిత తాజా విశ్లేషణ, క్షేత్ర వాస్తవాలు:
కంటితుడుపు అక్షరాస్యత: దేశంలో 80% అక్షరాస్యత సాధించామని ప్రచారం జరుగుతోంది. కానీ కేవలం సంతకం నేర్పితే అక్షరాస్యులుగా గుర్తించే ప్రస్తుత ప్రమాణం వల్ల మానవ వనరుల నిజమైన ఉత్పాదకత శూన్యం. నాణ్యమైన విద్య, టెక్నికల్ స్కిల్స్ లేని అక్షరాస్యత కేవలం గణాంకాల అలంకార ప్రాయమే.

మల్టీడైమెన్షనల్ పావర్టీ మోసం:
అంతర్జాతీయంగా రోజువారీ ఆదాయ రేఖను మార్చినప్పటికీ, దేశీయంగా చేసిన ఈ సర్వే మార్పుల వల్ల ఒక పూట తినే వాళ్లు కూడా పేదరికం నుండి బయటపడినట్లు లెక్కల్లోకి వచ్చారు.

జీరో బేస్డ్ క్షేత్ర వాస్తవాలు:
బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుండి నిత్యం వేలాది మంది హైదరాబాద్ వంటి నగరాలకు భవన నిర్మాణ కార్మికులుగా వలస వస్తున్నారు. నగరాల్లో తాత్కాలిక ప్లాస్టిక్ షెడ్ల కింద నివసించే వారి పిల్లలకు చదువు, వైద్యం, నివాసం, రక్షిత మంచినీరు, టాయిలెట్లు అన్నీ 'జీరో బేస్డ్' (కనీస స్థాయి కూడా లేనివి) గానే ఉన్నాయి. ఆదాయ రేఖను పేపర్ మీద దాటించడం కాదు, బహుముఖ మానవ వసతులను స్థానికంగానే అందించడమే నిజమైన వృద్ధి. ఎవరిని మోసగించడానికి ఈ నక్కజిత్తుల లెక్కలు? రాబోయే ఎన్నికల్లో గెలవడానికి ఇప్పట్ను ంచి అధికార పార్టీ ఆయుధాలు సమకూర్చుకు ంటున్నది. అందులో భాగమే ప్రభుత్వం, కార్పొరేట్లు, ప్రపంచ బ్యాంకు కలిసి చేసిన లాబీయింగ్ ఫలితమే ఈ నకిలీ లెక్కలు అని వాస్తవాలు తెలుపుతున్నాయి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలి
- ప్రతి ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కొల్చారం, నవంబర్ 1 (జనం సాక్షి) : భారీ వర్షంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కురిసిన భారీ వర్షానికి కొల్చారం మండలంలోని కొల్చారం, పోతంశెట్టిపల్లి, సంగాయిపేట, వరిగుంతం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తీవ్రంగా తడిసిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయా గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న ధాన్యాన్ని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి



తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటికే పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షం మరింత భారంగా మారిందని అన్నారు. తడిసిన ధాన్యం నాణ్యత పేరుతో మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా, ఎలాంటి షరతులు విధించకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

ప్రతి ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి

ప్రభుత్వం ప్రకటించిన క్రాప్ హాలిడే నేపథ్యంలో రైతులకు ప్రతి ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే వారి పక్షాన నిలబడి పోరాటం చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, యువజన అధ్యక్షుడు తునుకులపల్లి సంతోష్ రావు, మాజీ జడ్పీటీసీ మేఘమాల సంతోష్, మాజీ సర్పంచ్ కరెంట్ రాజగౌడ్, ఉపసర్పంచ్ కొరంపల్లి రాణి గోపి, సొసైటీ చైర్మన్ మనోహర్, చిన్నారపు ప్రభాకర్, మండల గౌడ సంఘం ఉపాధ్యక్షుడు భూత్పురం శేఖర్ గౌడ్, చౌరిగారి చిన్న రాములు, చెన్నయ్య, పాండ్ర వెంకటేష్, గ్యాస్ కృష్ణ, వార్డు సభ్యులు నీరుడి పెద్ద ప్రభాకర్, సత్యనారాయణ, వై. కృష్ణ, సాతెల్లి శేకులు, చింతల కిష్టయ్య, డైరెక్టర్ బాలయ్య, మాజీ ఎంపీటీసీ సాయిని సిద్ధిరాములు, మోహన్ నాయక్, దుర్గయ్య, ఆది లక్ష్మణ్, ధన్‌రాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



యాచారం, నవంబర్ 1 (జనం సాక్షి) : యాచారం మండలం మేడిపల్లి గ్రామంలోని ముచ్చర్ల కాలనీలో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాలనీవాసుల సుదీర్ఘకాల ఆకాంక్షను నెరవేరుస్తూ నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం ముందుకు సాగుతోందని, నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దేండీ మధుకర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు అలంపల్లి మహేష్, నల్లోళ్ల గణేష్, ముచ్చర్ల మాధవి, నల్లోళ్ల మమత, అండెకార్ అనిల్, మక్కపల్లి మహేష్, బూరె కుమార్, బూరె సురేందర్, ముచ్చర్ల శ్యామ్సన్, ముచ్చర్ల గణేష్, నల్లోళ్ల జగన్లతో పాటు ఆదర్శ యూత్, ప్రగతి యూత్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

మర్పల్లి, నవంబర్ 1 (జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో అబ్దుల్ రెహమాన్ వెల్ఫర్‌లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మర్పల్లి మండల కేంద్రంలో అబ్దుల్ రెహ్మాన్ వెల్ఫర్ లో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో నందు కొంతమంది ప్రభుత్వం చే నిషేధించబడిన పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. వెంటనే సిబ్బంది తో ఆకస్మికంగా అబ్దుల్ రెహమాన్ వెంచర్ నందు తనిఖీ చేయగా అక్కడ 7 మంది పేకాట దబ్బులు బెట్టింగ్ పెట్టుకొని ఆడుతూ ఉన్నారు. వారు పోలీసులను చూసి పారిపోతుంటే వారిని పట్టుకుని వారి వద్ద 52వేల 240 రూపాయల నగదు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలో పేకాట అసాంఘిక కార్యక్రమాలకు చేపడితే చట్టపర్యమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రంలో ఉన్న అబ్దుల్ రెహ్మాన్ వెల్ఫల్ చుట్టుపక్కల ప్రాంతాలలో జరుగుతున్న పేకాట, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి ఇతర సాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు నిఘు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నర్సింగ్ కళాశాల ప్రారంభం

గద్వాల, నవంబరు 1 (జనం సాక్షి) : గద్వాల పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, వసతి గృహ భవనాలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తన సతీమణి జ్యోతితో కలిసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి భవనాలను ప్రారంభించిన అనంతరం, వారు కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, విద్యార్థినుల వసతి గృహంలోని సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ ఉన్న నర్సింగ్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారికి అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక అద్భుతమైన మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు సైతం స్థానికంగానే ఉన్నత వైద్య విద్యను అందించేందుకే ఈ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. భవిష్యత్తులో ఉత్తమ నర్సులుగా రాణించబోయే విద్యార్థులు మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకుని, రోగులకు నాణ్యమైన, మానవీయ విలువలతో కూడిన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ విద్యాసంవత్సరం నుంచే పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని వెల్లడించారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల నిరుపేద విద్యార్థులకు ఈ ప్రభుత్వ కళాశాల ఏర్పాటు ఒక గొప్ప వరమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో తాగునీరు, విద్యుత్, భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిని మరింత ఆధునీకరించి, అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్య సేవలను ఇక్కడే అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ



ఉత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, వైద్య శాఖ అధికారులు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఈసీఐఎల్ నారాయణ విద్యార్థుల విజయకేతనం



కాప్రా, నవంబర్ 1 (జనం సాక్షి) : క్రీడా పోటీల్లో ఈసీఐఎల్ నారాయణ విద్యార్థుల విజయకేతనం ఎగరవేశాలని ప్రిన్సిపల్ మంజు భార్గవి పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీల్లో ప్రైమరీ, మిడిల్ స్కూల్, హైస్కూల్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఈసీఐఎల్ నారాయణ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయాలను సాధించారు. కోకో పోటీల్లో మొదటి, రెండవ స్థానాలను కైవసం చేసుకోగా, త్రోబాల్, రిలే రేస్ పోటీల్లో కూడా రెండవ స్థానాలను సాధించారు. తమ క్రీడా నైపుణ్యాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, ఈసీఐఎల్ నారాయణ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ అద్భుత ప్రతిభను కనబరచడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రిన్సిపల్ మంజు భార్గవి మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఆటలు విద్యార్థుల శారీరక ఎదుగుదలకే కాకుండా మానసిక వికాసానికి, ఆత్మవిశ్వాసానికి, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల పట్ల ఏజీఎం పురుషోత్తం రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ మంజు భార్గవి హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన క్రీడా ఉపాధ్యాయులను, సహకరించిన పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ విజయాలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలకు నిదర్శనంగా నిలిచాయి.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకర సమాజం

- ఓల్డ్ అల్వాల్‌లో పాదయాత్ర, సైకిల్ ర్యాలీ



అల్వాల్, నవంబరు 1 (జనంసాక్షి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత, పర్యావరణ పరిరక్షణ నినాదంతో ఓల్డ్ అల్వాల్‌లో ఆదివారం పాదయాత్ర, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అల్వాల్ హిల్స్ కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గ్లోబల్ ఆరిజిన్ అండ్ కార్బన్ డయాక్సైడ్ సైక్లింగ్ క్లబ్, జాగో హిందూ జాగో బృందం, యోగి వేమన, పతంజలి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట పార్కు నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బోగ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నిజాం పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొందడంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జాతీయ సమగ్రతను కాపాడటంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సైకిల్ తొక్కడం, నడకను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని, నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పార్కు నుంచి ప్రారంభమైన పాదయాత్ర, సైకిల్ ర్యాలీ హెచ్ఎంటీ కాలనీ, మంజీరా కాలనీ, ఫాదర్ బాలయ్య కాలనీ, సిటిజన్ కాలనీ, అల్వాల్ హిల్స్ మీదుగా సాగి తిరిగి పార్కు వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో ఓల్డ్ అల్వాల్ సంఘం ప్రతినిధులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అల్వాల్ హిల్స్ క్రికెట్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. దేవేందర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు జగన్, గురువయ్య, ముకేష్, శరత్‌చంద్ర, శ్రీనివాసరావు, వినయ్‌కుమార్, గిరిధర్, శ్రీలేఖ, నర్సింహారెడ్డి, సుదీప్, మల్లికార్జున్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం



మద్దూరు, నవంబర్ 1 (జనం సాక్షి) : నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని అమర్‌గడ్డ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కోస్గి సీఐ సైదులు ఆధ్వర్యంలో ఉదయం 5:30 నుంచి 8:30 గంటల వరకు జరిగిన ఈ తనిఖీల్లో 65 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని 144 ఇళ్లను తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని 79 వాహనాలను సీజ్ చేశారు. వీటిలో 74 ద్విచక్ర వాహనాలు, నాలుగు త్రిచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం ఉన్నాయి. అలాగే 15.66 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా, మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రధాన కూడళ్లు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం, విక్రయం, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ ఆపరేషన్‌లో మద్దూరు ఎస్సై విజయ్‌కుమార్, దామరగిద్ద ఎస్సై నరేష్, కోస్గి ఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

- ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి
- టియూటిఎఫ్ డిమాండ్

హయత్ నగర్, నవంబర్ 1 (జనం సాక్షి) : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటి ఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం అన్నోజిగూడలో రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను త్వరితగతిన తెప్పించుకొని, 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రయోజనాలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు అందించాలని కోరారు. అలాగే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, రాష్ట్రంలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టియుటిఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి నూతనకంటి బాబు, యర్రంశెట్టి స్నేహ, మేడ్చల్ జిల్లా



అధ్యక్షులు పంబళ్ల రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శంకర్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి వెంకటేశ్వరరావు, నర్సింగరావు, పెద్దోళ్ల శ్రీనివాస్, కడెం సోమయ్య, సూరిబాబు, పంతంగి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రోహిత్‌రావు జన్మదిన వేడుకలు



మెదక్, నవంబర్ 1 (జనం సాక్షి) : మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి డాక్టర్ రోహిత్‌రావు జన్మదిన వేడుకలను ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువకులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ అనంతరం రాందాస్ చౌరస్తా వద్ద భారీ కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు, పార్టీ నాయకులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని తమ అభిమానం చాటుకున్నారు.

ఉప్పల్ నల్ల చెరువులో 'డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్' సేవలు ప్రారంభం

ఉప్పల్, నవంబర్ 1 (జనం సాక్షి) : నగరంలో నీటి వనరుల సంరక్షణతో పాటు నీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించి, పచ్చదనాన్ని మరింత పెంపొందించే దిశగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మరో కీలక ముందడుగు వేసింది. ఉప్పల్ నల్ల చెరువు మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) వద్ద 'డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్' సేవలను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ ప్రారంభించారు. శుద్ధి చేసిన మురుగునీటిని వృథాగా వదిలేయకుండా తిరిగి ప్రజోపయోగానికి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ వినూత్న సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. సాధారణంగా నగరంలోని పార్కులు, రోడ్ల పక్కన ఉన్న గ్రీన్ బెల్టులు, డివైడర్ల మధ్య పెంచుతున్న మొక్కలు, ఇతర పచ్చదన ప్రాంతాలకు నిత్యం నీటిని అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం పెద్ద మొత్తంలో తాగునీటిని వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేసిన నీటిని మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణ వంటి అవసరాలకు వినియోగించడం ద్వారా తాగునీటిపై పడుతున్న భారాన్ని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నల్ల చెరువు ఎస్టీపీ వద్ద శుద్ధి చేసిన నీటిని ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేయనున్నారు. నగరంలోని పార్కుల నిర్వహణ సంస్థలు, గ్రీన్ బెల్టుల బాధ్యతలు చూసే విభాగాలు, మొక్కల పెంపకానికి నీరు అవసరమైన ప్రాంతాలకు ఈ సేవలు ఉపయోగపడనున్నాయి. దీంతో ఒకవైపు శుద్ధి చేసిన నీటికి తిరిగి వినియోగం కల్పించడంతో పాటు మరోవైపు విలువైన తాగునీటి వనరులను పొదుపు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ కార్యక్రమం చాటిచెబుతోంది. మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు, నీటి వృథా నివారణకు, నగర సౌందర్యాన్ని పెంపొందించడానికి దోహదపడుతుంది. నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు, పార్కులు మరియు ఇతర హరిత ప్రాంతాలకు నిరంతర నీటి



సరఫరా అందించేందుకు 'డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్' సేవలు ఉపయోగకరంగా నిలవనున్నాయి. నీటి పునర్వినియోగం దిశగా ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణహిత నగర నిర్మాణానికి ఈ కార్యక్రమం మరింత ఊతమివ్వనుంది. డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్ సేవలు పొందాలనుకునే వారు 155313 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
02 నవంబర్ 2026

అన్నదాతకు నవంబర్ వానలే ఆశ..!

- అడుగంటుతున్న జలాశయాలు.. ఎండుతున్న పంటలు!
- ఎండిపోతున్న చెరువులు.. తరుముకొస్తున్న కరువు!
- నవంబర్‌లోనైనా వరుణుడు కరుణిస్తాడా?
- వర్షాల కోసం ఎదురుచూస్తున్నరైతులు
- రబీ సాగుపై నీటి కొరత ప్రభావం
- చేతికొచ్చిన పంటను కాపాడుకోవడమే రైతులకు సవాల్!



ఎదురుచూస్తున్నారు.

కోహీర్, నవంబర్ 1 (జనం సాక్షి) : వానాకాలం ముగింపు దశకు చేరుకుంటున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సంగారెడ్డి జిల్లా వ్యవసాయ రంగం ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఖరీఫ్ పంటలు చేతికొచ్చే సమయంలో పొలాల్లో తేమ తగ్గిపోవడం, చెరువులు, జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. మరోవైపు రబీ సాగుకు నీటి లభ్యతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నవంబర్ నెలలో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

వర్షపాతం లోటుతో విలవిల..

ఈ ఏడాది వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతోంది. తెలంగాణలో సుమారు 25 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో పంటలకు అవసరమైన నీరు అందకపోవడంతో పంటలు వాడిపోతున్నాయి. కోహీర్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ రైతులు వర్షాల కోసం

అడుగంటుతున్న జలాశయాలు..

వర్షాలు లేకపోవడంతో ప్రధాన ప్రాజెక్టులు, మధ్యతరహా జలాశయాలు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గుముఖం పడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా క్రమంగా అడుగంటడంతో బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గుతోంది. కొన్ని ప్రాంతాల్లో బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటలకు చివరి తడి అందించలేకపోతున్నారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు వృథా అవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రబీ సాగుపై నీటి కొరత ప్రభావం..

ఖరీఫ్ పంటల పరిస్థితి ఇలా ఉంటే రానున్న రబీ సీజన్‌పై కూడా నీటి కొరత ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు తగ్గిపోవడం, చెరువుల్లో నీరు లేకపోవడంతో రైతులు రబీ సాగు చేపట్టాలా? వద్దా? అనే సందిగ్ధంలో ఉన్నారు. అల్లం, అరటి, పసుపు, చామగడ్డ, మొక్కజొన్న, శనగ తదితర పంటల సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవకపోతే సాగు విస్తీర్ణం తగ్గే ప్రమాదం ఉందని రైతులు భావిస్తున్నారు.

నవంబర్ వర్షాలపైనే ఆశలు..

నవంబర్ నెలలో వర్షాలు కురిస్తే కొంతమేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో పాటు చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలకు అవసరమైన తేమ అందడంతో పాటు రబీ సాగుకు కూడా కొంత ఊరట లభిస్తుందని భావిస్తున్నారు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో నవంబర్ వానలు రైతులకు ఎంతో కీలకంగా మారాయి.

బంగాళాఖాతంలో కొత్త వాతావరణ వ్యవస్థ..

మరోవైపు బంగాళాఖాతంలో కొత్త వాతావరణ వ్యవస్థ ఏర్పడినట్లు ఉపగ్రహ పరిశీలనల్లో గుర్తించినట్లు సమాచారం. ఈ వాతావరణ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం వైపు కదులుతున్న నేపథ్యంలో తీర ప్రాంతాల్లో వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశాలున్నట్లు వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. అయితే ఈ ప్రభావం తెలంగాణలోని అంతర్గత ప్రాంతాలపై ఎంతవరకు ఉంటుందనేది వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

రైతులకు ఊరట లభించేనా..?

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ ప్రభావంతో విస్తృతంగా వర్షాలు కురిస్తే ఏపీతో పాటు తెలంగాణలోని కొన్ని ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. అయితే వర్షాలు ఎక్కడ, ఎంత మేరకు కురుస్తాయన్నది కీలకం. తీర ప్రాంతాలకే వర్షాలు పరిమితమైతే వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న అంతర్గత ప్రాంతాలకు పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. అందుకే రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు.

ఇప్పటికే పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన అన్నదాతలకు వాటిని కాపాడుకోవడమే పెద్ద సవాల్‌గా మారింది. అప్పులు చేసి సాగు చేసిన రైతులకు వర్షాభావం మరింత భారంగా పరిణమిస్తోంది. నవంబర్‌లో విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితేనే వ్యవసాయ రంగానికి కొంత ఊరట లభించనుంది. లేకపోతే ఖరీఫ్ నష్టాలతో పాటు రబీ సాగు కూడా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరి నవంబర్ నెలలో వరుణుడు కరుణించి అన్నదాతను ఆదుకుంటాడా? లేక రైతన్నకు కష్టాలు కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సిందే.

తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు 'స్వచ్ఛ జలధార'

- ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తర్నికల్‌లో మూడో విడత కార్యక్రమం



కల్వకుర్తి, నవంబర్ 1 (జనంసాక్షి) : ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమంలో భాగంగా ఆదివారం కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామపంచాయతీలో తాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో మూడో విడతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శుభ్రం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతోపాటు తాగునీటి నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.ఈ కార్యక్రమంలో తర్నికల్ గ్రామ సర్పంచ్ చేనిరెడ్డి వరలక్ష్మి, పవన్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్ యాదవ్, గ్రామ కార్యదర్శి, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్, బాబు, గణేష్, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారంలో పెద్దమ్మ తల్లి ఆలయ గడప ప్రతిష్ఠాపన మహోత్సవం



కొల్చారం, నవంబర్ 1 (జనం సాక్షి) : మండల కేంద్రమైన కొల్చారంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ గడప ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గడపను ప్రతిష్ఠించారు. ప్రతి ఇంటి నుండి రాగి కలశం లో నీళ్లు, పసుపు, కుంకుమ, పువ్వులు, కొబ్బరికాయలు తెచ్చి స్త్రీలు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో గడప ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉప సర్పంచ్ కొరంపల్లి రాణి గోపి, దేవన్న గారి ప్రశాంత్, ఆశన్న గారి అంజయ్య, ఆర్మేల నాగరాజు, తెనుగు శేఖర్, ఎండుగుల శేఖర్, సార సుదర్శన్, నేరల్ల సత్యనారాయణ, ఎండుగుల యాదగిరి,కుమ్మరి నాగరాజు, ఆశన్న గారి శ్రీశైలం, ఎండుగుల అంజయ్య, శ్రీశైలం, కృష్ణ, భూమేష్, యాదగిరి, రామకృష్ణ, చింతల యాదగిరి,బాల్ రాజ్, కృష్ణ, మల్లేశం, బాణయ్య, శ్రీరామ్,చంటయ్య, రాములు, జటవోయిన రాజు, శ్రీశైలం, పోచయ్య, సంగమేశ్వర్, అంకం సత్తయ్య,దత్తు,దుర్గయ్య, మాజీ సర్పంచ్ రాజగౌడ్, తిమ్మన్న గారి ఆంజనేయులు, రామకృష్ణ గౌడ్, చౌరి గారి చిన్న రాములు, సంజీవ్ రావు ,చెన్నయ్య,రాజిరెడ్డి, కమ్మరి దశరథ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆసరా పింఛన్లను వెంటనే మంజూరు చేయాలి



వనపర్తి రూరల్, నవంబర్ 1 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తామని ప్రకటించిన ఆసరా పింఛన్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేయాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తిలోని సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మందికి కొత్త ఆసరా పింఛన్లు అందజేస్తామని ప్రకటించి వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, డయాలసిస్, ఎయిడ్స్, బోదకాలు వ్యాధిగ్రస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. వనపర్తి జిల్లాలోని పానగల్ మండలంలో 742, వనపర్తి మండలంలో 749 దరఖాస్తులు రాగా, మిగిలిన 13 మండలాల్లోనూ వందల సంఖ్యలో దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసి దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు పంపించినప్పటికీ, ఇప్పటివరకు పింఛన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన పేదలు నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాలోని 11 మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఆయా మండలాల్లోని అర్హులైన పింఛన్ దరఖాస్తుదారులకు తక్షణమే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీరంగాపూర్, చిన్నంబాయి, మదనాపూర్, రేవల్లి మండలాలను కూడా కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈసారి వృద్ధాప్య పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వయోభారంతో ఉపాధి చేసుకోలేని వృద్ధులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా కరువు పింఛన్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందక పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కళావతమ్మ, పృథ్వీనాదం, శివ, ఉదయ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై బీజేపీ కుట్ర

- చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ డిమాండ్



కోహెడ, నవంబర్ 1 (జనంసాక్షి) : కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి పునాదైన ఓటు హక్కును కాలరాస్తూ ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగింపునకు కుట్ర పన్నిందని ఏఐఎస్ఎఫ్ కోహెడ మండల కార్యదర్శి రాసురి యుగేందర్ కేంద్ర ప్రభుత్వ పని తీరును విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను ఏరివేసి రాజకీయ లబ్ధి పొందాలన్నదే బీజేపీ వ్యూహమని ఆయన ఆరోపించారు. ఓట్లు తొలగింపునకు బాధ్యుడైన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి ఓటు చోరీపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే అరెస్ట్ చేయాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ 2023లో ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించిన చట్టాన్ని సవరించి, సీఈసీకి పదవీ బాధ్యతల నిర్వహణలో రక్షణ కల్పించారని ఆరోపించారు. ఈ నిబంధనలను అడ్డుపెట్టుకొని ఓట్లు తొలగింపునకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కల్పించిన సమానత్వ హక్కును, ఆర్టికల్ 326 ద్వారా లభించిన ఓటు హక్కును ఎస్ఐఆర్ ప్రక్రియ దెబ్బతీస్తోందని యుగేందర్ ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను జాబితాల నుంచి తొలగించడం ద్వారా బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు తెలుపుతుంటే సమాధానం చెప్పలేక జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పించిన భావప్రకటన, సమావేశ స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన విమర్శించారు. బిజెపి చేతిలో కీలు బొమ్మగా మారి బిజెపి వ్యతిరేక ఓట్లను సవరణ పేరుతో తొలగిస్తున్న కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించి అతన్ని తక్షణమే అరెస్టు చేయాలని యుగేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు చిట్యాల శేఖర్, కందుకూరి మహేష్, ఎర్ర శ్రీనివాస్, చిట్యాల రాజు, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే



మల్దకల్, నవంబర్ 1 (జనంసాక్షి) : మండల పరిధిలోని మేకలసొంపల్లి, పావనంపల్లి,గ్రామాలలో ఆదివారంఇందిరమ్మ ఇల్లు నుఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.మేకల సొంపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర,ఆంజనేయులు, పావనంపల్లి గ్రామానికిచెందిన రంగముని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది.వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులతో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మా ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి,విక్రమ్ సింహారెడ్డి,మాజీ ఎంపీపీ రాజారెడ్డి,విజయ్ కుమార్, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,సర్పంచ్ జయరాములు,భరత్ రెడ్డి, రమేష్ రెడ్డి,వెంకటన్న జయరాములు జీవన్ రెడ్డి శివతదితరులు పాల్గొన్నారు.

సాయినాథ్ ఇండస్ట్రీస్ లో 9 కోట్ల ధాన్యం మాయం

- కేసు నమోదు చేసిన పోలీసులు



తూప్రాన్, నవంబర్ 1 (జనం సాక్షి) : మండలంలోని ఘణపూర్ గ్రామ శివారులో గల సాయినాథ్ ఇండస్ట్రీస్‌లో మరి తొమ్మిది కోట్ల విలువ గల వరి ధాన్యం షార్టేజ్ గుర్తింపు సుమారు రూ.9 కోట్ల విలువ గల ధాన్యం షార్టేజ్ వున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు. గణపూర్ గ్రామంలోని సాయినాథ్ ఇండస్ట్రీస్‌పై సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో సుమారు 3,620 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం గ్రూఎనఎ) షార్టేజ్ ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ షార్టేజ్ అయిన వరి ధాన్యం విలువ సుమారు రూ.9 కోట్ల వరకు ఉంటుందని విజిలెన్స్ అధికారులు అంచనా వేయడం జరిగింది. ఈ విషయమై మెదక్ సివిల్ సప్లైస్ అసిస్టెంట్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుప్రాన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

క్రీడలు మైత్రిని, ఐక్యతను పెంపొందిస్తాయి

- మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి



జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి) : పట్టణంలోని స్థానిక డాక్టర్ బి.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జడ్చర్ల ఫోటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలను మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ వృత్తిపరమైన బాధ్యతలు, పని ఒత్తిడితో నిత్యం బిజీగా గడిపే ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. క్రీడలు ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, క్రీడాకారుల మధ్య మైత్రిని, ఐక్యతను మరియు సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులకు, పోటీల్లో పాల్గొంటున్న వివిధ జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో జలవనరుల అభివృద్ధికి శ్రీకారం

- జూలపల్లి గ్రామ సర్పంచ్,పద్మమ్మ ప్రత్యేక చొరవ..
- రూ.2.18లక్షలతో కుంట నిర్మాణ పనులకు భూమిపూజ
- వన్యప్రాణులకు తాగునీటి వసతి..భూగర్భ జలమట్టం పెంపునకు దోహదం



మహమ్మదాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : అటవీ ప్రాంతంలో జలవనరుల అభివృద్ధి,పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా జూలపల్లి గ్రామపంచాయతీ కీలక అడుగు వేసింది.మండల పరిధిలోని జూలపల్లి అటవీ ప్రాంతంలో రూ.2.18లక్షల వ్యయంతో చేపట్టనున్న కుంట నిర్మాణ పనులకు ఆదివారం గ్రామ సర్పంచ్, గుండుమల్ల పద్మ నర్సింహులు, భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు,పక్షులు,ఇతర జీవరాశులకు ఏడాది పొడవునా తాగునీటి వసతి కల్పించడంతో పాటు భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడమే ఈకుంట నిర్మాణ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.సుమారు 60మీటర్ల వెడల్పుతో, తొమ్మిది అడుగుల ఎత్తుతో కట్ట నిర్మాణం చేపట్టనున్నట్లు, వెల్లడించారు. వర్షాకాలంలో కురిసే నీటిని కుంటలో ఒడిసిపట్టి నిల్వ చేయడం ద్వారా వేసవిలోనూ అటవీ జీవరాశులకు నీటి కొరత లేకుండా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా కుంటలో నిల్వచేసిన, నీరుభూమిలోకి ఇంకడం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. అటవీ ప్రాంతం వెనుకభాగంలోని వ్యవసాయ భూములతో పాటు దిగువ ప్రాంత రైతుల బోర్లలోనూ నీటి లభ్యత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటవీ సంరక్షణ, పర్యావరణ సమతుల్యత, వన్యప్రాణుల మనుగడకు జలవనరులు ఎంతో కీలకమని, ఈ దిశగా గ్రామపంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామ పరిధిలోనే కాకుండా అటవీ ప్రాంతంలోనూ పర్యావరణహిత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రకృతి సంపద పరిరక్షణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిష్టయ్య, ఫారెస్ట్ బీట్‌ఆఫీసర్ ఆంజనేయులు, బి.శివ, జె.లింగమయ్య, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లిలో కొమురం భీం విగ్రహావిష్కరణ

- గిరిజనుల ఆరాధ్య దైవం కుమ్రంభీమ్ పోరాటం స్ఫూర్తిదాయకం
- గిరిజనుల హక్కుల పరిరక్షణ, జిల్లా అభివృద్ధికి అందరి సమన్వయంతో కృషి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



దండేపల్లి 1 నవంబర్ (జనం సాక్షి) : గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు తదితర రంగాల అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కుమ్రంభీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ- ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, డిసిపి ఎ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఇన్చార్జి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సురేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 1940లో కుమ్రంభీమ్ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, జల్ – జంగల్ – జమీన్ నినాదంతో గిరిజనుల నీరు, అడవి, భూమిపై హక్కుల కోసం పోరాడారని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా, మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని, అదే తరహాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలను విద్యా ప్రమాణాలలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని తెలిపారు. అటవీ హక్కుల చట్టం-2006 క్రింద అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల పట్టాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం పట్టాలు మంజూరు చేస్తామని, అధికారులు పూర్తి వివరాలతో పరిశీలన చేయాలని సూచించారు. టైగర్ రిజర్వ్, నేషనల్ పార్క్ పరిధిలోని గ్రామాల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, అక్కడి ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించే దుకు కృషి చేస్తున్నామని, అటవీ ప్రాంతాలలో విద్యుత్, రహదారులు, త్రాగునీరు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు కల్పించడంలో ఉన్న పరిమితుల దృష్ట్యా, గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పునరావాసానికి ముందుకు వస్తే మెరుగైన సౌకర్యాలు అందుబాటులో వచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు తమకు అవసరమైన భూమి, పరిహారం, పునరావాస సౌకర్యాలకు సంబంధించి సముచితమైన ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

ధన్వాడలో ఆధ్యాత్మిక వైభవం

- దత్తాత్రేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమం
- గణపతి సచ్చిదానంద స్వామివారి దివ్య అనుగ్రహం
- భక్తిపారవశ్యంలో ధన్వాడ
- మేడిచెట్టుకు విశిష్ట ఆధ్యాత్మిక ప్రాశస్త్యం
- దత్తాత్రేయుడు సమస్త గురు పరంపరకు ఆదిగురువు
- ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి /కాటారం, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. అవధూత దత్త పీఠాధిపతి పరమపూజ్య గణపతి సచ్చిదానంద స్వామివారి దివ్య సాన్నిధ్యంలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వయంగా స్వామివారు ఆలయాన్ని సందర్శించి హోమాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అనుగ్రహం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గణపతి సచ్చిదానంద స్వామివారి పవిత్ర సాన్నిధ్యంలో దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించడం ఎంతో ఆనందదాయకమన్నారు.



స్వామివారి దివ్య ఆశీస్సులతో ధన్వాడ గ్రామ ప్రజలతో పాటు జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గత రెండేళ్లుగా తన తల్లి జయశ్రీ, సతీమణి, కుటుంబ సభ్యులు స్వామివారిని ఈ ప్రాంతానికి ఆహ్వానించి ఇక్కడి ప్రజలకు వారి ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నారని తెలిపారు. వారి ఆకాంక్ష మేరకు స్వామివారు ధన్వాడకు విచ్చేసి ప్రత్యేక హోమం నిర్వహించి భక్తులను అనుగ్రహించడం తమ కుటుంబానికే కాకుండా ఈ ప్రాంత ప్రజలందరికీ ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.

మేడిచెట్టుకు మహిమాన్వితమైన ప్రాశస్త్యం..

మేడిచెట్టుకు హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రమైన స్థానం ఉందని గణపతి సచ్చిదానంద స్వామివారు వివరించారు. పురాణ గాథల ప్రకారం నరసింహస్వామివారి ఉగ్రరూపాన్ని శాంతింపజేయడంలో మేడిచెట్టుకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మేడిచెట్టును దర్శించుకోవడం, భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేయడం వల్ల మనస్సుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతాయని భక్తుల విశ్వాసమని తెలిపారు. మేడిచెట్టులో ఔషధ గుణాలు కూడా ఉన్నాయని, ప్రకృతి ప్రసాదించిన వృక్ష సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సూచించారు.

త్రిమూర్తుల స్వరూపుడు.. దత్తాత్రేయుడు..

శ్రీ దత్తాత్రేయ స్వామివారు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తుల అంశలతో అవతరించిన దైవస్వరూపులని, సమస్త గురు పరంపరకు ఆదిగురువుగా పూజలందుకుంటున్నారని స్వామివారు వివరించారు. గురుతత్వం, జ్ఞానం, ఆధ్యాత్మిక సాధనకు దత్తాత్రేయ స్వామివారు ప్రతీకగా నిలుస్తారని పేర్కొన్నారు. భక్తులు గురుభక్తి, దైవచింతన, సేవాభావంతో సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. గణపతి సచ్చిదానంద స్వామివారి దివ్య కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సమరభేరీ

- రాంలీలా మైదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, నవంబర్ 01 (జనంసాక్షి) : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించిన ఓట్ చోరీ వ్యతిరేక కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఆమె పాల్గొన్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేశారు.ప్రజల తీర్పే ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ తీర్పును గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ, రాజ్యాంగ విలువల బలోపేతం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తో పాటు పాలకుర్తి నియోజకవర్గ నాయకులు పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

అక్రమంగా కూల్చిన ఇండ్ల సామాగ్రి మాయం

- రక్షణ చర్యలు చేపట్టాలని బాధితుల డిమాండ్



మల్హర్,నవంబర్ 01(జనంసాక్షి) : మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఆమ్లెట్ విలేజైన సత్రాజ్ పల్లి గ్రామంలో అక్టోబర్ 10న అర్ధరాత్రి రెవిన్యూ, సింగరేణి, ఫారెస్ట్ అధికారులు అక్రమంగా ఎలాంటి సమాచారం లేకుండా దాదాపు 370 గృహాలను కూల్చిన అధికారులు. బాధిత నిర్వాసితులైన గడ్డం తిరుపతి యాదవ్, తిరుపతి, సంపత్, రమేష్, సుకరి చంద్రయ్య, ప్రశాంత్ తదితరులు తమ ఇండ్లను కూల్చిన అధికారులు వారే రక్షణగా ఉండాల్సిందిగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూల్చిన ఇండ్ల లోని కర్రలు, తలుపులు, కిటికీలు అన్ని దొంగల పాలవుతున్నాయని నిర్వాసితులు ఆపోయారు. దీనికి బాధ్యులైన అధికారులపై ఉన్నత న్యాయస్థానంలో న్యాయ పోరాటం చేయనున్న మనీ బాధితులు గడ్డం తిరుపతి యాదవ్ అన్నారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం ఇటీవల జీవో ఇచ్చినదని, దాని ప్రకారం సింగరేణి సంస్థపై ఉన్నత న్యాయస్థానంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు. కూల్చిన ఇండ్లపై త్వరలో ఎస్టిమేషన్ వేసి న్యాయ ప్రక్రియ మొదలు పెడతామని తెలిపారు.ఈ కార్యక్రమం లో బాధితులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు
- అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్



మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 01 (జనం సాక్షి): రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం రేషన్ షాపులు, అలాగే వివిధ రకాల బియ్యం ప్రైవేటు దుకాణదారుల ద్వారా విక్రయాలు నిబంధనల ప్రకారం ధరలు నిర్వహించడం జరిగిందని, ఆట్టి ధరలను విస్మరించి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ రకాల బియ్యం ప్రైవేటు షాపుల ద్వారా అమ్మే నిబంధనలో ప్రభుత్వ సూచనలు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాటు చేయడం జరిగిందని. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట విక్రయాల ధరలు తెలంగాణ బిపిటి బియ్యం కిలో 66, తెలంగాణ సోనా బియ్యం కిలో 74, తెలంగాణ శ్రీరామ గోల్డ్ బియ్యం 79.గా నిర్ణయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు, రైస్ టెండర్స్ దారులు, హోల్ సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు, నిర్ణయించిన గరిష్ట దరకు మించకుండా బియ్యం విక్రయించాలని సూచించారు. వినియోగదారుల నుండి నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల వివరాలను విక్రయాల కేంద్రాల వద్ద బ్యానర్ రూపంలో ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్ కోరారు.

బూర్గుపేట కథకు ముగింపెప్పుడో..?

- 'జనం సాక్షి' వరుస కథనాలతో జీపీ రికార్డుల స్వాధీనం
- నాలుగు రోజులు గడిచినా క్లారిటీ ఇవ్వని అధికారులు
- విచారణ సాగుతుందా..? ఆగిందా..?
- అధికారుల తీరుపై అనుమానాలెన్నో?



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 01 (జనం సాక్షి) : వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గ్రామ పంచాయతీలో జరిగిన భారీ అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై 'జనం సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం కదిలిన విషయం తెలిసిందే. ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి గత శుక్రవారం బూర్గుపేట గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన కీలక రికార్డులు, ఎంబీ బుక్స్, బ్యాంక్ స్టేట్ మెంట్లు, చెక్ పవర్ రిజిస్టర్లు, బిల్లు వౌచర్లను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా ఉప సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.2 లక్షలు డ్రా చేసిన వ్యవహారం, రూ.1.25 లక్షలు దాటిన పనులకు చెక్ మెజర్ మెంట్ లేకుండా, రూ.5 లక్షలు దాటిన పనులకు ఉన్నత ఇంజనీరింగ్ అధికారుల ధ్రువీకరణ లేకుండా బిల్లులు ఎలా మంజూరు అయ్యాయి అనే అంశాలపై లోతుగా విచారణ చేపట్టారు.అయితే, విచారణ చేపట్టి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ జిల్లా పంచాయతీ అధికారులు ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్ కు ఎలాంటి నివేదిక సమర్పించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెండు రోజుల్లో నివేదిక ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు మౌనం వహించడంపై గ్రామస్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. జిల్లా పంచాయతీ అధికారుల విచారణ నిజంగా సాగుతుందా? లేక అక్కడే ఆగిపోయిందా? అనే చర్చ మండలంలో జోరుగా సాగుతోంది.విచారణకు వచ్చిన అధికారి ఫిర్యాదు చేసిన ఉప సర్పంచ్ కే చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక సామాన్యుడు ఫోర్జరీ చేస్తే వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. కానీ సర్పంచ్ చేస్తే మాత్రం రాజీ కుదుర్చేందుకు జిల్లా పంచాయతీ అధికారులే ప్రయత్నం చేయడం ఏమిటని అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫోర్జరీ నిరూపణ అయితే సర్పంచ్ పదవి కోల్పోవడంతో పాటు జైలు శిక్ష సైతం తప్పదు. ఈ నేపథ్యంలోనే సర్పంచ్ ను తప్పించేందుకు రాజకీయ ఒత్తిడితోనే విచారణను నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందా? అనే అనుమానం బలంగా వినిపిస్తోంది. విచారణను తూతూ మంత్రంగా ముగించి నివేదికను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగితే సహించేది లేదంటూ బూర్గుపేట గ్రామస్తులు, మండల ప్రజలు అధికారులను హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ములుగు జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని, సీజ్ చేసిన రికార్డులపై పూర్తి స్థాయిలో నిష్పక్షపాత విచారణ జరిపి, నివేదికను బహిర్గతం చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 1 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తోపాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలి



పాలకుర్తి, నవంబరు 01(జనంసాక్షి) రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలని, సీఐటీయు జిల్లా కార్యదర్శి మంచు విజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో శిశు మహిళల అభివృద్ధి యాప్ తో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజామ్, మంగమ్మ, సంతోష, వినోద, అమరావతి, శ్రావణి, శోభా రాణి, రజిత, రఘు, రమ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదతో బెంబేలు..

- స్లాబ్‌పై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు..
- చల్లూరుపల్లిలో కోతుల స్వైరవిహారం..
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు..
- ప్రజల ప్రాణాలతో చెలగాటం..
- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల డిమాండ్..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): కోతుల బెడద ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. ఇళ్లపైకి గుంపులుగా చేరి నిత్యం బీభత్సం సృష్టిస్తున్న కోతులను తరిమేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు స్లాబ్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాసింపల్లి 12వ వార్డు శివారు చల్లూరుపల్లిలో చోటుచేసుకుంది.

గ్రామానికి చెందిన బొర్రకుంట లక్షయ్య ఇంటి స్లాబ్‌పైకి కోతులు రావడంతో వాటిని తరిమేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి స్లాబ్‌పై నుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమవడంతో పాటు కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం లక్షయ్య వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. కోతుల బెడద కారణంగా ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

కోతుల స్వైరవిహారం.. ప్రజలకు కంటిమీద కునుకు కరువు..

భూపాలపల్లి మున్సిపాలిటీలో కోతుల సంచారం రోజురోజుకూ పెరిగిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపైకి, ఇంటి ఆవరణల్లోకి గుంపులుగా వస్తూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఇంట్లోని వస్తువులను చిందరవందర చేయడం, సామగ్రిని ధ్వంసం చేయడం నిత్యకృత్యంగా మారిందని వాపోతున్నారు. కోతులను తరిమేందుకు ప్రయత్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా జంకుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. నిత్యం కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపిస్తున్నారు.



ఇప్పటికైనా మేల్కొనాలి..

కోతుల బెడదను కేవలం చిన్న సమస్యగా చూడకుండా ప్రజల భద్రతకు సంబంధించిన అంశంగా అధికారులు పరిగణించాలని స్థానికులు కోరుతున్నారు. కోతుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుని ఎవరికైనా ప్రాణనష్టం జరిగేలోపు మున్సిపల్ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టణ ప్రజలకు కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ఓటు చోరీ, ప్రజా వ్యతిరేక విధానాలపై రామ్‌లీలా మైదానంలో

గళమెత్తిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు



నెరడిగొండ నవంబర్1 (జనంసాక్షి): ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలు బోథ్ నియోజక వర్గంలోని వివిధ మండల నాయకులతో కలిసి ఆడే గజేందర్ తోపాటు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సాయిచరణ్ గౌడ్ తెలంగాణ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఖలీద్ భాయ్ బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి ఆదిలా బాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ముఖ్య నాయ కులు కాంగ్రెస్ పార్టీ ఐక్యతను నాయకు లు కార్యకర్తల సమిష్టి కృషిని చాటిచెప్పేలా ఆదిలా బాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
02 నవంబర్ 2026

నూక నాయన చెరువులో అక్రమ బోర్లు సీజ్ చేయాలి

- శిఖం భూముల కబ్జాపై కదిలిన కోయలపాడు వాసులు
- అక్రమంగా బోర్ల తవ్వకం పట్టాల కోసం కబ్జాదారుల కుట్ర
- చెరువు వద్ద నిరసన ఆందోళన బాటలో గ్రామస్తులు
- అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్ ముట్టడి తప్పదు!



మాడుగులపల్లి, నవంబరు 1 (జనం సాక్షి) : మాడుగులపల్లి మండలం కోయలపాడు గ్రామ శివారులోని ప్రముఖ నూక నాయన చెరువు శిఖం భూములను అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువులో నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ బోర్లను వెంటనే సీజ్ చేయాలని కోయలపాడు గ్రామస్తులు డిమాండ్ చేశారు ఆదివారం రోజున కోయలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో గ్రామస్తులు పాల్గొని పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిబంధనలను, నీటి పారుదల చట్టాలను పూర్తిగా పక్కన పెట్టి కొందరు స్వార్థపరులు నూక నాయన చెరువు శిఖం భూముల్లోకి అక్రమంగా జొరబడ్డారని ఆరోపించారు ఏకంగా చెరువు గర్భంలోనే నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వ శిఖం భూములను అక్రమ మార్గాల్లో తమ పేరిట పట్టాలు చేయించుకోవడానికి వెనుక ఉండి చక్రం తిప్పుతున్నారని, నూక నాయన చెరువు భూమిని ఆక్రమిస్తున్న కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగమోత్మూరు, కోయలపాడు రెండు గ్రామాల రైతులకు ఎంతో జీవాధారమైన ఈ చెరువు భూములు ఆక్రమణకు గురైతే రాబోయే రోజుల్లో తాగు, సాగునీటి ఎద్దడి తీవ్రతరమవుతుందని గ్రామస్తులు తెలిపారు చెరువు భూములను ఆక్రమించి పొలాలుగా మార్చేస్తుండటంతో గ్రామానికి చెందిన వందలాది పశువులు, మూగజీవాలు మేతకు వెళ్లే దారిలేక తీవ్ర అవస్థలు పడుతున్నాయని వాపోయారు. ఈ భూములకు సంబంధించి రెవెన్యూ మాడుగులపల్లి మండలానికి, పోలీస్ స్టేషన్ పరిధి వేములపల్లికి చెందినది కావడంతో ఈ సరిహద్దు లొసుగులను కబ్జాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు కాబట్టి వేములపల్లి పోలీసులు, మాడుగులపల్లి రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపాలని డిమాండ్ చేశారు నూక నాయన చెరువు భూమిని కాపాడుతూ, చెరువులో అక్రమంగా వేసిన బోర్లను సీజ్ చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే, ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని కోయలపాడు గ్రామస్తులు హెచ్చరించారు.

కొత్త పెన్షన్లకు మోక్షం కలిగేనా..?

- నెలల తరబడి ఎదురుచూపులు..
- ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ఎప్పుడు అందేను చేయూత ?
- కొత్త పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వ ప్రకటనలు..
- ఆచరణలో జాప్యంపై లబ్ధిదారుల నిరీక్షణ!

తిరుమలాయపాలెం, నవంబర్ 1 (జనం సాక్షి) : తెలంగాణలో కొత్త సామాజిక భద్రతా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఎప్పుడు మోక్షం కలుగుతుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఎంతోమంది పేదలు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, వృద్ధాప్యంతో పాటు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలు నెలల తరబడి పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

మూడు లక్షల మందికి కొత్త పెన్షన్లు..?

రాష్ట్రంలో కొత్తగా అర్హులైన వారికి చేయూత సామాజిక భద్రతా పథకం కింద పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం 2026 ఆగస్టులో ప్రక్రియ ప్రారంభించింది. తొలివిడతలో సుమారు మూడు లక్షల మంది కొత్త లబ్ధిదారులను గుర్తించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31 వరకు అవకాశం కల్పించారు. గతంలో ప్రజాపాలన వారోత్సవాలు, ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను కూడా పరిశీలించాలని ప్రభుత్వం సూచించింది.

వీరికి కొత్త పెన్షన్లు అందే అవకాశం

ప్రభుత్వం ప్రకటించిన తొలిదశ ప్రాధాన్యత జాబితాలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా బాధితులు, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, హీమోఫీలియా బాధితులు ఉన్నారు. గతంలో నిర్ణయించిన ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే అర్హతలను పరిశీలించి పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

అక్టోబర్‌లో పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం

కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి అక్టోబర్‌లో, దసరా పండుగకు ముందే అర్హులకు పెన్షన్లు అందించాలని మంత్రి సీతక్క సెప్టెంబర్‌లో అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. అయితే నవంబర్ 1 నాటికి కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ పెన్షన్లు పంపిణీ పూర్తయినట్లు స్పష్టమైన అధికారిక సమాచారం అందుబాటులో లేదు. దీంతో లబ్ధిదారుల్లో నిరీక్షణ కొనసాగుతోంది.

తక్షణ పెన్షన్ సదుపాయంపై కీలక నిర్ణయం

ఇదిలా ఉండగా, ఇప్పటికే పెన్షన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే వారి భార్యకు వెంటనే పెన్షన్ అందించే తక్షణ పెన్షన్ సదుపాయాన్ని ప్రభుత్వం మరికొన్ని వర్గాలకు విస్తరించింది. దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు కూడా ఈ సదుపాయాన్ని వర్తింపజేస్తూ అక్టోబర్ 30న ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరణించిన పురుష పెన్షనర్ భార్యకు 57 ఏళ్లలోపు ఉంటే వితంతు పెన్షన్, 57 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేసే మార్గదర్శకాలను జారీ చేసింది.

గ్రామస్థాయిలో అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు



మండలాలు, గ్రామాల్లో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు తమ పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఎప్పుడు చేరుతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా కుటుంబానికి ఆదాయ వనరు లేక ఒంటరిగా జీవిస్తున్న మహిళలు, భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వితంతువులు, శారీరక వైకల్యంతో ఉపాధి పొందలేని దివ్యాంగులకు పెన్షన్ ఎంతో ఆసరాగా ఉంటుంది.

ప్రభుత్వం ప్రకటించిన హామీలు క్షేత్రస్థాయిలో ఎప్పుడు అమలవుతాయోనని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన ఎక్కడి వరకు వచ్చింది? అర్హుల జాబితా ఎప్పుడు ప్రకటిస్తారు? పెన్షన్లు ఏ నెల నుంచి అందిస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి లబ్ధిదారుల విజ్ఞప్తి

పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం కొత్త పెన్షన్ల విషయంలో జాప్యం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి త్వరితగతిన పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసి లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి నెలా పెన్షన్ నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేదల జీవితాలకు ఆసరాగా నిలవాల్సిన పెన్షన్.. ప్రకటనలకే పరిమితం కాకుండా ఎప్పుడు ఆచరణలోకి వస్తుందో వేచి చూడాలి!

పల్లెల్లో దొంగ బాబాల మాయాజాలం

- మట్టిబొమ్మలు, ముగ్గులతో భయభ్రాంతులు
- రాజపురం ఎస్సీ కాలనీలో అనుమానాస్పద వస్తువులు..
- పోలీసులకు సమాచారం



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 1 (జనం సాక్షి) : సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలు రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ మానవుడు అంతరిక్షంలో సైతం పరిశోధనలు చేస్తున్న ఆధునిక కాలంలోనూ మూఢనమ్మకాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. కొందరు మాయమంత్రాలు, చేతబడుల పేరుతో అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి భయాన్ని సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. మండల పరిధిలోని రాజపురం గ్రామ ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నివాస గృహాల మధ్య ఉన్న కూడలి వద్ద ముగ్గు వేసి, అందులో మట్టిబొమ్మ, నిమ్మకాయలు, మిరపకాయలు ఉంచడం కలకలం రేపింది. అందరూ నిద్రిస్తున్న సమయంలో వీధి దీపాలు ఆపివేసి ఈ వస్తువులను ఏర్పాటు చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. సోమవారం ఉదయం వాటిని గమనించిన కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ఈ విషయాన్ని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

మూఢనమ్మకాలతో ప్రజల్లో భయాందోళనలు

క్షుద్రపూజలు, చేతబడి, మంత్రతంత్రాల పేరుతో కొందరు ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. మట్టిబొమ్మలు, నిమ్మకాయలు, మిరపకాయలు వంటి వస్తువులను ఇళ్ల మధ్యలో ఉంచడం వెనుక ఉద్దేశం ఏమిటనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు బాధ్యులెవరో, వాటిని అక్కడ ఎవరు ఉంచారో విచారణలో తేలాల్సి ఉంది.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు ప్రజలు భయాందోళనలకు గురికాకుండా, వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రయత్నించాలని అవగాహన కలిగినవారు సూచిస్తున్నారు. మాయమంత్రాలు, చేతబడుల పేరుతో ఎవరైనా భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తే అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. రాజపురం ఎస్సీ కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురు పట్టివేత

- ఇద్దరి వద్ద పావు కిలో గంజాయి స్వాధీనం
- గంజాయి తాగుతూ దొరికిన వారికి యూరిన్ పరీక్షల్లో పాజిటివ్
- కోర్టు ఆదేశాలతో ఆరుగురు డీ-అడిక్షన్ సెంటర్‌కు,ఇద్దరు రిమాండ్‌కు తరలింపు
- యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- పోలీసుల హెచ్చరిక



దమ్మపేట, నవంబర్ 1 (జనం సాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు (ఐపీఎస్) ఆదేశాలు,పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ సూచనల మేరకు దమ్మపేట పోలీసులు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఆరుగురిని గుర్తించడంతో పాటు,వారి వద్ద గంజాయి దాచిన మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.శనివారం దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఆర్లపెంట గ్రామ శివారులోని స్మశాన వాటిక వద్ద ఆరుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ కనిపించారు.వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పరీక్షించగా.యూరిన్ డ్రగ్ టెస్టుల్లో అందరికీ టిహెచ్సి

పాజిటివ్‌గా నిర్ధారణ అయింది

అనంతరం వారిని విచారించగా లంకాలపల్లికి చెందిన పొట్ట సాయికుమార్ ఏ సాయి, నాగుపల్లికి చెందిన లవుడియా చైతన్య అనే ఇద్దరి వద్ద గంజాయి ఉన్నట్లు తేలింది.దీంతో పోలీసులు వారి నుంచి రూ. 12,500 విలువైన పావు కిలో గంజాయి,రెండు మొబైల్ ఫోన్లు,ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కోర్టులో హాజరు

ఈ కేసులో పట్టుబడిన ఎనిమిది మందిని దమ్మపేట కోర్టులో హాజరుపరిచారు.న్యాయస్థానం ఆదేశాల మేరకు గంజాయి సేవించిన ఆరుగురిని డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) సెంటర్‌కు తరలించగా,గంజాయి కలిగి ఉన్న పొట్ట సాయికుమార్, లవుడియా చైతన్యలను రిమాండ్‌కు తరలించారు.ఈ గంజాయి సరఫరా, విక్రయాల వెనుక ఉన్న మిగతా నిందితుల వివరాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,వీటి వల్ల భవిష్యత్తు, ఆరోగ్యం నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.గంజాయి అక్రమ రవాణా,విక్రయాలు, నిల్వ లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్సై బి.రాజేష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళిలో పోలీసుల విస్తృత తనిఖీలు

రాజోళి, నవంబర్ 1 (జనంసాక్షి) : గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి రాజోళి మండల కేంద్రంలో ఎస్ఐ కిరణ్ కుమార్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఓపెన్ బ్యూసింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, బెల్ట్ షాపులపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి



వాహనాలు నడపరాదని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈక్వలిటీ రన్‌లో మెరిసిన జడ్చర్ల రన్నర్స్

- ఆరోగ్యమే లక్ష్యంగా పరుగులు

జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి) : ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వమే లక్ష్యంగా ఆదివారం ముచ్చింతల్‌లో నిర్వహించిన ఈక్వాలిటీ రన్ రెండో ఎడిషన్‌లో జడ్చర్ల రన్నర్స్ ప్రతిభ చాటారు. 21కే, 10కే, 5కే విభాగాల్లో నిర్వహించిన పరుగులో మొత్తం 3,000 మందికి పైగా పాల్గొనగా, జడ్చర్ల నుంచి సుమారు 150 మంది రన్నర్లు హాజరయ్యారు. పోటీల్లో జడ్చర్లకు చెందిన రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ 10కే పరుగును 75 నిమిషాల్లో పూర్తి చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జడ్చర్ల రన్నర్లను ప్రోత్సహించడంలో రిటైర్డ్ పీడీ రామకృష్ణ, గోపాల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పరుగులో 20 ఏళ్ల యువకుల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు, విద్యార్థులు, రిపోర్టర్లు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నర్లకు శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి మెడల్స్ అందజేశారు. రన్నర్లకు టీ-షర్టులు, మెడల్స్, అల్పాహారం అందించారు. రోజువారీ పరుగుతో



జడ్చర్ల రన్నర్స్ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే మూడో ఎడిషన్‌లో జడ్చర్ల నుంచి 500 మందికి పైగా పాల్గొనేలా చూడాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఈక్వలిటీ రన్ నిర్వాహకులకు జడ్చర్ల రన్నర్స్ ధన్యవాదాలు తెలిపారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో పల్లెలు, పట్టణాల అభివృద్ధి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం
- మాజీ ఎంపీ నామ

మధిర, నవంబర్ 1 (జనంసాక్షి) : మధిర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అధ్యక్షతన ఆదివారం మధిర రూరల్, మున్సిపాలిటీ, ఎర్రుపాలెం మండలాల పార్టీ ముఖ్య నాయకులు, గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నవంబర్ 6వ తేదీలోపు పూర్తిస్థాయిలో పూర్తి చేసి విజయవంతం చేయాలని నామా సూచించారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి పిలుపును నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. పార్టీ నిర్ణయించిన కార్యాచరణకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ కష్టకాలంలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఓటర్లను చైతన్యపరచడం, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడం, గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసేలా పక్కా ప్రణాళికతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లోనూ ఓటమి పాలైందని పేర్కొంటూ, తెలంగాణలోనూ ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి అంతకంటే ఘోరంగా ఉందని వ్యాఖ్యానించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకుని, రాబోయే ఎన్నికల్లో పకడ్బందీ వ్యూహంతో పనిచేయాలన్నారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో విజయం చేజారినప్పటికీ ఏనుగుల రాకేష్ రెడ్డి నిరంతరం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజల మధ్యే ఉంటున్నారని నామా పేర్కొన్నారు. అలాంటి నాయకుడికి రాబోయే రోజుల్లో అండగా నిలిచి, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన నామా.. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కమిషన్ల వ్యవహారమే నడుస్తోందని, ప్రజల ఆస్తులు, సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అంటేనే దోపిడీ అన్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. జిల్లాలో మంత్రుల ద్వారా జరిగిన అభివృద్ధి శూన్యమని వ్యాఖ్యానించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని, ఆ సమయంలో విద్యుత్, తాగునీరు, సాగునీటి విషయంలో



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారని నామా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు, కార్యకర్తలు నిరంతరం స్పందిస్తూ ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, యువత, సీనియర్లు పరస్పర సమన్వయంతో ఒక టీమ్‌గా పనిచేయాలని, పార్టీ అధిష్ఠానం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నామా పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం ప్రతి ఒక్కరూ మరింత పట్టుదలతో పనిచేస్తూ మధిర నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మధిర రూరల్, మున్సిపాలిటీ, ఎర్రుపాలెం మండలాల కోఆర్డినేటర్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు బాధ్యులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందేశాలతో అలరించిన 36వ సీరతున్ నబీ జల్సా

- ప్రవక్త మహమ్మద్ (స) బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం



దేవరకొండ, నవంబర్ 1 (జనం సాక్షి) : ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపిన సన్మార్గం, మానవత్వం, ప్రేమ, కరుణ, సోదరభావం వంటి గొప్ప విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఇస్లామిక్ పండితులు తెలంగాణ,ఆంధ్రా అమీర్-ఎ-షరియత్ హజ్రత్ మౌలానా షా జమాలుర్ రెహమాన్ సాహెబ్,తెలంగాణ రాష్ట్ర జామియాతుల్ ఆధ్యక్షులు హజ్రత్ మౌలానా షా సయ్యద్ ఎహసన్ ఒద్దిన్ ఖాస్మీ సాహెబ్, మదర్సా కెహ్ఫుల్ ఇమాన్ హైదరాబాద్ నాజీమ్ ముఫ్తీ అబూబకర్ జాబెర్ ఖాస్మి సాహెబ్, మౌలానా మహమ్మద్ అక్బర్ ఖాన్ సాహెబ్ ఉస్తాద్ దారుల్ ఉలూశీ నల్గొండ పిలుపునిచ్చారు. దేవరకొండ ఈద్గా కమిటీ, మదర్సా మిస్బా ఉల్ ఉలుమ్, జమియత్ ఉలేమా ఏ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ సీరతున్ నబీ జల్సా అల్హాజ్ ముఫ్తీ సయ్యద్ అమ్జద్ అలీ ఖాస్మి ఖతిబే ఐడెన్ దేవరకొండ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. అనంతరం ముఖ్య అతిథులను కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక దువా నిర్వహించారు. ఈ జల్సాకు మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి, ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్, ముఫ్తి మహ్మద్ రిజ్వన్, ముఫ్తి యండి అఫ్రోజ్ ఖాన్ మౌలానా సయ్యద్ మాజీద్ అలీ, మదర్సా నాజిమ్ సాదిఖ్ హుస్సేన్ అలీ, హాఫిజ్ హబీబొద్దీన్, యండి రహత్ అలీ, మౌలానా నజీరోద్దీన్, కమిటీ సభ్యులు, జమియత్ సభ్యులతో పాటు నియోజకవర్గం నుండి దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
02.11.2026

భాజపా ఓట్లు చోరీ చేయదు..

మనసుల్ని దోచుకుంటుంది: సీఎం హిమంత

శిమ్లా: భాజపా ఓట్లు చోరీ చేయదు.. ప్రజల మనుసుల్ని దోచుకుంటుందని అస్సాం సీఎం, భాజపా నేత హిమంత బిశ్వ శర్మ అన్నారు. హిమాచల్‌ప్రదేశ్ శిమ్లాలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి– అరాచకాన్ని పారద్రోలండి' పేరిట నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ఈవీఎంలతోనే కాదు.. ఇటీవల పలు రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటమిపాలైందన్నారు. ఈవీఎంలతోనే హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తోందని విమర్శించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలను కాంగ్రెస్ నేతలు అంగీకరించారనీ.. కానీ, భాజపా గెలిచినప్పుడల్లా ఈసీని, ఎన్నికల ప్రక్రియను ప్రశ్నిస్తున్నారని హిమంత మండిపడ్డారు. దేశ ప్రజాస్వామ్య సమగ్రతను కాపాడేందుకు కచ్చితమైన ఓటరు జాబితాలు అవసర మన్నారు. దేశంలో అస్థిర వాతావరణాన్ని సృష్టించేందుకే బంగ్లాదేశ్, నేపాల్‌లోని రాజకీయ పరిణామాలను కాంగ్రెస్ వాడుకుంటోందని ఆరోపిస్తూ "భారత్ బంగ్లాదేశ్ కాదు.. ఒక ప్రజాస్వామ్యదేశం. ఇక్కడి ప్రభుత్వాలు రాజకీయ బెదిరింపులకో, వీధిస్థాయి అరాచకాలతో మారవు.. ప్రజల ఓట్లతోనే మారతాయి" అని అన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో యువతకు ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి వారికి ద్రోహం చేసిందన్నారు.

దేశీయ ఈక్విటీల నుంచి రూ. 34,843 కోట్ల విదేశీ సంపద వెనక్కి..

దేశీయ ఈక్విటీల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల నిధుల తరలింపు కొనసాగుతోంది. అక్టోబరులో దాదాపు రూ.34,843 కోట్ల మేరకు ఉపసంహరించుకున్నారు. వరుసగా రెండో నెలా భారీగా పెట్టుబడులను మళ్లించడం గమనార్హం. చమురు ధరల పెరగుదల, ద్రవ్యోల్బణ ఆందోళనలు, అమెరికా బాండ్లు ఆకర్షణీయంగా మారడం, దేశీయ కార్పొరేట్ ఆదాయాలు ఇందుకు కారణమని మార్కెట్ నిపుణులు తెలిపారు.జులైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్లు దేశీయ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు.. సెప్టెంబర్‌లో మాత్రం రూ.35,861 కోట్ల నిధులను ఉపసంహరించుకున్నారు. అక్టోబరులోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. తాజా నిధుల మళ్లింపుతో ఈ ఏడాదిలో దేశీయ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2.95 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే అక్టోబరు నెల ఆఖరులో విదేశీ మదుపర్లు నికర కొనుగోలుదారులు మారడం కలిసొచ్చే అంశంగా నిపుణులు భావిస్తున్నారు.గత ఐదు ట్రేడింగ్ సెషన్‌లలో రూ.6,300 కోట్ల పెట్టుబడులు దేశీయ మార్కెట్‌లోకి వచ్చాయి. అయితే, ఇటీవల అమెరికా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడం, దేశీయ లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో ఆకర్షణీయమైన వాల్యూయేషన్లు.. స్థిరమైన దేశీయ ఆర్థిక వృద్ధికి సంకేతంగా నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు, అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికలు, క్యూ2 త్రైమాసిక ఫలితాలు రానున్న రోజుల్లో విదేశీ మదుపర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.



కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

తెలంగాణ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ

ఓటు చోరీని ఎండగడతాం



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 01 (జనంసాక్షి) :కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన ఓట్ బచావో దేశ్ బచావో పిలుపు మేరకు న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఇండియా కూటమి భారీ బహిరంగ సభలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు కాంగ్రెస్ జెండాలు చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ పాదయాత్రలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడీసీసీ కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ ఇచ్చిన ఓట్ బచావో దేశ్ బచావో పిలుపు కాంగ్రెస్ పార్టీకి ఒక బాధ్యతతో కూడిన ఉద్యమమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చే ప్రతి పిలుపును గౌరవిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో కరీంనగర్ కాంగ్రెస్ శ్రేణులు పూర్తి స్థాయిలో భాగస్వాములవుతాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తూ ఓట్ల చోరీకి పాల్పడుతోందని సుగుణక్క ఆరోపించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది మాత్రమే కాదని, దేశంలోని ప్రతి ఓటరు హక్కులను కాపాడే జాతీయ ఉద్యమమని వైద్యుల అంజన్ కుమార్ పేర్కొన్నారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి కరీంనగర్ జిల్లా నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, మోడీ, అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ఓటు చోరీ రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతూ, పార్టీ అధిష్టానం ఇచ్చే ప్రతి పిలుపునకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా స్పందించి పోరాటం కొనసాగిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ నుండి ఇమ్రాన్, పెంట శేఖర్, కంకణాల అనిల్, ఆసిఫ్,హైమద్ అలీ, వరాల నర్సింగ్, పార్వతుల మల్లేశం, జగన్ రెడ్డి, కామ్రెడ్డి రామిరెడ్డి, స్వామి గౌడ్, సాయం తిరుపతి, శ్రీనివాస్, ప్రశాంత్, మహేష్, శ్రీకాంత్,ఇమ్రాన్ గని, ఆహద్, పలువురు సిడీసీసీ కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ర్యాలీలో సుడా మాజీ చైర్మన్

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):ఎఐసిసి పిలుపు మేరకు ఓటు చోరీ పై ఓటు బచావో దేశ్ బచావో ర్యాలీ రాంలీలా మైదాన్ లో బహిరంగ సభకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రనాయకులు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను కాపాడిన ఘనత సీఎందే..

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు



పెద్దపల్లి (జనంసాక్షి) :రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తూ 550 ఎకరాల భూమిని కోర్టులో న్యాయబద్ధంగా సాధించి తెలంగాణ రాష్ట్ర లక్షల కోట్ల ఆస్తిని కాపాడారని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. 1 లక్ష 50 వేల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం పరిరక్షించిందని నేడు కురిసిన వర్షాలతో చెరువులు కుంటలు కళకళలాడు తున్నాయని అన్నారు. నేడు ఎకరానికి 100 కోట్లు విలువ చేసే భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టులో తన మేధాశక్తితో రాష్ట్రానికి సాధించి తీసుకువచ్చారని వివరించారు. టిఆర్ఎస్ 10 సంవ త్సరాల కాలంలోతమ అనుచరులకు ప్రభుత్వ భూములను అప్పనంగా తక్కువ ధరలకు వారి పార్టీ వారికి ఇచ్చిన చరిత్ర వారిది అని ఎద్దేవా చేశారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నేడు వేలాది కోట్ల రూపాయల విలువైన భూములను కాపాడటం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూరిందని అన్నారు.బిఆర్ఎస్ నాయకులైన దామోదర్ రావు ను ముందు పెట్టి అటవీ భూములను, విలువైన భూములను నిర్వీర్యం చేసిన చరిత్ర బిఆర్ఎస్ ది అని అన్నారు .ముఖ్యమంత్రిపై అవాకులు చవాకులు పేలడం బి.ఆర్.ఎస్ నాయకులకు ఎంతవరకు సమంజసమని రాష్ట్ర సంపదను కాపా డటానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక అర్థం లేని మాటలు మాట్లాడటం హీనమైన చర్య అని విమర్శించారు.

హరీశ్‌కు ఘన స్వాగతం

పెద్దపల్లి,నవంబర్ 01(జనంసాక్షి) : బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు గోదావరిఖని పర్యటనలో భాగంగా ఆదివారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హరీష్ రావు ని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.అనంతరం హరీష్ రావు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఆయనను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా అభివాదం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.





వీధి కుక్కల స్వైరవిహారం..

సెంటినరీ కాలనీ క్వార్టర్స్‌లో భయాందోళనలో ఉద్యోగుల కుటుంబాలు

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని వినతి

రామగిరి,జనంసాక్షి: సెంటినరీ కాలనీలోని సింగరేణి క్వార్టర్స్‌లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు.కాలనీలోని రోడ్లు, క్వార్టర్స్ పరిసరాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతుండటంతో ఎప్పుడు దాడి చేస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు ఆడుకోవడానికి, మహిళలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వెళ్లడానికి సైతం భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.వీధి కుక్కల బెడదపై సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

పి.టి. స్వామి సంస్మరణ సభ

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పెద్దపల్లి,నవంబర్ 01(జనంసాక్షి) :
ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి.టి. స్వామి సంస్మరణ సభ ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించారు.ఈ సంస్మరణ సభకు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ లిఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డిలి హాజరయ్యారు.ఈ సందర్భంగా పి.టి. స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన పార్టీకి అందించిన సేవలను, ప్రజా సమస్యలపై చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. పి.టి. స్వామి మరణం బీఆర్ఎస్ పార్టీకి, ఆయనను అభిమానించే కార్యకర్తలకు తీరని లోటని పేర్కొన్నారు.అనంతరం లిదాసరి మనోహర్‌లి రెడ్డి పి.టి. స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,పి.టి.స్వామి కుటుంబ సభ్యులు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.


అట్టుడికిన జర్మనీ

గాయపడ్డారు. ఆందోళనలను అదునుగా చేసుకొని కొందరు ముసుగులు ధరించిన దుండగులు ఫ్రాంక్‌ఫర్ట్‌లోని పలు దుకాణాలలో చొరబడి సామాన్లు, ఇతర లగ్జరీ వస్తువులను దోచుకున్నారు. ఆందోళనకారులు పలు దుకాణాల కిటికీలు, వాహనాల అద్దాలు పగలగొట్టి.. బారికేడ్లకు నిప్పు పెట్టడంతో హింసాత్మక వాతావరణం నెలకొందని పోలీసులు పేర్కొన్నారు. వారిని అడ్డుకున్న సిబ్బందిపై మద్యం సీసాలు, పెట్రోల్ బాంబులు విసిరారని తెలిపారు. జాతి వ్యతిరేక శక్తులు ఆందోళనకారుల్లో కలిసి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని జర్మనీ ఫెడరల్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నిరసనలను అణచివేయాలని..లేదంటే పరిస్థితులు మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని యువతను హెచ్చరించింది. దోపిడీలు, దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించింది.

భారత్ 'బుల్లెట్ రైలు' ఫస్ట్ లుక్

మేకింగ్ వీడియో షేర్ చేసిన రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్





బెంగుళూరు(జనంసాక్షి):భారత్‌లో మొట్టమొదటగా ముంబయి–అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలును వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రైలును స్వదేశీ సాంకేతికతతో స్థానికంగానే అభివృద్ధి చేస్తుండటం విశేషం. ఇందుకు సంబంధించిన పనులు కర్ణాటకలోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ కేంద్రంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. అధునాతన ఇంజినీరింగ్ వ్యవస్థ, స్వదేశీ నైపుణ్యంతో భారత్‌లోని పరిస్థితులకు అనుగుణంగా బుల్లెట్ రైలును రూపొందిస్తున్నారు. ఈ కేంద్రాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పరిశీలించి, పనులను పర్యవేక్షించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ బుల్లెట్ రైలును రూపొందించామని, అత్యంత కఠినమైన స్ట్రీజ్ టెస్టు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది ముంబయి–అహ్మదాబాద్ మధ్య తొలి రైలు ప్రారంభం కానుంద న్నారు. బుల్లెట్ రైలు తయారీ, టెస్టులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ఓ వీడియో విడుదల చేశారు.

బుల్లెట్ రైలు విశేషాలు..

రైలు గరిష్ఠ పరీక్ష వేగం గంటకు 280 కి.మీ.. సాధారణ ప్రయాణ వేగం మాత్రం గంటకు 249 కి.మీటర్లు. రైలు పొడవు మొత్తం 202 మీటర్లు. 8 కోచ్‌లు ఉంటాయి. భవిష్యత్తులో రెండింటిని కలిపి 16 కోచ్‌ల రైలుగా మార్చేలా ఏర్పాట్లు. ప్రయాణికుల సామర్థ్యం 557 మంది. ఏడు సాధారణ కోచ్‌లలో 3ఏ2 సీటింగ్ ఉండగా.. మరో ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 2ఏ2 సీటింగ్ ఉంటుంది.రెండు వైపులా డ్రైవర్ క్యాబిన్ ఉంటుంది. నిర్వహణ కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ సత్వర నిర్ణయాలు తీసుకునేలా ఇంటెలిజెంట్ ఆన్‌బోర్డు కంట్రోల్ సిస్టమ్ ఉంటుంది



దేశీయ ప్రయాణికులకు అనుగుణంగా..

ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా లోపలి భాగాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రయాణికుల కాళ్ల ముందు సరిపడా స్పేస్ ఉండటం, దివ్యాంగులు లోపలికి ప్రవేశించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. లోపల ఎల్ఈడీ లైటింగ్, ప్రయాణికుల పైన బ్యాగేజ్ ర్యాక్‌లు, పెద్ద మొత్తంలో లగేజీ కోసం ఫ్లోర్‌పైనా ఏర్పాట్లు ఉన్నాయి. ల్యాప్‌టాప్, మొబైల్ పరికరాల ఛార్జింగ్ కోసం ప్రత్యేక పోర్టులు.. ప్రతి సీటు వరుసలో విశాలమైన కిటికీలు ఉండనున్నాయి. ఎల్‌సీడీ డిస్‌ప్లేలలో ఇంగ్లీష్, హిందీతోపాటు స్థానిక భాషల్లో సమాచారం, ప్రయాణికులకు సూచనలు చేసేందుకు ఆడియో అనౌన్స్‌మెంట్లు. అత్యవసర సమయంలో సిబ్బందితో మాట్లాడేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థతో పాటు ఆధునాతన టాయిలెట్లు అన్ని కాలాల్లో ఉష్ణోగ్రతలను నియంత్రించే హెచ్‌వీఏసీ వ్యవస్థ (హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండీషనింగ్). వీటికి సంబంధించి ప్రతి కోచ్‌లో రెండు యూనిట్లు ఏర్పాటు ప్రత్యేకమైన ఆకృతిలో రైలు ముందుభాగం ఉండనుంది. శబ్దాన్ని తగ్గించేందుకు వీలుగా బాడీ తయారీలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కరీంనగర్‌కు నితిన్ నబిన్

5న గాంధీబొమ్మ నుండి కమాన్ దాకా మహా పాదయాత్ర

- మహా పాదయాత్రకు 50 వేల మంది వచ్చేలా ఏర్పాట్లు
- కరీంనగర్ నేతలతో కేంద్ర మంత్రి బండి సన్నాహక సమావేశం



కరీంనగర్ బ్యూరో నవంబర్ 01 (జనంసాక్షి):
కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ మేయర్ డి.శంకర్, బాస సత్యనారాయణ, నల్లాల ఓదేలు, కోమల ఆంజనేయులు, గుజ్జ శ్రీను, రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు, రాజేందర్‌ప్రసాద్ లతో కలిసి కరీంనగర్లో సన్నాహ సమావేశం నిర్వహించారు.ఓట్లు తీసేసి నట్లు చెబుతున్న 13 కోట్ల ఓట్లలో కనీసం 13 మందిని తీసుకురాలేకపోయారని, సుప్రీంకోర్టు స్వయంగా సర్ ప్రక్రియ సహేతుకమే అని స్పష్టం చేసింది.విదేశీ శక్తులతో, విదేశీ ఆర్థిక సాయంతో బొద్దిక పార్టీ పెట్టిన వాళ్లతో, నేహ బోరా వంటి అరాచక శక్తులతో కలిసి కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మోదీ ప్రభుత్వాన్ని దెబ్బతీసే కుట్ర అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ అరాచక శక్తుల కుట్రలను ప్రజలకు తెలియజేసేందుకే దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు చేస్తున్నామని, అందులో భాగంగా తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్ లో ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఈ ర్యాలీలో భారీ ఎత్తున జనాన్ని సమీకరించాలని, వినూత్న రీతిలో దేశంలో 2 కోట్ల 80 లక్షల మంది చనిపోయారు. ఆ చనిపోయిన ఓట్లు తీసేయాలా? వద్దా? 1 కోటి ఓట్లు డబుల్ ఓట్లు, 6.3 కోట్ల ఓట్లు శాశ్వతంగా వలస పోయినోళ్లు, ఆచూకీ లేనోళ్లు. వాళ్ల ఓట్లు తీసేయాలా? వద్దా? ఒకే వ్యక్తి ఓటు రెండు, మూడు చోట్ల ఉంటే తీసేసి ఒకే చోట ఉండేలా చేయాలా? వద్దా? ఓటు హక్కు లేని వాళ్లకు ఓటు హక్కు కల్పించాలా? వద్దా? అక్రమంగా విదేశాల నుండి వలస వచ్చి ఇక్కడ ఓటు హక్కు పొందితే తీసేయాలా? వద్దా? పర్మిషన్లలో, ల్యాండ్ విషయంలో కానీ ఎవరిపై ఆరోపణలు వచ్చినా సహించే ప్రసక్తే లేదు. కలెక్షన్లకు దూరంగా ఉండాలి. ఏ కార్పొరేటర్ పైనైనా చిన్న ఆరోపణలు వచ్చినా బ్లాక్ లిస్ట్ లో పెడతనని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు.

జాతీయ అధ్యక్షుడే కరీంనగర్ వస్తున్నారు.

హైదరాబాద్ లో అమిత్ షా పాదయాత్ర కు జన సమీకరణ సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, చేవెళ్ల, మెదక్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుండి చేస్తున్నారు. 4 గురు ఎంపీలు జన సమీకరణ చేస్తున్నారు. కరీంనగర్ లో కథలాపూర్ నుండే 800 మందికిపైగా కార్యకర్తలను తీసుకొస్తున్నారు. ఇకనైనా మీ స్థాయి, మీ కెపాసిటీని బట్టి జనాన్ని, కార్యకర్తలను తీసుకురండి. ఎవరు ఎంత మందిని తీసుకొస్తారో నిజాయితీగా చెప్పండని, డివిజన్ల వారీగా బయట నుండి ఇంఛార్జీని పెట్టాలి. హల్ చల్ వాతావరణం క్రియేట్ చేయాలి. ఫ్లెక్సీలు, హోర్డింగులు పెట్టండి. మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయండి.. ప్రతి నాయకుడిపై 20కి పైగా కేసులున్నయ్. 20 శాతం మంది లీడర్లు జైలుకు వెళ్లారు. మీ గుండెపై చేయి వేసుకుని ఆత్మ విమర్శ చేసుకోండి. నేను పార్టీకి ఏం చేస్తున్నా. పార్టీ నాకేమిచ్చిందని అంటున్నరు. పార్టీ టిక్కెట్ ఇచ్చింది. పైసలిచ్చింది. మీ కోసం కష్టపడింది. 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంఖ్య బాగా వచ్చింది. మండలాల వారీగా మీటింగ్ లు జరుగుతున్నయ్. ప్రచారం జరుగుతోంది. మహిళా మోర్చా మీటింగ్ లు చాలా బాగా జరిగాయని, రామచంద్రరావు నాకు ఫోన్ చేసి చెప్పారు.కానీ కరీంనగర్ టౌన్ విషయానికొస్తే వెరీ పూర్ అని, నిరంతరం జనంలో తిరుగుతూ పార్టీని బలోపేతం చేస్తేనే మనం బలంగా ఉన్నట్లు అని, పార్టీ గుర్తే మన బలం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

అక్రమ కేసులతో కమ్యూనిస్టులను అణిచివేయలేరు

- ప్రజా పోరాటాలకు మేము అండగా ఉంటాం
- ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ క్షమాపణ చెప్పాల్సిందే
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్



గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం కార్పొరేషన్ పరిధిలో రామగుండం ఎమ్మెల్యే చేస్తున్న అక్రమాలను ప్రశ్నిస్తూ నిరసన కార్యక్రమము చేసిన సిపిఐ నాయకుల మీద..అలాగే కార్పోరేటర్ అనే గౌరవం లేకుండా విచక్షణ కోల్పోయి ఒక వీధి రౌడీ లాగ ప్రవర్తించి, బట్టలు చింపి, మెడలు పట్టి లాక్కెళ్ళడం, కింద పడేయడం, అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. రామగుండంలో ప్రజా పాలన చేస్తున్నామని చెబుతున్నప్పటికీ పోలీసు వ్యవస్థను వాడుకొని గుండాల రాజ్యాన్ని తలపించేలా పాలనను కొనసాగిస్తున్న రాజ్ ఠాకూర్ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. మక్కాన్సింగ్ తన అహం పూరిత ధోరణిని మానుకోవాలని ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ శ్రేణులను విచక్షణ కోల్పోయి అరెస్టు చేయించినందుకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ సిపిఐ నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రామగుండం ప్రజలు నీ గుండాయిజాన్ని ఒప్పుకోరని ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు ఏ వ్యవస్థపై గౌరవం లేదని ప్రజలపై కానీ చట్టాలపై గాని భారత రాజ్యాంగంపై గాని ఎటువంటి గౌరవం లేదని ప్రజాప్రతినిధులను సైతం అగౌరవపరిచే రీతిలో పోలీసులను వాడడం సరైన పద్ధతి కాదని వారు హితవు పలికారు . ఒక బాధ్యయుతమైన సీఐ పదవిలో ఉన్న ఇంద్రసేనారెడ్డి ప్రజా పోరాటాలు చేసే వారితో గౌరవమైన పద్ధతిలో మెదలాలి తప్ప, దొంగలు, గుండాలతో వ్యవహరించినట్టుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, ఈ పద్ధతిని మానుకోవాలని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ కలిసిన వారిలో సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య సిపిఐ జిల్లా సమితి సభ్యులు శనిగరపు చంద్రశేఖర్ తో పాటు బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్ మాజీ ఫ్లోర్ లీడర్ నారాయణదాసు మారుతి బిఆర్ఎస్ 41 డివిజన్ ఇంచార్జ్ నీరటి శ్రీనివాస్ అలాగే సిపిఐ నాయకులు రాణవేణి సుధీర్ కుమార్, ఆసాల నవీన్ పోతరాజు నాగరాజు, మార్కపురి భగత్ ఉన్నారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

- సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- పాము కాటు బాధితురాలి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆరోపణ
- చర్యలు లేకుంటే నిరాహార దీక్ష చేపడతామని దండు వినోద్ హెచ్చరిక



సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (జనంసాక్షి): సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్‌పై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దండు వినోద్ మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలానికి చెందిన ఓ మహిళ వ్యవసాయ పనుల సమయంలో పాము కాటుకు గురవడంతో కుటుంబ సభ్యులు తొలుత ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నంలో ముందుగా డీఎంహెచ్‌వోను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్‌కు ఫోన్ చేశామని చెప్పారు. పరిస్థితిని వివరించినప్పటికీ ఆయన బాధ్యతారహితంగా స్పందించారని ఆరోపించారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి అవసరమైన వైద్య సూచనలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అధికారులు అందుబాటులో ఉండి సేవలు అందించడం బాధ్యత అని అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేష్, కార్మిక విభాగం అధ్యక్షుడు కోడూరు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి నరేందర్, మండల అధ్యక్షులు లక్కపాక రాకేష్, గుండేటి చంద్రశేఖర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ భవనం

- రెండేళ్లుగా నిరుపయోగం.. పట్టించుకోని అధికారులు
- ప్రజలకు అందని వైద్య సేవలు.. ఇబ్బందులు పడుతున్న రోగులు

గంభీరావుపేట, నవంబర్ 1, జనం సాక్షి: లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనం రెండేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో ప్రజలకు వైద్య సేవలు అందకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేమితో గంభీరావుపేట మండల కేంద్రంలో పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో విశాలమైన గదులు, ల్యాబ్, ఫార్మసీ తదితర సౌకర్యాలు కల్పించారు. భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు లింగన్నపేట పీహెచ్‌సీ భవనంలో కొనసాగుతున్నాయి. దీంతో మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పేదలకు పెద్దదిక్కుగా ఉండాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాధనంతో నిర్మించిన భవనం రెండేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో లోపల పరిస్థితి ఎలా ఉందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భవనాన్ని జిల్లా అధికారులు పరిశీలించి వెళ్లినా ప్రారంభానికి సంబంధించి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు నిత్యం అవసరమైన వైద్య సేవలు అందించడంలో స్థానిక నాయకులు చొరవ చూపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పీహెచ్‌సీ భవనాన్ని వెంటనే ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ జలాలకు బదులు శుద్ధి చేసిన నీరు

- ఎంఎంసి కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి
- డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్ సేవలు ప్రారంభం
- మొక్కల పెంపకం, నిర్మాణ పనులకు పునర్వినియోగం
- టోల్ ఫ్రీ నంబర్ 155313 ద్వారా సేవలు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 01 (జనంసాక్షి) : భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గిస్తూ, శుద్ధి చేసిన మురుగునీటిని సమర్థవంతంగా పునర్వినియోగించుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణతో పాటు భవన నిర్మాణ పనులకు సైతం శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో నాగోల్ ఎస్టీపీ వద్ద 'డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్' సేవలను జెండా ఊపి గ్రీన్ ట్యాంకర్‌ను ప్రారంభించారు.

మూడు ప్రాంతాల్లో సేవలు

నాగోల్‌తో పాటు మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్ జోన్లలోనూ గ్రీన్ ట్యాంకర్ సేవలను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ నల్లచెరువు సమీపంలో, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో సరూర్‌నగర్‌లో ట్యాంకర్లను ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో రహదారి మీడియన్లలో మొక్కల పెంపకం, పచ్చదనం నిర్వహణకు అవసరమైన నీటి వినియోగ ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. శుద్ధి చేసిన నీటిని తాగు నీరు అవసరం లేని పనులకు వినియోగించాలనుకునే వారు టోల్ ఫ్రీ నంబర్ 155313కు కాల్ చేసి డయల్-ఎ-గ్రీన్ ట్యాంకర్ సేవలను పొందవచ్చు. నీటి ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గించడం, నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు.

నిర్మాణ పనులకూ వినియోగించాలి


ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మొక్కల పెంపకం, పార్కులు, గార్డెనింగ్‌తో పాటు భవన నిర్మాణ పనుల వంటి తాగునీరు అవసరం లేని అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సూచించారు. ఇందుకోసం బోరు నీటిపై ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా భూగర్భ జలాలను కాపాడుకోవచ్చన్నారు. ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.పంకజ, యూబీడీ డైరెక్టర్ సునంద పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి

కాంక్రీట్ మిల్లర్ తగిలి తీవ్రగాయాలు.. ఆసుపత్రిలో మృతి


కథలాపూర్, నవంబరు 1 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహనదారుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పెద్దకాపు అశోక్ (తండ్రి అప్పారావు) ప్రస్తుతం బొమ్మెన గ్రామంలో నివసిస్తున్నాడు. అక్టోబరు 31న మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై బొమ్మెన నుంచి మోత్కూరు రావుపేటకు వెళ్తుండగా గంభీర్‌పూర్ శివారులో ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న టాటా ఇంట్రా వాహనాన్ని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో దాని వెనుక అమర్చిన కాంక్రీట్ మిల్లర్ ఊడిపోయి అశోక్‌కు తగిలింది. దీంతో తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు డ్రైవర్ సలంగన మాలకొండయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచలింగాల గ్రామంలో మొసలి కలకలం



మర్పల్లి నవంబర్ 01(జనంసాక్షి): మండల పరిధిలోని పంచలింగాల్ గ్రామ శివారులోని వాగు సమీపంలో ఆదివారం ఉదయం మొసలి కనిపించడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. గ్రామ శివారులో ఉన్న వాగు సమీపానికి ఓ రైతు వెళ్లగా అక్కడ మొసలి కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన రైతు వెంటనే అప్రమత్తమై ఇతర రైతులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న పలువురు రైతులు సమిష్టిగా ధైర్యం చేసి మొసలిని తాడుతో బంధించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వాగు పరిసర ప్రాంతాల్లో మొసలి సంచారం ఉండటంతో రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి మొసలిని సంగారెడ్డి జిల్లా సమీపంలో ఉన్న మంజీర ప్రాజెక్ట్ ఉన్న సురక్షితంగా వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించారు. అడవి శాఖ సిబ్బంది కిషన్, రాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి



ముస్తాబాద్ జనం సాక్షి : మృతుడు అయిన కోటగిరి శ్రీకాంత్,38 సంవత్సరాలు అనునతడు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలం వద్దకు బర్లకు నీళ్లు పెట్టడానికి అని వెళ్లి తిరిగి ఇంటికి రానందున మృతుని గురించి వెతుకుచుండగా తన పొలం వద్ద గల బావిలో శవమై తేలి ఉన్నాడని, మృతుడు బర్లకు నీరు పెట్టడానికి పోవుచుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయినాడు అని మృతుని భార్య పుల్లూరి శిరీష ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనైనది.

శంకుస్థాపనలకే పరిమితమైన సిరికొండ బైపాస్ రోడ్డు

- ఏళ్ల తరబడి ఎదురుచూపులేనా..? భారీ వాహనాల రాకపోకలతో ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు!






సిరికొండ నవంబర్ 01 (జనం సాక్షి): సిరికొండ మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణం లేకపోవడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలు, భారీ ట్రక్కులు గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా ప్రయాణి స్తుండటంతో పాదచారులు, వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే సమయంలో స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి పలుమార్లు శంకుస్థాపనలు చేసినప్పటికీ, పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయా యని స్థానికులు పేర్కొంటున్నారు. మూడు, నాలుగు సార్లు శంకుస్థాపనలు చేసినా నేటికీ రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా బైపాస్ రోడ్డు సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ, ఇప్పటివరకు ఈ పనులపై స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంత సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. మార్కెట్‌కు వచ్చే ప్రజలు, వ్యాపారులు, భారీ వాహనాల రాకపోకలతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభిస్తోంది. అత్యవసర సమయాల్లో కూడా వాహనాలు సాఫీగా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది.

ఇకనైనా శంకుస్థాపనలకే పరిమితం కాకుండా బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. సిరికొండకు బైపాస్ రోడ్డు ఎప్పుడు వస్తుంది? ప్రజల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? అంటూ మండల కేంద్ర ప్రజలు, యువకులు ప్రశ్నిస్తున్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని కేటీఆర్‌కు విన్నపం


- క్వింటాల్‌కు రూ.300 కమీషన్, నెలకు రూ.5,000 గౌరవ వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి



ఆర్మూర్, నవంబర్ 1 (జనంసాక్షి): ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రైతు గర్జన సభకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను ఆర్మూర్‌లోని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి నివాసంలో రేషన్ డీలర్ల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.నిజామాబాద్ జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్ష, కార్యదర్శుల ఆదేశాల మేరకు ఆర్మూర్ మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు అబ్దుల్ అజీమ్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలోని రేషన్ డీలర్లు ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని కమీషన్‌తో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజలకు నిరంతరంగా రేషన్ సరుకుల పంపిణీ సేవలు అందిస్తున్నారని వివరించారు.కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్ల కమీషన్ పెంపుతో పాటు ప్రతి రేషన్ డీలర్‌కు నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదురుచూస్తున్నారని తెలిపారు.ప్రతి క్వింటాల్‌కు కనీసం రూ.300 కమీషన్ చెల్లించడంతో పాటు, ప్రతి రేషన్ డీలర్‌కు నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ అంశాన్ని తెలంగాణ శాసనసభలో ప్రస్తావించి రేషన్ డీలర్లకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కేటీఆర్‌ను సవినయంగా విజ్ఞప్తి చేశారు.రేషన్ డీలర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా, వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కే. ఆశన్న, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, రమేష్, అర్షద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పారువెల్లలో విషాదం.. బాలుడి మృతి

గన్నేరువరం, నవంబర్ 1 (జనంసాక్షి): పారువెల్ల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎలుక జశ్వంత్ యాదవ్ (11) ఆదివారం మృతి చెందాడు. మృతుని తల్లి ఎలుక రజిత ఫిర్యాదు మేరకు, నవంబర్ 1 ఆదివారం ఉదయం తాను వ్యవసాయ కూలి పనికి వెళ్లగా ఇంట్లో ఇద్దరు కుమారులు ఉన్నారని, తిరిగి ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చేసరికి పెద్ద కుమారుడు జశ్వంత్ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఉన్నాడని తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని తెలిపారు. రజితకు ఇద్దరు కుమారులు ఉన్నారని, చిన్న కుమారుడు ఇంట్లోనే ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం తండ్రి ఎలుక నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు.




భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం... లైసెన్సుడ్ సర్వేయర్ లైసెన్స్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి); రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన విధులు నిర్వర్తించడంలో అలసత్వం ప్రదర్శించిన లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సస్పెన్షన్ చేశారు.భూముల రీ సర్వేలో భాగంగా మొదటి దశలో జిల్లాలోని 70 గ్రామాల్లో రీ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లతో పాటు, ప్రభుత్వ ఆమోదం పొందిన లైసెన్సుడ్ సర్వేయర్లు భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొంటున్నారు.గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కొనసాగుతుండగా, సర్వే కోసం కేటాయించిన లైసెన్సుడ్ సర్వేయర్ ఎం.బాలకృష్ణ గత కొన్ని రోజుల నుండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొనకుండా, గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత లైసెన్సుడ్ సర్వేయర్ పై చర్యలు తీసుకున్నారు.లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యమైన అధికారులు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- బహిరంగ మద్యం సేవనంపై ఆంక్షలు కొనసాగింపు
- డీజేలు, డ్రోన్ల వినియోగానికి పోలీసుల అనుమతి తప్పనిసరి
- ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలకూ ముందస్తు అనుమతి
- నవంబరు 1 నుంచి డిసెంబరు 1 వరకు అమలు



గోదావరిఖని, జనంసాక్షి: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అధిక శబ్దంతో డీజేలు వినియోగించడం, అనుమతి లేకుండా డ్రోన్లు ఎగురవేయడంపై ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసభ్యకరంగా ప్రవర్తించడం, మహిళలు, సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి ఘటనలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డీజేలు, మైక్‌సెట్ల అధిక శబ్దం వల్ల చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమాల్లో మైక్‌సెట్లు వినియోగించాలంటే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు, వేడుకల్లోనూ డ్రోన్లను వినియోగించరాదని కమిషనర్ హెచ్చరించారు. ప్రజా భద్రత, ముఖ్యమైన ప్రాంతాల రక్షణ దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై నిఘా కొనసాగుతుందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్-2016లోని సెక్షన్ 7(1), 22తో పాటు సిటీ పోలీస్ యాక్ట్-1348 ఫసలీ, పోలీస్ యాక్ట్-1861 నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. నవంబరు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి డిసెంబరు 1వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా నిరసన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. బంద్‌లు, ఆందోళనల పేరుతో దుకాణాలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఉద్యోగులు విధులకు వెళ్లకుండా అడ్డుకోవడం, వ్యాపారులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223, సంబంధిత పోలీస్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు.



ఓటర్ల హక్కుల పరిరక్షణకు ప్రజాప్రతినిధుల గళం

- ఓట్ల తొలగింపుపై ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు పుల్కం రాజు డిమాండ్
- ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియ నిలిపివేసి తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, నవంబరు 1 (జనంసాక్షి): ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఓటరు జాబితాల్లో అక్రమ తొలగింపులను నిరసిస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీలో వేములవాడ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో తెలంగాణ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు సాగిన ప్రదర్శనలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఈసీ నియామకం, రక్షణకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పత్రాలతో నిర్వహించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ర్యాలీలో వేములవాడకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

చందానగర్ పరిధిలో యువతి, యువకుడు అదృశ్యం

వేర్వేరు ఘటనల్లో మిస్సింగ్.. పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు





శేరిలింగంపల్లి, నవంబరు 1 (జనంసాక్షి): చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు ఘటనల్లో ఓ యువతి, ఓ యువకుడు అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం నాగన్నపల్లికి చెందిన బోయిని తుకారం నల్లగండ్లలోని గ్రీన్ హోమ్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన పెద్ద కుమార్తె మౌనిక (21) శనివారం మధ్యాహ్నం స్నానం చేస్తానని చెప్పి బట్టలు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. గతంలో వరప్రసాద్ అనే యువకుడిని ప్రేమిస్తున్నట్లు తండ్రికి చెప్పగా, ఆయన అంగీకరించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మౌనికకు పెళ్లి సంబంధాలు చూస్తున్న క్రమంలో ఆమె అదృశ్యం కావడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో శిల్పా ఎన్‌క్లేవ్‌లో నివసించే వాచ్‌మెన్ నల్లబెల్లి సింహాచలం కుమారుడు వెంకటరమణ (18) అదృశ్యమయ్యాడు. పటాన్‌చెరు పరిధిలోని మంజీరా కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న అతడు శనివారం ఉదయం కళాశాలకు వెళ్లాడు. అయితే 11 గంటల సమయంలో కళాశాలకు రాలేదని యాజమాన్యం నుంచి తండ్రికి సమాచారం అందింది. సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకున్న వెంకటరమణ కొద్దిసేపటికే స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

నిజామాబాద్‌లో ఐసీఏఐ ప్రత్యేక బ్రాంచ్ ప్రారంభం

- ప్రారంభించిన ఆల్ ఇండియా అధ్యక్షుడు సీఏ ప్రసన్నకుమార్
- సీఏలు, విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ
- ఐటిటి, జీఎంసీఎస్ సహా ప్రత్యేక కోర్సులు
- భవిష్యత్తులో సొంత భవనం నిర్మాణానికి కృషి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 1 (జనంసాక్షి): నిజామాబాద్, పరిసర జిల్లాల చార్టర్డ్ అకౌంటెంట్లు, సీఏ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించే లక్ష్యంతో నగరంలోని ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిజామాబాద్ బ్రాంచ్‌ను ఆ సంస్థ ఆల్ ఇండియా అధ్యక్షుడు సీఏ డి.ప్రసన్న కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ చైర్మన్ సీఏ ఫణి చక్రవర్తి మాట్లాడుతూ ప్రత్యేక బ్రాంచ్ ఏర్పాటు ఈ ప్రాంత సీఏలతో పాటు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. వృత్తిపరమైన శిక్షణ, జ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధికి ఇది కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. సీఏ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బ్రాంచ్ అభివృద్ధితోపాటు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రమాణాలను సాధిస్తూ నిరంతరంగా అభివృద్ధి చెందితే భవిష్యత్తులో సొంత స్థలం, ప్రత్యేక భవనం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. బ్రాంచ్ ద్వారా సీఏలు, విద్యార్థులకు ఐటిటి, జీఎంసీఎస్ శిక్షణ, నిరంతర వృత్తి విద్యా కార్యక్రమాలు, ప్రత్యేక కోర్సులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ సందర్భంగా సీఏ సుబ్బారావు ముప్పాల, భాను నారాయణ్, వై.తిరుపతయ్య, సునీల్ మండవ, దీపక్ లడ్డాలను వృత్తికి వారు అందించిన సేవలకు గుర్తుగా సత్కరించారు. కార్యక్రమంలో ఐసీఏఐ మేనేజింగ్ కమిటీ సభ్యులు సీఏ రాజేష్ బ్యాంగ్, మహేష్ జాజు, శ్రీకాంత్ ఝువర్, గోవింద్ ముందాడ, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు. సీఏ శైలేష్, స్మితా శర్మ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. నిజామాబాద్, కరీంనగర్, ఆర్మూర్, కామారెడ్డి ప్రాంతాల సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, టాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ వృత్తి, వ్యాపార సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ బ్రాంచ్ ద్వారా ప్రాంతీయంగా సీఏ విద్య, వృత్తి నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించనుంది.



మణికొండకు నార్సింగి సర్కిల్ కార్యాలయం తరలింపు

రాజేంద్రనగర్, నవంబర్1(జనంసాక్షి): నార్సింగి సర్కిల్ కార్యాలయాన్ని సోమవారం నుంచి మణికొండలోని ల్యాంకో హిల్స్ సమీపంలోని భవనానికి తరలించినట్లు డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి తెలిపారు. ఇకపై పౌర సేవలు నూతన కార్యాలయం నుంచే అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. నార్సింగి కార్యాలయంలో అరకొరక వసతుల కొరతపై స్థానిక నాయకులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి మణికొండలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కార్యాలయం తరలింపుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, నార్సింగిలోనే కార్యాలయాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక

- 7 నుంచి 8 నెలల తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి
- ఎస్సారెస్పీలో 36 టీఎంసీల నీటి నిల్వ
- యాసంగిలో ఆరుతడి, ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం
- ఉపాధి హామీతో జూన్-జూలై వరకు నీటి సంరక్షణ పనులు



జగిత్యాల బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా జగిత్యాల జిల్లా యంత్రాంగం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. తాగు, సాగునీటి అవసరాలు, భూగర్భ జలాలు, విద్యుత్ వినియోగం, వ్యవసాయ రంగంపై ప్రభావాన్ని అంచనా వేస్తూ సమగ్ర ప్రణాళిక రూపొందించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేయగా, కలెక్టర్ బి.సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 815.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 896.7 మి.మీ.తో పోలిస్తే 9 శాతం లోటు ఉంది. జగిత్యాల రూరల్, జగిత్యాల, కోడిమ్యాల మండలాలను మోస్తరు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా మండలాల్లో పంట దిగుబడులు 34 నుంచి 41 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా. జిల్లాలోని 920 చెరువుల్లో 572 చెరువులు 75 శాతానికి పైగా నిండి ఉండగా, 148 చెరువుల్లో 50 శాతం కంటే తక్కువ నీటి నిల్వలున్నాయి.

జిల్లాకు కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 36 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. కాకతీయ ప్రధాన కాలువ ద్వారా 18 మండలాలకు, ఫ్లడ్ ఫ్లో కాలువ ద్వారా ఎనిమిది మండలాలకు సాగునీరు అందుతోంది. ఖరీఫ్‌లో 4,20,908 ఎకరాల్లో పంటలు సాగవగా, ఇందులో 3,02,900 ఎకరాల్లో వరి ఉంది. మొత్తం సాగు విస్తీర్ణంలో వరి వాటా 72 శాతం కావడంతో రానున్న యాసంగిలో నీటి అవసరం తక్కువగా ఉండే మొక్కజొన్న, కందులు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని అధికారులు నిర్ణయించారు. 2026-27 రబీ సీజన్‌లో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 2,419 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాలో 85,974 బోర్లకు గాను 62 శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. 34 శాతం బోర్లలో నీటి దిగుబడి తక్కువగా ఉండగా, నాలుగు శాతం ఎండిపోయాయి. భూగర్భ జలాల పెంపునకు బోర్‌వెల్ రీచార్జి, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, సోక్‌పిట్లు, కాంటూరు కందకాలు, స్టోన్ ట్రెంచెస్ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సెప్టెంబరులో సగటు భూగర్భ జలమట్టం 3.65 మీటర్లుగా నమోదైంది. ప్రస్తుతం రానున్న రెండు నెలల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 385 గ్రామ పంచాయతీల పరిధిలోని 501 ఆవాసాలకు బల్క్ వాటర్ సరఫరా ద్వారా 73.6 శాతం అవసరాలు తీరుతుండగా, పట్టణాల్లో 91 శాతం మేర సరఫరా జరుగుతోంది. అత్యవసర పరిస్థితుల కోసం 3,287 చేతిపంపులు, 2,225 మోటార్లు, 528 బహిరంగ బావులను సిద్ధంగా ఉంచారు. రానున్న ఏడు నుంచి ఎనిమిది నెలల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. మరోవైపు విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబరులో 33.32 శాతం పెరిగి 119.96 మిలియన్ యూనిట్లకు చేరింది. విద్యుత్ సరఫరా సామర్థ్యం పెంచేందుకు తొమ్మిది కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 1,068 సోలార్ కనెక్షన్ల ద్వారా 12.68 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులో ఉంది.

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశిస్తున్నారు. ఫామ్ పాండ్ల నిర్మాణాలు లక్ష్యానికి చేరువయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే జూన్-జూలై వరకు పనులు కొనసాగించాలని, ప్రతి గ్రామంలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు. నీటి సంరక్షణ పనులతో పాటు జాబ్‌కార్డు కుటుంబాలకు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. అన్ని శాఖల సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో నీటి వనరులను కాపాడి భవిష్యత్తు అవసరాలకు భద్రత కల్పించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది.

పట్టభద్రుల ఓటు నమోదుకు ఈ నెల 6 చివరి గడువు

- అర్హులందరూ ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- గతంలో నమోదైన వారూ మళ్లీ నమోదు చేసుకోవాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకం : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా, నవంబర్ 1 (జనంసాక్షి): హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదుకు ఈ నెల 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఫారం-18 ద్వారా నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవా లని సూచించారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదైన వారు సైతం ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటరు నమోదుకు దూరం కాకూడదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు విలువైనదని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, నిరుద్యోగ సమస్యలు, యువత ఆకాంక్షలు, విద్యారంగ అభివృద్ధి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసేందుకు ఓటు హక్కు ముఖ్యమైన సాధనమని తెలిపారు. పట్టభద్రులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతోపాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులకు కూడా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

పామెన గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..యువకుడు మృతి

చేవెళ్ల, నవంబర్ 01 (జనంసాక్షి) : చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పామెన గేట్ సమీపంలో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కల్వర్టు వద్ద అదుపుతప్పిన ఇన్నోవా కారు రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడటంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన రాజ్ కుమార్ (25) తన ఇన్నోవా కారు ఏపీ 29 సీఏ 4437లో స్నేహితులైన మురళి గౌడ్ (26), ఒగ్గు వెంకటయ్య (40), కార్ల శివకుమార్ (25)లతో కలిసి పోతుగల్ నుంచి చేవెళ్ల వైపు బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10:15 గంటల సమయంలో పామెన గేట్ సమీపంలోని కల్వర్టు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న రాజ్ కుమార్‌తో పాటు మురళి గౌడ్, ఒగ్గు వెంకటయ్యలకు తీవ్ర రక్తగాయాలు కాగా, కార్ల శివకుమార్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వెంటనే భాస్కర ఆసుపత్రికి తరలించారు. అయితే రాజ్ కుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మురళి గౌడ్, ఒగ్గు వెంకటయ్యలకు మెరుగైన చికిత్స అందించేందుకు కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి చెదురుపల్లి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చల్లూరులో సోలార్ పవర్ ప్లాంట్‌లో కేబుల్ వైర్ల చోరీ

గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు : ఎస్ఐ ఆవుల తిరుపతి

వీణవంక నవంబర్ 1(జనం సాక్షి) : వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన కలవేణి రాధిక భర్త రాజనర్సుకు చెందిన సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ప్లాంట్ నిర్మాణంలో భాగంగా కేబుల్ వైర్లు ఏర్పాటు చేస్తుండగా, గత కొద్ది రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు రెండుసార్లు కేబుల్ వైర్లను కత్తిరించి దొంగిలించారు. గత నెల తేదీ 30-10-2026 31-10-2026 తేదీలలో కూడా గుర్తుతెలియని వ్యక్తులు సోలార్ ప్లాంట్ వద్దకు వచ్చి కేబుల్ వైర్లను కత్తిరించి దొంగిలించుకుపోయారు. చోరీకి గురైన కేబుల్ వైర్ల విలువ సుమారు 90,000/- రూపాయలు ఉంటుందని ఫిర్యాదుదారుడు కలవేణి గణేష్, వీణవంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వీణవంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, గుర్తుతెలియని నిందితులను గుర్తించి పట్టుకునేందుకు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కరువు కోరల్లో ధారూర్.. రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి
- కరువు మండలంగా ప్రకటించి రూ.200 కోట్ల నిధులు విడుదల చేయాలి
- రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల సరుకులు ఉచితంగా ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం నాయకుల డిమాండ్



ధారూర్, నవంబర్ 1 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున ధారూర్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండిపోయిన ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివారం ధారూర్ మండల కేంద్రంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జెండాను ఆవిష్కరించిన సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మదులపల్లి సుదర్శన్, కార్యదర్శి ఆర్.మహిపాల్ మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయని, బోరుబావుల్లో నీటిమట్టం తగ్గడంతోపాటు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికందకపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, ధారూర్‌ను కూడా ఆ జాబితాలో చేర్చి రూ.200 కోట్ల ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్, ముఖ్యమంత్రి స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను అంచనా వేయాలని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు బీమా, రైతుబంధు ప్రయోజనాలు అర్హులందరికీ అందించాలని విజ్ఞప్తి చేశారు.

కోట్‌పల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల కాలువలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతోపాటు పప్పు, నూనె, చింతపండు, చక్కెర, కారం తదితర 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 15న నిర్వహించనున్న 36వ అఖిల భారత కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జంగయ్య, నర్సింలు, లాలయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య, సత్తయ్యతోపాటు వివిధ గ్రామాల రైతులు అనంతయ్య, యాదయ్య, రాములు, పెంటయ్య, నర్సింలు, మల్లేష్, రమేష్‌బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు 50 వేల మందితో భారీ సభ

- నవంబర్ 29న అలుగునూర్‌లో నిర్వహణకు సన్నాహాలు
- నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర
- మేడిగడ్డ నుంచి సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన
- గంగుల కమలాకర్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా నేతల భేటీ



కరీంనగర్ టౌన్, నవంబర్ 1 (జనంసాక్షి): తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న అలుగునూర్ లేదా నుస్తులాపూర్‌లో 50 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకత్వం నిర్ణయించింది. 2009 నవంబర్ 29న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దీక్షకు సిద్ధమైన అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన ఘటనకు గుర్తుగా ఈ వేడుకలు నిర్వహించనున్నారు. సభ నిర్వహణ, పార్టీ కార్యాచరణ, రైతుల సమస్యలపై చర్చించేందుకు ఆదివారం కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11 నుంచి 14 మధ్య రెండు రోజులపాటు బస్సు యాత్ర చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రలో గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వలు, పంపిణీ, రైతులకు అందుతున్న సాగునీటిపై అధ్యయనం చేయనున్నారు. సాగునీటి కొరతతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతోపాటు తాగునీరు, విద్యుత్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నేతలు భావిస్తున్నారు. యాత్రకు సంబంధించిన ఖచ్చితమైన తేదీలను త్వరలో ఖరారు చేయనున్నారు. దీక్షా దివస్ సభలో కేసీఆర్ చేపట్టిన దీక్ష, ఆయన అరెస్టు అనంతరం ఉద్యమం ఉధృతమైన తీరును వివరించడంతోపాటు తెలంగాణ సాధనలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల సేవలను స్మరించుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, సాగునీటి వనరులు, రైతుల సమస్యలు, ప్రభుత్వ విధానాలను సభలో ప్రస్తావించాలని నిర్ణయించారు. బస్సు యాత్రతోపాటు గ్రామస్థాయిలో సమావేశాలు, కరపత్రాలు, పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేపట్టనున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నాయకులు సమన్వయంతో పనిచేసి జన సమీకరణ, వేదిక ఏర్పాటు, ప్రచార బాధ్యతలను నిర్వహించాలని చర్చించారు.

సమావేశంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రులు జీవన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, పుట్ట మధు, కోరుకంటి చందర్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, దేవేందర్‌రెడ్డి, కోలేటి దామోదర్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు జి.వి.రామకృష్ణారావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కొండూరు రవీందర్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత, సిద్ధం వేణు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో ఎన్నికల కమిషన్ విఫలం

- అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌కు ఓటు హక్కు కల్పించాలి
- అధికారుల నిర్లక్ష్యంతో నమోదు ప్రక్రియకు ఆటంకాలు
- సనత్‌నగర్, అమీర్‌పేటలో నమోదు కార్యక్రమాల్లో తలసాని
- కాలనీలు, బస్తీల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచన



సనత్‌నగర్, నవంబరు 1 (జనంసాక్షి): అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంలో ఎన్నికల కమిషన్ అధికారులు విఫలమయ్యారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఆదివారం సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల నుంచి బీఆర్ఎస్ నాయకులు సేకరించిన దరఖాస్తులను అధికారులకు అందజేయడానికి వెళ్తే సరిపడా సిబ్బంది లేరని చెబుతున్నారని ఆరోపించారు. ఓటరు నమోదు బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

2023 వరకు డిగ్రీ పూర్తి చేసిన వారినే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారని, 2025 వరకు పట్టభద్రులైన వారికి ఎందుకు అవకాశం కల్పించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలోనే నమోదు ప్రక్రియ చేపట్టడం, దీనిపై విస్తృత ప్రచారం చేయకపోవడం సరికాదన్నారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, బస్తీల్లో ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి దరఖాస్తులు అందించేలా పార్టీ నాయకులు కృషి చేయాలని సూచించారు.

సనత్‌నగర్ డివిజన్ మోడల్ కాలనీలోని పూజిత అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పట్టభద్రులు తమ దరఖాస్తులను తలసానికి అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, శేఖర్, హరి, పీయూష్ గుప్త, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అమీర్‌పేట డివిజన్ బి-టైప్ క్వార్టర్స్‌లోని శ్రీరామ టవర్స్, ఎస్ఆర్‌టీ పరిధిలోని సిటీజన్స్ ఎన్‌క్లేవ్‌లోనూ ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్‌కుమార్, కూతురు నర్సింహ, గుడిగే శ్రీనివాస్ యాదవ్, కట్టా బలరాం, ప్రదీప్‌గౌడ్‌తో పాటు కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు. పలువురు పట్టభద్రులు దరఖాస్తులు అందజేశారు.

అమరుల ఆశయ సాధనకు ఐక్య పోరాటాలు నిర్మించాలి

- పొట్ల రామనర్సయ్య 50వ వర్ధంతి సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత రాజన్న
- విప్లవోద్యమ అమరులకు నాయకుల నివాళులు
- కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకు కృషి చేస్తాం
- ప్రజా సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేయాలి



గోదావరిఖని, (జనంసాక్షి): భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన విప్లవోద్యమంలో అమరులైన వారి ఆశయ సాధనకు ప్రజలను ఐక్యం చేసి బలమైన పోరాటాలు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పొట్ల రామనర్సయ్య 50వ వర్ధంతి సభ నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు ఈ.నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత విప్లవోద్యమంలో ఎందరో నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడి ప్రాణాలర్పించారని, వారందరికీ విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు దాటినా దేశంలో సంపూర్ణ విప్లవం సాధించలేకపోయామని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీల మధ్య చీలికలు ఇందుకు ప్రధాన కారణమని తమ పార్టీ భావిస్తోందన్నారు. పార్టీల ఐక్యత కోసం కృషి చేస్తూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తామని చెప్పారు. చారు మజుందార్, సత్యనారాయణ సింగ్, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, పొట్ల రామనర్సయ్య, జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ తదితర అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు పోరాటాలు కొనసాగించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగం పెరుగుతున్నా ఉద్యోగాల కల్పనపై తగిన చర్యలు లేవని, ప్రజా సమస్యలను ప్రశ్నించే మేధావులు, బుద్ధిజీవులపై కేసులు నమోదు చేసి జైళ్లలో నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. సభలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్, పార్టీ జిల్లా నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, తోకల రమేష్, మెరుగు చంద్రయ్య, ఐ.రాజేశం, బతుకుల రాజన్న, ఎస్.ప్రసాద్, పులిపాక మల్లేష్, కొండ్ర మొగిలి, రాజేశ్వరరావు, పీవైఎల్ నాయకులు ఆరుముళ్ల తిరుపతి, ఈ.బాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎన్.రాజేందర్, పుట్టపాక స్వామి, బండ పద్మ, కె.పద్మ, శ్రీజ, ఎం.కొమురయ్య, పోగుల శేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సుమారు వందమంది కార్యకర్తలు హాజరయ్యారు.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 02 నవంబర్ 2026

గచ్చిబౌలి స్టేడియంలో మారథాన్ గెలిచిన

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



శేరిలింగంపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి) : అతనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్... ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయాన్నే సంతోషంగా బయటికి వచ్చి ఎన్ఈబి సంస్థ నిర్వహించిన మారథాన్(నడక పోటీ)లో అంతే ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు ముందు వరసలో నిలిచి ఏకంగా మెడల్ ను బహుమతిగా అందుకున్నాడు. కానీ విధి ఆడిన విషాద నాటకంలో తాను బలిపీఠం ఎక్కి ఒక్కసారిగా కుప్పకూలి మైదానంలోనే దుర్మరణం చెందాడు. స్థానికులను, తోటి ఉద్యోగులను తీవ్రంగా కలచివేసిన ఈ విషాద వసంతం గురించి గచ్చిబౌలి పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం మరికొన్ని మున్సిపాలిటీ పరిధి అల్వాపూర్ లో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కొనసాగుతున్న కొమ్మినేని గోపి(36) ఆదివారం సంస్థకు సెలవు కావడంతో ఉదయాన్నే బయటికి వచ్చి ఎన్ఈబి సంస్థ నిర్వహించిన మారథాన్ కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు మంచి ప్రదర్శనను కనబరిచి ముందు వరసలో నిలవడంద్వారా నిర్వాహకులచేత ప్రశంసలతోపాటు మెడల్ నుసైతం అందుకున్నాడు. అయితే నిర్వాహకుల ఆహ్వానం మేరకు అల్పాహారం తీసుకోవడానికి స్టేడియంలోని ఓ ప్రాంతానికి నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి కింద పడడంతో అతని వెంట నడుస్తున్నవారు మారథాన్ నిర్వాహకులకు సమాచారం అందించగా వారు వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో గచ్చిబౌలి స్టేడియం సహా కేర్ ఆస్పత్రి, గోపి నివాసముండే అల్వాపూర్ ప్రాంతంలో తీవ్ర విషాదఛాయలు అలుముకోవడం జరిగింది. అప్పటివరకు తమలో ఒకడిగా ఎంతో సంతోషంగా గడిపిన కొమ్మినేని గోపి అకాల మరణం జీర్ణించుకోలేని విషయమని పలువురు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ



- **29.2 తులాల బంగారం, 28 గ్రాముల వెండి, రూ.1.20 లక్షల నగదు అపహరణ..**
- **మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నం**

అల్వాల్, నవంబరు 1 (జనంసాక్షి): అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జానకీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడిన దొంగలు 29.2 తులాల బంగారం, 28 గ్రాముల వెండి, రూ.1.20 లక్షల నగదును అపహరించారు. ఇదే ప్రాంతంలోని మరో రెండు ఇళ్లలోనూ చోరీకి విఫల యత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం.. బాధితుడు నర్సింహామూర్తి దమ్మాయిగూడలోని బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఎదురింటివారు సమాచారం ఇవ్వడంతో ఆయన తిరిగి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. తాము ఇంట్లో లేని విషయం తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అల్వాల్ సీఐ ప్రశాంత్, డీఐ ప్రవీణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంచర్ వద్ద బాధితుల నిరసన

రాజాపేట (జనంసాక్షి) : రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని 322 సర్వే నంబర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయిన బాధితులు రెండు రోజులుగా ధర్నా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం 322 సర్వే నంబర్‌లో శ్రీ కస్ట్టక్షన్స్ డెవలపర్స్ చేసిన ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోయిన లబ్ధిదారులు ధర్నా నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆహార పానీయాలు లేకున్నప్పటికీ పట్టువదలకుండా తమ ఆందోళనను కొనసాగిస్తూ, నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 2019 జూన్ 19వ తేదీన శ్రీ కస్ట్టక్షన్స్ డెవలపర్స్ వారు 322 సర్వే నంబర్‌లో 70 ఎకరాల 22 గుంటల స్థలంలో 600 ప్లాట్లను విక్రయించగా, సుమారు రూ.100 కోట్లను శ్రీ కస్ట్టక్షన్స్ డెవలపర్స్ వారు సొమ్ము చేసుకుని ప్లాట్లను అప్పగించలేదని బాధితులు వాపోయారు. అంతేకాకుండా, కే. శ్రీనివాసరావు తన భాగస్వామ్యం పై ప్రశ్నిస్తూ చేసిన ఫిర్యాదు మేరకు డీటీసీపీ లే అవుట్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, 2026 జనవరి 24వ తేదీన 600 ప్లాట్లను రద్దు చేసినట్లు తెలిపారు. దీంతో తాము నష్టపోయినట్లు చెప్పారు.

ఈ విషయం పై శ్రీ కస్ట్టక్షన్స్ డెవలపర్స్ నిర్వాహకులు యశ్వంత్, శ్రీనివాసరావు, చిట్టినేని శ్రీకృష్ణ, రాజేశ్వరి, శ్రీదేవి, జయరాంరెడ్డిలను సంప్రదించే ప్రయత్నం చేస్తుండగా, వారు అందుబాటులో లేకుండా బెదిరింపులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. సొంత ఇంటి కల నెరవేర్చుకునే క్రమంలో అప్పులు చేసి, తాళిబొట్లు తాకట్టు పెట్టి, లోన్లు తీసుకొని ప్లాట్లు కొనుగోలు చేసినట్లు బాధితులు ఆవేదనతో తెలిపారు. రెండు రోజులుగా చేపడుతున్న ప్రజాస్వామ్య ఆందోళన పట్ల శ్రీ కస్ట్టక్షన్స్ యాజమాన్యం తప్పుదోవ పట్టిస్తూ, అప్పలరాజు అనే వ్యక్తి ద్వారా తమ న్యాయపోరాటాన్ని వక్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఈ విషయంపై ఇంటెలిజెన్స్ పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తూనే ఉంటామని ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయిన లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు.

భూ వివాదం వెనుక భారీ కుట్ర?

- **సిర్పూర్ శివారులో ఎకరం భూమిపై వివాదం..**
- **జేసీబీతో నాలుగు గదుల ఇల్లు నేలమట్టం!**
- **2006 జూన్ 26న తాళ్ల పద్మాబాయి నుంచి భూమి కొనుగోలు చేశానంటున్న నారాయణరెడ్డి**
- **20 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నానని బాధితుడి వెల్లడి**
- **2024, 2025లో రెండుసార్లు భూ సర్వే చేయించారని వెల్లడి**
- **30 నుంచి 40 మంది వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణ**
- **అక్టోబర్ 31న జేసీబీతో ఇంటి కూల్చివేత.. రూ.10 లక్షల నష్టం**
- **కొందరు రాజకీయ నాయకులు, విలేకరుల ప్రమేయం ఉందంటూ బాధితుడి సంచలన ఆరోపణలు**
- **పోలీసులకు ఫిర్యాదు..**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 1 (జనంసాక్షి): ఒక ఎకరం భూమి.. రెండు వర్గాల మధ్య హక్కుల వివాదం.. ప్రభుత్వ భూమి కేటాయింపు అంశం.. రెండుసార్లు సర్వేలు.. బెదిరింపులు.. చివరకు జేసీబీతో ఇల్లు కూల్చివేత! నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం సిర్పూర్ గ్రామ శివారులో చోటుచేసుకున్న ఈ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 602/140 పరిధిలో తనకు సంబంధించిన భూమిలో నిర్మించుకున్న నాలుగు గదుల ఇంటిని కొందరు వ్యక్తులు జేసీబీతో కూల్చివేశారని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన తిప్పులూరి నారాయణరెడ్డి (53) ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన భూమిని స్వాధీనం చేసుకునేందుకు కొందరు వ్యక్తులు పథకం ప్రకారం వ్యవహరిస్తున్నారని, స్థానిక రాజకీయ నాయకులు, కొందరు విలేకరుల ప్రమేయం కూడా ఉందని ఆయన చేసిన ఆరోపణలు ఈ వివాదానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 602/140 పరిధిలో ముదక్‌పల్లికి చెందిన తాళ్ల పద్మాబాయి వద్ద నుంచి 2006 జూన్ 26న ఒక ఎకరం భూమిని కొనుగోలు చేసినట్లు పేర్కొంటున్నారు. ఇందుకు



సంబంధించిన సేల్ డీడ్ పత్రాన్ని కూడా చూపిస్తున్నారు. అందులో తాళ్ల పద్మాబాయి విక్రయదారుగా, తిప్పులూరి నారాయణరెడ్డి కొనుగోలుదారుగా పేర్లు ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ పత్రం రిజిస్ట్రేషన్ వివరాలు, భూమి విస్తీర్ణం, హక్కుల స్థితిని సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల ద్వారా ధ్రువీకరించాల్సి ఉంది.భూమి కొనుగోలు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 20 సంవత్సరాలుగా అక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని నారాయణరెడ్డి తెలిపారు. కాలానుగుణంగా కూరగాయలు, వరి పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని వెల్లడించారు. 2008 సంవత్సరంలో అదే భూమిలో నాలుగు గదులతో కూడిన ఇంటిని నిర్మించుకుని నివాసం ఉంటున్నట్లు వివరించారు.

2024 సంవత్సరంలో బాలయోగి అవధూత నిర్మలానంద స్వామీజీగా చెప్పుకుంటున్న జట్టు మారాజు అనే వ్యక్తి తెరపైకి వచ్చారని నారాయణరెడ్డి ఆరోపిస్తున్నారు. ఇదే సర్వే నంబర్ పరిధిలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని ఆయన పేర్కొన్నట్లు బాధితుడు చెబుతున్నారు. దీంతో ఒక ఎకరం భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న తనకు, ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపును ప్రస్తావిస్తున్న మరో వర్గానికి మధ్య వివాదం ప్రారంభమైందని తెలిపారు. భూమి హక్కుల విషయంలో వివాదం తలెత్తడంతో 2024, 2025 సంవత్సరాల్లో రెవెన్యూ అధికారుల ద్వారా సర్వేయర్‌తో రెండుసార్లు భూమిని సర్వే చేయించినట్లు నారాయణరెడ్డి చెబుతున్నారు. తన పొలం హద్దులను గుర్తించి కంచె నిర్మించుకోవాలని భావించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. సర్వే నిర్వహించిన నివేదికలు, హద్దుల నిర్ధారణ వివరాలు అధికారుల వద్ద ఉన్నాయని, వాటిని పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని కోరుతున్నారు.ఒకవేళ భూమిపై రెండు వర్గాల మధ్య హక్కుల వివాదం ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులు, న్యాయస్థానాల ద్వారా పరిష్కరించుకోవాల్సి ఉండగా.. వ్యక్తులు స్వయంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పొలంలోనే కాల్చి బూడిద చేస్తామని బెదిరింపులు

తన భూమిని వదిలేయాలని ఒత్తిడి చేస్తూ సుమారు 30 నుంచి 40 మంది వ్యక్తులు పొలం వద్దకు వచ్చి తనను ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ బెదిరించారని నారాయణరెడ్డి ఆరోపిస్తున్నారు. పొలంలోనే కాల్చి బూడిద చేస్తామని హెచ్చరించారని, ఎవరు వచ్చినా వెనక్కి తగ్గేది లేదంటూ భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు.

తన పొలంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలను సైతం బెదిరించడంతో పాటు కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో తాను, తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. ఈ బెదిరింపులపై కూడా పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో 2026 అక్టోబర్ 31వ తేదీ ఉదయం సుమారు 10 గంటల సమయంలో జట్టు మారాజు, ఆయన శిష్యుడు మణిక్యం, జేసీబీ డ్రైవర్ సుధాకర్‌తో పాటు మరికొందరు వ్యక్తులు తన ఇంటి వద్దకు వచ్చారని నారాయణరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండా జేసీబీని తీసుకొచ్చి తన ఇంటిని కూల్చివేశారని ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నాలుగు గదుల నిర్మాణం పూర్తిగా ధ్వంసమైందని, ఇంటి శిథిలాలు ప్రస్తుతం అక్కడే ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనలో తనకు సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదం వెనుక మరో కోణం ఉందంటూ నారాయణరెడ్డి తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నిజామాబాద్ నగరానికి చెందిన కొందరు విలేకరుల సహకారంతోనే గత రెండేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తోందని ఆయన ఆరోపించారు. వివాదాస్పద భూమి తమకు దక్కిన తర్వాత అందులో వాటా ఇస్తామని కొందరు విలేకరులతో ఒప్పందం చేసుకున్నారనే అనుమానం తనకు ఉందని పేర్కొన్నారు.మీడియా సహకారం ఉందనే ధీమాతోనే స్వామీజీగా చెప్పుకుంటున్న వ్యక్తి, ఆయన అనుచరులు తమపై ఒత్తిడి తెస్తున్నారని, తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మీడియా పేరును అడ్డుపెట్టుకుని భూ వ్యవహారంలో కొందరు వ్యక్తులు లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేశారు.

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

తనకు జరిగిన అన్యాయం, ఇంటి కూల్చివేత, బెదిరింపులపై నారాయణరెడ్డి మోపాల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన ఇంటిని కూల్చివేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు జరిగిన రూ.10 లక్షల ఆస్తి నష్టానికి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇకపై తనను, తన కుటుంబ సభ్యులను ఎవరూ బెదిరించకుండా పోలీసు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు.

39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ లోగో ఆవిష్కరణ

- **హెచ్ బిఎఫ్ ప్రాంగణానికి రచయిత్రి 'జీలానీ బానో' పేరు**
- **320 పుస్తక స్టాళ్ల ఏర్పాటు.. పఠనాసక్తిని పెంపొందించేలా కార్యక్రమాలు : పి.నారాయణ రెడ్డి**



హైదరాబాద్, నవంబర్ 01 (జనంసాక్షి) : 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బుక్ ఫెయిర్ లోగోను హెచ్ బిఎఫ్ సొసైటీ సభ్యులు ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో ఈసారి పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి పి. నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టిఆర్ స్టేడియంలో డిసెంబర్ 18 నుంచి 28 వరకు నిర్వహించే పుస్తక ప్రదర్శనలో సాహితీవేత్తలు, రచయితలు, అనువాదకుల సేవలను గుర్తుచేసేలా ప్రాంగణం, వివిధ వేదికలకు వారి పేర్లను ఖరారు చేసినట్లు వెల్లడించారు. 39వ బుక్ ఫెయిర్ ప్రాంగణానికి ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త, కథా, నవలా రచయిత్రి జీలానీ బానో పేరు పెట్టినట్లు తెలిపారు. మహిళలు, పిల్లల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన జీలానీ బానో సాహిత్య సేవలను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆమె రచనలు సామాజిక మార్పుకు దోహదపడేలా ఉంటాయని, పద్మశ్రీతో పాటు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారని వివరించారు. అదేవిధంగా సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత, అనువాదకుడు ముక్తవరం పార్థసారథి పేరు, పుస్తకావిష్కరణల వేదికకు ప్రముఖ దళిత హక్కుల కార్యకర్త, విద్యావేత్త, రచయిత డా. వై.బి. సత్యనారాయణ పేరు ఖరారు చేసినట్లు చెప్పారు. రైటర్స్ స్టాళ్లకు సదానంద శారద, ఏటుకూరి ప్రసాద్ పేర్లను, మీడియా స్టాళ్లకు తెలిదేవర భానుమూర్తి పేరును కేటాయించినట్లు వెల్లడించారు.

హెచ్ బిఎఫ్ ఉపాధ్యక్షుడు కె.బాల్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి బుక్ ఫెయిర్ అన్ని విభాగాలు కలిపి సుమారు 320 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు సంబంధించిన గ్రౌండ్ డిజైన్ ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యనిర్వాహక వర్గ సభ్యులు కవి యాకుబ్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనలో బాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్ బి టి) కలిసి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేలా ఈ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సంయుక్త కార్యదర్శి రజని మాట్లాడుతూ బుక్ ఫెయిర్ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరుతూ తెలంగాణ సాహిత్య అకాడమీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం, తెలుగు సహా వివిధ భాషల సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయడం, రచయితలు, ప్రచురణకర్తలు, పాఠకులకు ఒకే వేదిక కల్పించడం బుక్ ఫెయిర్ ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు. సలహా మండలి సభ్యులు రమా మేల్కోటే, కె.రామచంద్రమూర్తి, మాట్లాడుతూ పుస్తక ప్రియులు, రచయితలు, ప్రచురణకర్తలు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ విజయ వంతం చేయాలని కోరారు. ఈ సమావే శంలో కోశాధికారి కె.సురేష్, ఉపాధ్యక్షుడు బి.శోభన్ కె.సజయ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాబోయేది

బీజేపీ ప్రభుత్వమే..!

- **నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్**

జగిత్యాల (జనంసాక్షి) : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, మూడింట రెండు వంతుల మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. అమృత్ 2.0 లో భాగంగా 3 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన మోతే చెరువు సుందరీకరణ పనులను పర్యవేక్షించేందుకు జగిత్యాలలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, ఆరు నెలలుగా పనులు ప్రారంభించకపోవడంపై ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభించకుండా శంకుస్థాపనలు ఎందుకు చేశారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ప్రశ్నించారు. పనుల పురోగతిపై అధికారులను నిలదీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్రంలో సునామీలా వస్తుందని, అధికారంలోకి రావడానికి రాజ్యాంగ బద్ధంగా ఏదైనా చేస్తామని వ్యాఖ్యానించారు. తమకు ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. ఢిల్లీ, బెంగాల్‌లో బీఆర్ఎస్ తరహా రాజకీయ ప్రత్యర్థులను ఓడించిన విధంగానే తెలంగాణలోనూ బీఆర్ఎస్‌ను ఓడిస్తామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని గుడ్డి ప్రభుత్వం గా అభివర్ణించిన అరవింద్.. మాది మెల్ల ప్రభుత్వం అంటూ బీఆర్ఎస్ నాయకులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కేటీఆర్ చేస్తున్న ట్వీట్ల సమయాన్ని కూడా గమనించాలని వ్యాఖ్యానించారు.

కోదాడలో 150 కిలోల గంజాయి సీజ్!

కోదాడ (జనంసాక్షి) : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కోదాడ టౌన్ పోలీసులు రట్టు చేశారు. హోండా సిటీ కారులో భారీగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఈశ్వర్, శివప్ప, ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజు కలిసి గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి వివిధ ప్రాంతాలకు రవాణా చేసి విక్రయించడం ద్వారా భారీగా డబ్బు సంపాదించాలని కుట్ర పన్నారు. ఇందుకోసం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సెల్వ సూర్య, రాజగౌడన్ మురుగన్‌లను తమ అక్రమ వ్యాపారంలోకి దించారు. ప్రతి ట్రిప్పుకు ఒక్కొక్కరికి రూ.20 వేలతో పాటు గంజాయి విక్రయించిన తర్వాత అదనంగా రూ.30 వేల చొప్పున చెల్లిస్తామని ఆశ చూపారు. ఇందుకోసం ఓ కారును ఏర్పాటు చేసి రాజమండ్రి నుంచి బెంగళూరుకు గంజాయిని తరలించే బాధ్యత అప్పగించారు. సుమారు నెల రోజుల క్రితం కూడా సెల్వ సూర్య, రాజగౌడన్ మురుగన్‌లు ఇదే తరహాలో 27 గంజాయి ప్యాకెట్లను రాజమండ్రి



నుంచి బెంగళూరుకు తరలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తిరిగి గంజాయి రవాణాకు అంగీకరించిన వీరిద్దరూ అక్టోబర్ 29న కర్ణాటక నుంచి బయలుదేరి 30వ తేదీ రాత్రి రాజమండ్రికి చేరుకున్నారు. అక్టోబర్ 31న ఒడిశా నుంచి రాజు తీసుకొచ్చిన 62 ప్యాకెట్లలోని సుమారు 150 కిలోల గంజాయిని కారులో లోడ్ చేసుకున్నారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరారు.అక్రమ గంజాయి రవాణా పై నిఘా ఉంచిన పోలీసులు అక్టోబర్ 31న ఎన్‌హెచ్-65పై కోదాడ పట్టణ శివారులోని దుర్గాపురం క్రాస్‌రోడ్ సమీపంలో అనుమానాస్పదంగా వస్తున్న హోండా సిటీ కారును గుర్తించి ఆపేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులను గమనించిన కారు డ్రైవర్ సెల్వ సూర్య వేగంగా వాహనాన్ని నడుపుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు కారును వెంబడించి కమ్మ కాకతీయ ఫంక్షన్ హాల్ సమీపంలో అడ్డగించారు. అనంతరం కారులో ఉన్న సెల్వ సూర్య, రాజగౌడన్ మురుగన్‌లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడింది. మధ్యవర్తుల సమక్షంలో కారులో ఉన్న 62 ప్యాకెట్లలోని సుమారు 150 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన హోండా సిటీ కారు, రూ.15 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ఈ కేసులో సెల్వ సూర్య, రాజగౌడన్ మురుగన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ అక్రమ గంజాయి రవాణా వ్యవహారంలో కర్ణాటకకు చెందిన ఈశ్వర్, శివప్ప, ఒడిశాకు చెందిన రాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శివశంకర్, ఎస్ఐలు అజయ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, నవీన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370